ఆరవ సంపుటము] [రెండవ సంచిక

# గ్రంథాలయ సర్వస్వము

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమున ప్రకటింపబడు సచిత్ర మాసపత్రిక.

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము — బెజవాడ.

సంపాదకుడు:
అయ్యంకి వేంకట రమణయ్య.

## విషయసూచిక


| | | |
|---|---|---|
| ౧ | పరీక్ష — వేలూరి శివరామశాస్త్రిగారు | ౩౭ |
| ౨ | ధర్మజిజ్ఞాస: ధర్మస్వరూపము — దర్భా శ్రీనివాసులు, బి.ఏ., బి.ఎల్., | ౩౯ |
| ౩ | విరహారాధిక (పద్యములు) — పాటిబండ అప్పారావుగారు బి.ఏ., బి.ఎల్., | ౪౩ |
| ౪ | జాతీయవిద్య — కురుగంటి సీతారామయ్యగారు ఎం.ఏ., | ,, |
| ౫ | మొగమోటము (పద్యములు) | ౪౯ |
| ౬ | ఆంధ్రగీర్వాణవిద్యాలయము — కొవ్వూరు | ,, |
| ౭ | అమరగానము (పద్యములు) — కొడాలి ఆంజనేయులుగారు | ౫౦ |
| ౮ | గ్రంథాలయోద్యమము — శిరిపి ఆంజనేయులుగారు | ౫౧ |
| ౯ | సర్వమునీవె (పద్యములు) — కొత్తపల్లి సుబ్బన్నాచార్యులుగారు | ౫౯ |
| ౧౦ | కల | ,, |
| ౧౧ | శ్రీరామారాయగ్రంథాలయము | ౬౦ |
| ౧౨ | శ్రీశారదా పుస్తక భాండాగారము | ౬౨ |
| ౧౩ | నవీనాంధ్రకవులు — పురాణం సూరిశాస్త్రిగారు బి.ఏ., | ౬౩ |
| ౧౪ | ఆంధ్రగ్రంథాలయోద్యమము — యాతగిరి లక్ష్మీవేంకటరమణగారు | ౬౭ |
| ౧౫ | కథా-కలాపము | |
| | గ్రంథాలయములకు భవననిర్మాణము | ౬౯ |
| | అఖిలభారత గ్రంథాలయప్రతినిధి మహాసభ | ౭౦ |
| | హిందూయువజనసంఘము | ౭౧ |
| | నైజాము ఆంధ్రులు | ౭౨ |
| | గణపతి గ్రంథాలయము | ,, |
| | ఆంధ్రదేశగ్రంథాలయ ప్రతినిధుల మహాసభ | ,, |
| | చిత్రపటములు: | |
| | రామదాసు | ౩౭ |
| | ఆంధ్రరత్న | ,, |


బెజవాడ ఆంధ్రగ్రంథాలయ ప్రెస్, (లిమిటెడ్) యందు
క. కోదండరామయ్యచే ముద్రింపబడి ప్రకటింపబడినది.

వార్షికమూల్యము రు ౩-౦-౦] ౧౯౨౩. [విడిసంచిక వెల రు ౦-౪-౦

CD

# రాజపోషకులు

శ్రీ శ్రీరాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దరుగారు

శ్రీ శ్రీరాజా నాయన వేంకటరంగారావు బహద్దరుగారు

శ్రీ శ్రీ బెల్లంకొండ రాఘవరావుగారు, అగ్రహారందారు

# పోషకులు

శ్రీ శ్రీరాజా మోతే గంగరాజుగారు
శ్రీ శ్రీరాజా గోవింద కృష్ణయాచేంద్ర బహద్దరుగారు
శ్రీ శ్రీరాజా కోటగిరి వేంకట కృష్ణారావు బహద్దరుగారు
శ్రీ శ్రీరాజా చెలికాని లక్ష్మారావుగారు
శ్రీ మద్దుల రామయ్యగారి కుమారుడు వేంకట చిన్నంరాజు శ్రేష్ఠిగారు
చిరుగుపాటి వేంకట సుబ్బారావుగారు
శ్రీ లక్ష్మీకాంత పుస్తకభాండాగారము, కొప్పెరప్పాడు
నాళం కృష్ణారావుగారు
కుప్పా శ్రీరామశర్మగారు
పొణకా పట్టాభిరామా రెడ్డిగారు

# అభిమానులు

అడుసుమిల్లి గోపాలకృష్ణయ్యగారు, ప్రొప్రయిటరు.
పెద్దిభొట్ల వీరయ్యగారు, బి ఏ ,బి.యల్.
అయ్యదేవర కాళేశ్వరరావుగారు, బి ఏ.,బి.యల్.
సూరి వేంకట నరసింహశాస్త్రిగారు బి ఏ.
గూడూరి లక్ష్మణరావుగారు బి.ఏ.
అద్దంకి సత్యనారాయణ శర్మగారు
బొడ్డపాటి హనుమంతరావుగారు
చట్టి నరసింహారావుగారు
చ నరసి[illegible]

RSVM01A122

గ్రంథాలయములకు　　　　గ్రంథకర్తలకు

# ఇక శ్రమ లేదు.

# ఆంధ్ర గ్రంథాలయ ప్రెస్, లిమిటెడ్.

| | |
|---|---|
| వార్షికవృత్తాంతములు | లెటరు పేపర్లు |
| ప్రకటనపత్రికలు | శుభలేఖలు |
| గ్రంథములు | పోస్టర్లు |

మొదలగు అన్నివిధములయిన అచ్చుపనులను బైండింగుపనులను ఎంగ్రేవింగుపనులను
తెలుగు, ఇంగ్లీషు, సంస్కృతము, హిందీ, అరవము మొదలైన భాషలలో

## సరసమగుధరలకు అందముగ సకాలమునకు

తయారు చేసియిచ్చును.

వలయువారిట్లు వ్రాయవలయును:—

మేనేజరు, ఆంధ్రగ్రంథాలయ ప్రెస్, లిమిటెడ్, బెజవాడ.

# ఆంధ్ర గ్రంథాలయ ప్రెస్, లిమిటెడ్,
# బెజవాడ.

(౧౯౧౩ సం. ఇండియన్ కంపెనీల అక్టు క్రింద రిజిష్టరు చేయబడినది.)

భాగము ౧కి రు ౨౫ లు చొప్పున ౧౨,౦౦౦ భాగములుగ విభజింప బడినది.

భాగముల సొమ్మును దరఖాస్తుతో రు ౫ లు; అలాటుమెంటు అయినప్పుడు రు ౫ లు; మిగిలిన సొమ్ము ఒక్కొక్క మాసమునకు తక్కువకాని వ్యవధిగల ౩ వాయిదాలలో ఇయ్యవలెను!

## డైరెక్టర్లు

౧ శ్రీ పైడా చినరామకృష్ణయ్యగారు, జమీందారు, బ్యాంకరు, కాకినాడ.

౨ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు, ఆంధ్రపత్రికాధిపతి; డైరెక్టరు, స్వరాజ్య ప్రింటింగు అండు పబ్లిషింగుకంపెనీ; డైరెక్టరు, పేండుస్పిన్నింగు అండు వీవింగుకంపెనీ, మద్రాసు.

౩ సూరి వేంకట నరసింహశాస్త్రిగారు, ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ కార్యనిర్వాహకసభకు అధ్యక్షులు; రామమోహన కేంద్ర గ్రంథాలయమునకు అధ్యక్షులు; బెజవాడ.

౪ నడింపల్లి వేంకటలక్ష్మీనరసింహారావుపంతులుగారు, బార్-ఎట్-లా, మేనేజింగు డైరెక్టరు, ఆంధ్ర కర్మాగారము; రాయకూట్ ఇండస్ట్రియల్ బ్యాంకి కలకత్తా, యొక్క గుంటూరు ఆఫీసు మానేజరు; ఆంధ్రరాష్ట్రీయ కాంగ్రెసు సంఘమునకు కార్యదర్శి, గుంటూరు.

౫ వావిళ్ల వెంకటేశ్వర శాస్త్రులుగారు, ప్రొప్రయిటరు, వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ సన్సు; డైరెక్టరు, ఇండియన్ పబ్లిషింగుహౌసు; శ్రోత్రియందారు, మద్రాసు.

౬ కావ్యనిధి, చెల్కాని లచ్చారావుగారు, సంపాదకులు; శ్రీరామవిలాస గ్రంథమాల, అముద్రితాంధ్రగ్రంథసర్వస్వము; పత్రికాధిపతి, ఆంధ్రభాషావిలాసిని, స్థాపకులు, ఆంధ్రపరిశోధకమహామండలి; జమీందారు, చిత్రాడ, (గోదావరి).

౭ బిక్కని వేంకటరత్నంగారు, కార్యదర్శి, శ్రీబాలసరస్వతీ గ్రంథాలయము, భూస్వాములు, చోడవరము, రామచంద్రపురం తాలూకా, గోదావరిజిల్లా.

౮ బచ్చు నాగభూషణరావుగారు, కార్యదర్శి, జ్ఞానదాయినీ గ్రంథాలయము; భూస్వాములు; బ్యాంకరు; పేరుకలపూడి, గుంటూరుజిల్లా.

౯ పుతుంబాక నరసయ్యగారు, కార్యదర్శి, శ్రీ వేంకటాద్రినాయని జాతీయపాఠశాల; భూస్వాములు; పెదపాలెం, గుంటూరుజిల్లా.

౧౦ పురాణం సూరిశాస్త్రిగారు, బి. ఏ, భూస్వాములు; ప్రొప్రైటరు, మచిలీపట్నం

౧౧ బొడ్డపాటి హనుమంతరావుగారు, కార్యదర్శి, శ్రీసత్యనారాయణ వరప్రసాద గ్రంథాలయము; భూస్వాములు; బొడ్డపాడు, కృష్ణాజిల్లా.

౧౨ పుచ్చా శ్రీరామశర్మగారు, కార్యదర్శి, ఆర్యబాలసమాజము; భూస్వాములు; పెదపాలెం; గుంటూరుజిల్లా.

౧౩ అయ్యంకి వేంకట రమణయ్యగారు, ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ గౌరవ కార్యదర్శి, రామమోహన కేంద్రగ్రంథాలయగౌరవకార్యదర్శి, బెజవాడ.

## బ్యాంకర్లు

టాటా ఇండస్ట్రియల్ బ్యాంకి, మద్రాసు, హైదరాబాదు (డక్కన్)
కలకత్తా రాయకూట్ ఇండస్ట్రియల్ బ్యాంకియొక్క గుంటూరు బ్రాంచి.

## ఆడిటరు

జి. నరసింహంగారు, యస్.ఏ.ఏ, ఎఫ్. ఆర్.యస్ ఏ, 307 లింగిశెట్టివీధి, మద్రాసు.

## లీగల్ అడ్వయిజరు

తుర్లపాటి వేంకటేశ్వరరావుగారు, బార్-ఎట్-లా.

## మేనేజింగు డైరెక్టరు

అయ్యంకి వేంకటరమణయ్యగారు.

## రిజిష్టర్డు ఆఫీసు—బెజవాడ

వివరములకై మేనేజింగు డైరెక్టరుగారికి వ్రాయుడు.

ఆంధ్రదేశాభ్యుదయమునకు అత్యంతావశ్యకములగు అమూల్యగ్రంథప్రకటనమునకు కొద్దిరోజుల లోనే పూనుకొనును,

ఇదివరకే పనిని ప్రారంభించి యుండుటచేత, మొదటిసంవత్సరమునుండియు లాభము పంచిపెట్టబడును. మొదటిసంవత్సరము నుండియు లాభము పంచిపెట్టునట్టి కంపెనీ ఇదియొక్కటేను.

వివరములకు వలయువారిట్లు వ్రాయవలెను:—

ఆంధ్రగ్రంథాలయ ప్రెస్, లిమిటెడ్, బెజవాడ.

4

# బాలగంగాధర తిలక్ మహారాజు
## యొక్క సంపూర్ణ ఉపన్యాసములు - జీవితచరిత్ర.

భారతవర్షముయొక్క రాజకీయ చరిత్రను మీరు చదువదలంచినారా?

భారతవర్షముయొక్క స్వాతంత్ర్య పోరాటమును మీరు గుర్తెరుంగ దలచినారా?

## అట్లయిన

బాలగంగాధర తిలక్ మహారాజుయొక్క సంపూర్ణ జీవితచరిత్రమును, సంపూర్ణ ఉపన్యాసములను తప్పక చదువుడు. ఈగ్రంథమును చదువని భారతీయుడు—దేశమననేమో, దానికై పాటుబడుటయెట్లో, ఎప్పటికిని తెలిసికొనజాలడని నిశ్చయముగా జెప్పగలము.

సుప్రసిద్ధాంధ్రదేశభక్తులును, పశ్చిమకృష్ణామండల కాంగ్రెసు సంఘమునకు కార్యదర్శియును, శ్రీకృష్ణజన్మస్థానవాసముచే పవిత్రులును అగు శ్రీ మానికొండ సత్యనారాయణశాస్త్రి, బి. ఏ. గారిచే వ్రాయబడినది. ఇట్టిమహాగ్రంథముయొక్క వెల రు 2 లు మాత్రమే.

వలయువారిట్లు వ్రాయవలెను:—ఆంధ్రపరిషత్తు, బెజవాడ.

---

# ఆంధ్రభాషాపోషకులకు విజ్ఞప్తి.

రాజమహేంద్రవరమునగల గవర్నమెంటు కళాశాలలో సంస్కృతోపాధ్యాయులుగ పనిచేసి అయిదువత్సరములక్రింద కీర్తిశేషులైన మాతండ్రిగారగు ఆకుండి వ్యాసమూర్తిశాస్త్రులుగారు వారి జీవితాంత్యవత్సరములలో, యాధ్యాత్మికానందము ననుభవింపఁ గాంక్షించి, సంస్కృతభారతమును నిర్వచనముగ నాంధ్రీకరింప మొదలిడిరి. ఆదిపర్వాది మొదటి నాలుగైదుపర్వములు, యుద్ధపంచకము, స్వర్గారోహణాదిపర్వములును మొత్తముమీద సుమారు 12 పర్వములను పూర్తిచేసిరి. ఈయాంధ్రీకరణకాలమందే కవిత్రయమువారి యాంధ్రీకరణములోని స్వల్పపులోపములను దిఙ్మాత్రముగ చూపుచు "భారతపంక్తి" అను పేరుగల గ్రంథమునువ్రాసి, పిఠాపురమున కొంతకాలముక్రిందట ప్రచురింపఁబడుచుండెడి "కవిత" యను మాసపత్రికలో ప్రకటించిరి. వీరు తమ భారతమునకు "ఆంధ్రవ్యాస భారత నవనీతము" అనియు, అందలి పర్వభాగములకు "ధార" లనియు బేరిడిరి. కవిత్రయమువారిచే నాంధ్రీకరింపఁబడక విడువఁబడిన సంస్కృతములోని కథాఘట్టములను వీరు విపులముగ నాంధ్రీకరించిరి. కవిత్రయమువారాంధ్రీకరించిన భాగములలో విపులముగ నున్నవానిని వీరు సంగ్రహముగనే వ్రాసిరి. కవిత్రయమువారిచే యాంధ్రీకరింపఁబడని భాగములను వీరిచే విపులముగ నాంధ్రీకరింపఁబడినట్టి వానిలో కొన్నిభాగములు:—

1. కణికుని రాజనీతి. 2. సనత్సుజాతీయము. 3. భగవద్గీత. 4. విష్ణుసహస్రనామములు మొదలైనవి.

వీరు వెనుకరచించిన గ్రంథములకంటె నీభారతము చాలసులభశైలిలో వ్రాయబడినట్లు పలువురభిప్రాయపడుచున్నారు. వీరిభారతములో నేభాగములనైనగాని లేక అంతయు ప్రత్యేకముగగాని, ముద్రింపించి ప్రకటింపఁబూనుకొను లక్ష్మీపుత్రులను, భాషాభిమానులను ప్రార్థించుచున్నాము. ఈగ్రంథమును అచ్చువేయింపఁదలచు యౌదార్యహృదయులు, మహాశయులు, వితరణశీలురు, యీగ్రంథమునుగూర్చి యీక్రింది ఎడ్రెసుగలవారికి వ్రాసి అన్నిసంగతులు తెలిసికొనఁ గోరుచున్నాము.

అడ్రెసు:—

ఆకుండి వ్యాసేశ్వరుఁడు
"శ్రీశాంతవ్యాసనికేతనము"
ఆర్యాపురం, రాజమండ్రి.

ఇట్లు
విన్నవించు విధేయులు,
ఆకుండి వ్యాసేశ్వరుఁడు.
ఆ. వేంకటశాస్త్రి.

# దేశాభిమానులకు విన్నపము

అనేకమంది గాంధిమహాత్ముని భూషించుచున్నారు. కొద్దిమంది వారికి వ్యతిరేకులై యున్నారు. వారిని భూషించువారును, వ్యతిరేకులును—వారినిబట్టి వీరును, వీరినిబట్టి వారును పోవుచున్నారేగాని, నిజముగా గాంధిగారి తత్వమును అర్థముజేసికొని, ఆచరించువారు బహుకొద్దిమంది. గాంధిమహాత్ముని తత్వమునుగూర్చి అస్తిగతము చేసికొననిది దేశమునకు మోక్షములేదు కాబట్టి

## గాంధిమహాత్మునిచే రచింపబడిన

# గాంధితత్వోపదేశము

అను గ్రంథమును వెంటనే జదువుము. అనేకమంది దేశనాయకులుకూడ ఈగ్రంథమును ఇంతవరకు జదువకుండుట విచారకరము. అసలు చదివియుండకుండుటకంటె, ఇప్పుడైన వెంటనే చదువుట మంచిదిగాదా?

వెల రు 1-0-0 మాత్రమే.

వెంటనే వ్రాయుము:—ఆంధ్రపరిషత్తు, బెజవాడ.

---


# డాక్టరు చివుకుల శ్రీరాములుగారి

# ఔషధములు

## ౧ శతభస్మరసాయనము.

శరీరము త్రివిధ శగవల్ల (పసుపు, తెలుపు, యెఱుపు;) అనేక జాడ్యములలోనికిదించి శరీరము గుల్లబారియున్నను సేంధమైన సవామేహబాధయున్నను, పాండువ, కుష్టు, మొదలైన వ్యాధులున్నను, శరీరమంతయు పడిగలు పడియున్నను కాళ్లుచేతులు మంటలుగాని, పట్లుపట్టియున్నను బలహీనముగాయున్నను, నరముల పటుత్వముతప్పినను తీటమొదలగు చర్మవ్యాధులచే బాధపడుచున్నను 21 విధసవామేహములకున్ను అమోఘముగా పనిచేయును, యిచ్ఛాపథ్యము. సేరు౧కి రు 8—0—0లు పోస్టుఖర్చులు ప్రత్యేకము.

## ౨ వీర్యసంజీవి.

రక్తముక్షీణించి నరముల పటుత్వము తప్పి సంభోగేచ్ఛలేక బలహీనముగా నుండు వారలు యీఔషధమును సేవించిన వీర్యవృద్ధి రక్తవృద్ధికలిగి దేహము పుష్టికరించి మంచికాంతికలుగును. వీర్యస్తంభన కలుగును.

శుక్లనష్టము హరించును, యిందుర ప విషగంధ కాదులున్నట్లు రుజువు చేయువారికి రు116—0—0నూటపదార్లివ్వబడును.

శేరు రు ౧౦—౦—౦పదిరూపాయలు పోస్టుఖర్చు ప్రత్యేకము

3 అజీర్ణవటి:— పసిబిడ్డలకు దివ్యౌషధము. అజీర్ణము జలుబు దగ్గు పడిశము జ్వరము శైత్యము మొదలగువాటికి బాగుగా పనిచేయును. ౧౦౦మాత్రలు రు ౦—౧౨—౦లు.

౪. కస్తూరివటి. ౧౦౦మాత్రలు రు ౧—౦—౦



రాజవైద్య చివుకుల శ్రీరాములు,

ఆయుర్వేదవైద్య నిలయం, కొత్తపేట, తెనాలి.

# డక్కన్ మిల్ స్టోర్సు కంపెనీ, లిమిటెడ్,
# బెజవాడ.

---

(1913 సం॥ ఇండియన్ కంపెనీల ఆక్టుక్రింద రిజష్టరు చేయబడినది)

## మూలధనము రు ౩,౦౦,౦౦౦.

భాగము ౧కి రు 100 లు భాగముల సొమ్మును ధరఖాస్తుతో రు 20 లును, అలాటుమెంటు అయినప్పుడు రు 20 లును, మిగిలినసొమ్ము ఒక్కొక్కమాసమునకు తక్కువకాని వ్యవధిగల 3 వాయిదాలలో ఇవ్వవలెను.

## డైరెక్టర్లు:

1 మోతే నారాయణరావుగారు, జమీందారు, విస్సన్నపేట గుండేపల్లి ఎస్టేట్సు; డైరెక్టరు, ఆంధ్రకర్మాగారము, లిమిటెడ్, గుంటూరు; ఏలూరు.

2 మోతే నరసింహారావుగారు, జమీందారు, విస్సన్నపేట గుండేపల్లి ఎస్టేట్సు; డైరెక్టరు, ఆంధ్రకర్మాగారము, లిమిటెడ్, గుంటూరు; ఏలూరు.

3 నంబూరి వేణుగోపాలరావుగారు, ప్రెసిడెంటు, శ్రీకృష్ణాజూట్ అండు కాటన్ మిల్సు, ఏలూరు; వైస్ ప్రెసిడెంటు, యస్. కె. పి. వి. వి. హెచ్. హెచ్. స్కూలు, బెజవాడ; ఆనరరీ బెంచి మేజస్ట్రీటు; డైరెక్టరు, విజయవాడ కోఆపరేటివ్ బ్యాంకింగు యూనియన్, బెజవాడ; డైరక్టరు, ఏషియన్ కమ్మర్షియల్ అస్యూరెన్సు కంపెనీ బొంబాయియొక్క మదాసుబోర్డు; ప్రొప్రైటరు, శ్రీబాలకృష్ణారైస్ మిల్లు; అండు కంట్రాక్టరు, కనకదుర్గా రయిసుమిల్లు, బెజవాడ.

4 ఉప్పలపాటి బ్రహ్మయ్యగారు, ల్యాండు లార్డు అండు ప్రొప్రైటరు, శ్రీరామలింగేశ్వర రైసుమిల్లు, గుడివాడ.

5 వీరమాచనేని రంగయ్యగారు, ల్యాండులార్డు అండ్ ప్రొప్రైటరు శ్రీ వేంకటేశ్వరరైసు మిల్లు, గుడివాడ.

6 కానూరి వెంకటాచలపతయ్యగారు, ల్యాండులార్డు అండ్ ప్రొప్రైటరు, శ్రీ వెంకటకనకదుర్గా మైనింగుకంపెనీ, (నెల్లూరు;) కవుతవరం, కృష్ణాజిల్లా.

7 అడపా రంగయ్యగారు, ల్యాండులార్డు అండ్ ప్రొప్రైటరు, శ్రీశివశంకర రైసుమిల్లు, నరసన్నపాలెం, వీరవల్లిపోస్టు, పార్టనరు ఆఫ్ శ్రీరామలింగేశ్వర రయిసుమిల్లు, గుడివాడ.

8 కలిదిండి గంగరాజుగారు, ల్యాండులార్డు అండ్ ప్రొప్రైటరు, శ్రీరామవరప్రసాద రైసు మిల్లు, తాడేపల్లిగూడెం.

9 కన్నెగంటి వెంకయ్యగారు, ల్యాండులార్డు అండ్ ప్రొప్రైటరు, శ్రీ రామలింగేశ్వర రైసుమిల్లు, దుగ్గిరాల.

10 గుడ్లవల్లేటి గోపాలరావుగారు, పార్టనరు ఆఫ్ బాబు ఏ. వి. రాయి అండు కో. అండు ల్యాండు హోల్డరు, బెజవాడ, (ఎక్సుఅఫిషియో.)

## అక్కౌంట్సు విత్

ది ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బెజవాడ.

ది రాయకట్ ఇండస్ట్రియల్ బ్యాంక్, లిమిటెడ్, గుంటూరు.

ది తాతా ఇండస్ట్రియల్ బ్యాంక్ లిమిటెడ్, మద్రాసు.

## ఆడిటర్

జి. నరసింహంగారు, యఫ్. ఏ. ఏ. యఫ్. ఆర్. యస్. ఏ., 307, లింగిశెట్టివీధి, మద్రాసు.

## లీగల్ అడ్వయిజరు

కందుకూరి వటుకభైరవమూర్తి పంతులుగారు, జిల్లాకోర్టు వకీలు, బెజవాడ.

## మేనేజింగు ఏజంటు

గుడ్లవల్లేటి గోపాలరావుగారు.

## రిజష్టర్డు ఆఫీసు—బెజవాడ.

# మాలపల్లె

లేక

# సంగవిజయం

మొదటి రెండుసంపుటములు తయారైనవి.

సంపుటం ఒకటింటికి వెల ౦-౧౨-౦

## ఆంధ్రభాషయం దింతవరకు ఇట్టి మహాగ్రంథం

## వెలువడలేదు

దేశభక్తాగ్రేసరులగు ఉన్నవ లక్ష్మీనారాయణగారిచే వాడుకభాషయందు

ముద్దులొలుకునటుల వ్రాయబడినది.

ఈగ్రంథము ఆంధ్రవాఙ్మయమునందు

**గొప్ప విప్లవమును** కలుగజేయుననుట కెంతమాత్రము సందేహములేదు.

ఆంధ్రవాఙ్మయమందు "కన్యాశుల్క" మను గ్రంథమొక్కటే ప్రతిభగాంచి యున్నది. నేడు ఈగ్రంథము దానిని మరపించి భాషకు నూతనోజ్జీవమును కలుగ జేయును. వలయువారిట్లు వ్రాయవలెను:—

మేనేజరు, ఆంధ్రపరిషత్తు, బెజవాడ.



# "విద్యార్థి."

బెజవాడనుండి ప్రకటింపబడుచుండును.

## జాతీయ విద్యావాఙ్మయవిషయిక పక్షపత్రిక

సంపాదకుడు : కురుగంటి సీతారామయ్య, ఎం. ఏ.

ఇందు విద్యాధికుల వ్యాసములు ప్రకటింపబడుచు జాతీయవిద్యాస్వరూపనిరూపణ ప్రయత్నములు సలుపబడును.

చందా సం॥కు ౨—౦—౦.

విద్యాభిమానులందరును చందాదారులు కాబ్రార్థితులు.




ఎనిమిదవ ఆంధ్రదేశ గ్రంథాలయప్రతినిధుల మహాసభకు అధ్యక్షులగు



ఎనిమిదవ ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల
మహాసభకు అధ్యక్షులగు
ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య



పరబ్రహ్మాత్మికాం దేవీం ♦ భుక్తిముక్తిఫలప్రదాం
ప్రణమ్య స్తౌమి తామేవ ♦ జ్ఞానశక్తిం సరస్వతీం.

ఆరవ సంపుటము.

# గ్రంథాలయసర్వస్వము.

రెండవ భాగము.

## పరీక్ష.

[ప్రాతఃకాలమున రసాలనికుంజమునఁ బ్రవేశించుచు నంతటఁ గలయఁ గనుంగొని.]

సాధకుఁడు.

శా. ఆనందం బిటువస్త్రగాళితముచేయంబడ్డచందంబునన్
గానంబట్టెను. ముందటన్ దెసలనున్ ద్వంద్వంబులం గొంచెమేన్
రానీకుండఁగఁ బోలెఁ బర్వతతతుల్ ప్రాకారముల్ తీసె నిం
డే నాకా జగదీశ్వరుంగనఁగనౌ నెన్నాళ్లకెన్నేళ్లకేన్.

[అని లోపలఁ బ్రవేశించును.]

నికుంజము.

[పరికించి, గ్రహించి తనలో] ఇంతియుం దీతని సాధనయను తేనెలోఁ బశు పక్షి మనుజాది ధ్యానములు నీరినిఁ బోయుచున్నవి. పాపము! ఈతని కాశ్రయ మిత్తును గాక.

సాధకుఁడు.

[కూర్చుండి, అర్ధనిమీలితనయనుఁడై]

గీ. నాగు నెమ్మను నాఁగను బాడపీతి
పెట్టి చిత్తము నాఁగను బట్టుపాన్పు
నం దవృత్తి యనాఁ దలయంపిఁ గొంచు
దేవ! దయచేసి మెల్ల నిద్రింపుమయ్య!

(అని భూరిమధ్యమునఁ జిత్తము నాకర్షించి సత్త్వస్థితి నొందును.)

నికుంజము.

[తనలో] ఈతని కైకాగ్ర్యమును నాను బలె నేల లోనికి వేళ్లూని పాఁతుకొనునట్లు చేయవలయును. ఆఁకలిఁగొని వచ్చిన యీయతిథికి హార్దభావనగా ఆతిథ్య మిచ్చెదఁ గాక. వేళయైనదో లేదో కనుఁగొందుఁగాక.

[అని ముఖముపరికించి]

చ. వెలువడె వేఁడిపేర్పు వినువీదిని దక్షిణమారుతంబ! నీ
వెలమి రికమ్మ నాపువులయున్న లతానికరంబు దిక్కులం
దోలకెడుఁగాక కోయిలలుఁ దుమ్మెదలున్ మెదలైన వానికిం
బిలువరి పేరఁటంబు వెలపెట్టని యంగడి యౌఁత మెంతయున్.

[మలయమారుతము వీచును. కోయిలలు కొన్నియు తుమ్మెదలు కొన్ని వచ్చి చిగురులఁ గొమ్మకి తేనెఁ బీల్చి రొదల నొనరించుచు నుండును.]

సాధకుఁడు.

చ. మలయ మరుద్విధూత దళ మర్మరరావములో యథేచ్ఛమై

నిలువఁగవచ్చు కోయిలలకిలకిలారావములో నిరంతరం
బలబలమందు తుమ్మెదల యాటలతో నిది పిల్లవాం
డ్రుం బె
ద్దలుం గల మాగృహంబుకలెఁ దామరతంపరగా
నెసంగెడిన్.

[పెదవిఁ గఱచికొని] ఓహో! చిత్తము తొందరయైనదే! నా కనులు మూయబడియున్నను చెవులు తెలుచుకొనియే యున్నవి.

నికుంజము.

[తనలో] చిత్తమునకుఁ గవాటము వేసుకొనుట లెస్స.

సాధకుఁడు.

[కనులు మూసికొనియే నికుంజమునందంతట నాలకించుట నభినయించి] ఏమి చెప్పుదు: దూరమున నున్నవానికి వడపోఁతగుడ్డనుండి బిందెలోనికిఁ బడు బిందువువలె నెవరో తాము లోపల ననుకొనుమాటలు నా కర్ణబాహమునకుఁ దవులుచున్నవి. అగుఁగాక. మనకు వానితోఁ బని యేమి? [అని ధ్యానోన్ముఖుఁడగును]

నికుంజము.

(తనలో) పరీక్షింతునుగాక. [అని యొక చిగురుచు కోయిలలకుఁ గానఁబట్టునట్టులు చేయును. ఒకకోయిల దానిఁ గొఱుకఁబోవును. మఱొక కోయిల దాని నాతంకపఱచును. అన్నియు నొకదాని నొకటి నతిక్రమించుచు 'కుహూ' 'కుహూ' యని కోసరి కూయును]

సాధకుఁడు.

[మొగముఁ జిట్లించి] చిత్తమేకాగ్రమైన కొలఁదియు ఎంత దూరమునఁ బొడమినను కుక్కకోడిపిట్టలోనగువాని ధ్వనులకు నాచిత్తమే గమ్యస్థానమైనది. ఇపుడును ఈ కుహూ ధ్వనులను చిరుతలకు నాహృదయము డప్పుగా నున్నది. అగుఁగాక. దీని నతిక్రమింతును.

గీ. చిత్తమిది బడిగుఱ్ఱము వృత్తులనెడు
రౌతుల కధీనమై చనరామి లేక
యొక్కగోళము నుండి వేఱొక్కగోళ
మునకు దుముకును బ్రహ్మపత్తనము దక్క!

[ఝంఝామారుతమును బిలుచును. ఝంఝామారుతము తీవ్రవఁ బఱతెంచి చెట్లను ఊఁపును. కోయిలలు తుమ్మెదలు పిచ్చుకలు మొ. పెద్ద రొదనొనరించును.]

సాధకుఁడు.

[చరాలున కనులెత్తిచూచి విస్మితుఁడై] ఈ మహాభూతము వేయినోరులతో నఱచి వేయిచేతులతో నాకులఁ గొమ్మల నులిపివైచినది. [సవిమర్శుఁడు] ఔరా! నా చిత్తపద్మముయొక్క సహస్రదళములును జింపివేయఁబడినవి. ఈశ్రోత్రియులు స్వామిద్రోహులు. కనులకు రెప్పలున్నట్లు వీనికిని మూఁత లుండదగును.

నికుంజము.

[నవ్వుచు—తనలో] గూబలఁ దీయించుకొనును.

సాధకుఁడు.

[సూర్యునింగాంచి] నియమకాలమగు ప్రాతఃకాలము కూడ దాఁటిపోయినది.

నికుంజము.

[తనలో] సమాధానము చెప్పివేయుదునా. [అని యాలోచించుచుండును.]

సాధకుఁడు.

[నిర్వేదములో] దేవా!

మ. మతి నేకాగ్రమొనర్చి మాటచిఁగఁగం
బాధేయ మార్జించి య
ప్రతిమానంబగు నీ పురాంగనమునుం
బ్రాపించి ప్రాపింపఁ గే
కత మం దందున నీతలారినొగిఁ జ
క్కంగాంచియో కొంచకో
ప్రతివారంబును గూలుచుండుదు శరీ
రంబన్న గర్తంబునన్.
[అని చేతులు దోయిలించును.]

నికుంజము.

[వ్రాలిపోవుచున్న యాకులఁ జూపుచు]

ఉ. ఆకసమందు నెల్లెడల
వ్యాపకతం గయికొంచునున్న నా
యాకులు బిట్టువీచిన మ
హానిలఘాతముచేత నెంతయో
యాకులపాటుచెంది పడి
నట్టులు నీదగు చిత్తపద్మపుఱ్
రేకులు విచ్చిపోయి యధ
రీకృతమైనవిచూడు పుత్త్రికా!

సాధకుఁడు.

[ఆశ్చర్యపడి శిరమును వంచి యశ్రువులు రాల్చును]

నికుంజము.

పుత్రా! దుఃఖింపకుము. విజనమని యిటకు వచ్చితివి. భూతము లెక్కడ లేకున్నవి? కాని చిత్తమే విజనమును సజనమును. చిత్తమువందే ప్రపంచములును లయములును కైవల్యమును గలిగెడిని.

సా ధ కు ( డు.

[దోయిలి పైకెత్తి]

నన్ను మఱల నింటికిఁ బొమ్మందువా?

ని కు ం జ ము.

ఇల్లా? నీచిత్తము నీకిల్లు. దాని నిల్లు చేసికొనఁ గల్గుటకు నేను మెట్టిని.

సా ధ కు ( డు.

(సంతోషముతో) మంచి పరీక్ష చేసితివి. నీకు వందనము.

మ. విదితంబాయెను నీవు తెల్పిన మహా
విజ్ఞాన మో వృక్ష రా
జ! దినంబుల్ నెల లేండ్లు పోవుతను
ఝుంఝూవాత సంవర్తముల్
పాదలుంగావుత మీ శరీరమున
నెమ్మల్ మాత్ర శేషించుతన్
మది నా యీశ్వరులోని కంపక
యొకింతన్ లేవ నాలింపుమా.

ని కు ం జ ము.

నా స్కంధమువలె నచలత్వమును బొందుము. సరియ కాని నీ ప్రాతఃకాలము నియమము దాటిపోయినది.

సా ధ కు ( డు.

అయ్యా! నీబోధనకు నేను ఋణపడితిని.

శా. ప్రాతఃకాలము మేలు మే లటులనే
ప్రాహ్ణంబులున్ మాఁపులున్
జేలంబందు సమాధి చిక్కినెడలన్
లేకున్నచో నెంతయుం
బ్రాతఃకాలములున్ స్ఫుటాతపములా
ప్రాహ్ణంబులున్ మాఁపులున్
భూతిగ్రస్తములౌత లేక విలయంబుం
బొందెడుం గావుతన్.

(అని ధ్యానోన్ముఖుఁ డగును.)

—వేలూరి శివరామశాస్త్రి.

---

# ధర్మజిజ్ఞాస: ధర్మస్వరూపము.

సూ॥ "అథాతో ధర్మజిజ్ఞాసా"

మనశాస్త్రములన్నిటిలోను ప్రస్తుతకాలమున అనేక కారణములచే తిరస్కరింపబడుచున్నది ధర్మశాస్త్రము. సామాన్యజనులందరును ధర్మశాస్త్రమనగా జాతాశౌచమును మృతాశౌచమును నిర్ణయించు గ్రంథములని తలంచుచున్నారు. పండితులును ధర్మశాస్త్రముకూడ తక్కిన శాస్త్రములంబలె సమగ్రముగ చదువవలసిన శాస్త్రమని నానాటికి మరచిపోవుచున్నారు. ఎప్పుడో పనిపట్టినప్పుడు ఏధర్మసింధువునో, నిర్ణయసింధువునో తెరచి రెండుమూడు శ్లోకములు చూచుట తప్ప ధర్మశాస్త్రమందు సమ్యగ్జ్ఞానము సంపాదించుటకు పండితులు ప్రయత్నించుటలేదు. లేకున్న ఈ బహుపోనస్సుకు విధవా వివాహమండనఖండనమో, పటేలు వివాహశాసనఖండనమో మరేదో వాగ్వాదము పెంచికొని ఆయావాదముల కనుకూలములగు భాగముల తెరచిచూచుటతప్ప వేరొండు లేదు. పండితులమాట ఇటుండ ప్రస్తుతకాలపు టబ్రాహ్మణుల యభిప్రాయమున ధర్మశాస్త్రములు రాజశాసనములు మున్నగు ప్రజానిష్ఠురములైన శాసనముల పోల్కి గానిపించుచున్నవి. రామలింగారెడ్డిగారి వంటి యబ్రాహ్మణ నాయకులు తరుచు మన్వాదిస్మృతులలోని ధర్మములు తిరిగి ప్రతిష్ఠింపబడునట్లు కలగాంచి, యదరిపడి మేల్కాంచి, వీతభయులై ఎట్టెటో కాలము గడపుచున్నవారు.

ఇంక మరికొందరిచే (వీరు న్యాయవాదులు) 'కోల్ బ్రోక్', 'బుల్లర్', 'జాలీ' మున్నగు దొరలు ధర్మశాస్త్రప్రతిష్ఠాతలనియు, 'మెయిన్' మున్నగువారు వ్యాఖ్యానకారులనియు, తలంపబడుచున్నది. వీరిగ్రంథములం దేదేని విషయము సందిగ్ధమై తోచినయెడల, మీమాంసాధికరణములో యనందగిన 'లారిపోర్టు'లలోని తీర్పుల పరిశీలించినచో సర్వసంశయ విచ్ఛేదము కాగలదు—అని మన నవీనన్యాయవాది మతము.

ధర్మశాస్త్ర మీస్థితిలోనుండ పండితు లుదాసీనులై యుంట కేవలము విచారకరము. ధర్మశాస్త్రములు గౌరవింపతగినవే యైనచో, తన్మూలమగు వేదము లపారుషేయము లేయైనచో . . . . . .

ఆచరణీయములైనచో, తత్త్వాశాస్త్రమును సర్వజనులకును బోధపరచుట పండితులకు విధియైయున్నది. ఇట్టి కార్యము పండితులే పూనుకొనవలయును గాని ననుబోలు కించిజ్జ్ఞులవల్ల నయ్యెడునదిగాదు. పరధర్మము వెల్లువయై మనలను ముంచివేయుచుండ పండితులు మౌనము వహించియుంట స్వధర్మమును నిరసించుటగాని వేరొండుగాదు.

ఈయుపోద్ఘాతము నింతటితో చాలించి కొన్ని వ్యాసములలో స్మృతులయందుండు వ్యవహార ధర్మమందలి ప్రధానసూత్రములను నా యెఱింగినంతవట్టు వివరింప బ్రయత్నించెద. అప్పటప్పట పాశ్చిమసిద్ధాంతములగూడ నుదహరించుచు స్మార్తవ్యవహార ధర్మమునకు పశ్చిమవ్యవహార ధర్మమునకు గల భేదముల నిరూపించుటకుగూడ పూనుకొనియెదను. కాని వ్యవహారధర్మము విషయమై ముచ్చటించుటకు పూర్వము ధర్మమనగా నేమో విచారింపవలసి యున్నది.

ధర్మము:—ఇట్టి పదము మరియేభాషలోను లేదు. "లా" అను నాంగ్లేయ శబ్దమువలన ధర్మశబ్దార్థము స్ఫురింపదు. ఇటులే జర్మన్, లాటిన్, గ్రీక్, ఫ్రెంచిభాషలలోని పదములు కొంచెమించుమించుగ "లా"అను పదమునకు తుల్యములేగాని ధర్మశబ్దార్థబోధకములుగావు. 'లా'మున్నగు శబ్దములవలన పశ్చిములు గ్రహించిన విషయము మన 'ధర్మ'మందొక భాగము. మనధర్మశాస్త్రములందుండు విషయములు పశ్చిమదేశముల యందనేక నామముల వ్యవహరింపబడుచున్నవి. "లా"అను శబ్దమునకు ప్రధానమైనయర్థము రాజశాసనముచే ప్రతిష్ఠింపబడిన వ్యవహారధర్మము (Positive law). ఈయర్థమున, "లా"అను శబ్దమునకు "వ్యవహారధర్మము" అనుపదము పర్యాయపదముగా వాడవచ్చును. కాని యిట్లువాడుటకు ముఖ్యమైన యభ్యంతర మొకటికలదు. అదియేమో ముందు నిరూపింపబడును. ఇక మన ధర్మశాస్త్రముల నాచారప్రాయశ్చిత్తాధ్యాయములలోనుండు విషయములు పశ్చిమదేశముల ననేకధా వ్యవహరింపబడుచున్నవి. వారిపరిభాష ప్రకారము కొంతభాగము Divine law, మరికొంత Natural law, మరికొంత Moral law, ఇటుల నేకపదములచే వర్ణించిచెప్పిన "ధర్మ"పదార్థము పశ్చిములకు బోధపడవచ్చును. కాని యీపైజెప్పిన ఆంగ్లపదములలోని భావమంతయు కలబోసి యొకటిగాజేసి యూహించినను ధర్మపదార్థమునకు సరిపోదు. కారణమేమన "లా"అనుశబ్దమువలన ప్రధానముగ రాజశాసనము మాత్రమే గ్రహింపబడుచున్నది. పశ్చిమసిద్ధాంతముల ప్రకారము 'లా'కుమూలము రాజాజ్ఞ (Command of the Sovereign). రాజాజ్ఞలకే "లా" యనుపేరు చెల్లియున్నది. రాజచోదితములైన విధిప్రతిషేధములకే 'లా' యనిపేరు. వీనినే సర్వజనులు ఏమరక ఎల్లప్పుడు నాచరించుచుండవలయును. ఏతదితరములైన విధులన్నియును ఐచ్ఛికములు. వానికి లాయనుపదము చందురునివంటి మోమన్నట్లు సామ్యమువలన చేర్చబడియున్నది గాని యథార్థముగ 'లా' అను శబ్దము వానికి వర్తింపదు. Divine law (మతసంబంధమైన విధులు) Moral law (నైతికప్రవర్తన విషయమైనవిధులు) ఇట్టి విధులను జనులు గౌరవింపవచ్చును. గౌరవించుటయో గౌరవింపకపోవుటో వారియిష్టాయిష్టములవలన నిర్ణయింపబడును. కానిఐచ్ఛికములైన యీ నియమములలో కొన్ని ప్రజాక్షేమముకొరకై సర్వజనాచరణీయములుగ రాజాజ్ఞచే విధింపబడవచ్చును. కావున ప్రజాక్షేమముకొఱకై ఎయ్యది రాజాజ్ఞచే విధింపబడినదో అది 'లా'. తదితరములు లా కాదు. పశ్చిమసిద్ధాంతముల ప్రకారము 'లా'కు ప్రధానోద్దేశ్యము ప్రజాక్షేమము. తన్మూలము ప్రభువు (Sovereign).

ఇక ధర్మమువిషయమై విచారింపవలసి యున్నది. 'లా' అను పదార్థము ధర్మశాస్త్రమునం దొకభాగమాత్రమనియు, 'లా'కుమూలము రాజాజ్ఞయనియు నిదివఱకే చెప్పియుంటిమి. ధర్మమునకు మూలము వేదము. వేదములపౌరుషేయములు. అనగా ధర్మమునకు మూలము ఈశ్వరాజ్ఞగాని రాజాజ్ఞగాదు. ధర్మాచరణవలన పరమప్రయోజనము ఆముష్మికసౌఖ్యముగాని ఐహికసుఖముగాదు. అటులగుట ధర్మప్రయోజకులు త్రికాలజ్ఞులగు మహర్షులుగాని పృథ్వీపతులుగారు. మేదినీపతులును, తక్కిన మానిసులంబలె ధర్మబద్ధులర. ధర్మనిర్ణయమందు పశ్చిమదేశముల రాజునకు గల నిరంకుశాధికారము ఆర్యావర్తమున నెన్నడు నంగీకరింపబడలేదు. ధర్మము పురుషార్థములలో నొకటైయుండుటచే, సర్వదానికి పరమప్రయోజనము శ్రేయముగాని ప్రేయముగాదు. "యతోఽభ్యుదయనిఃశ్రేయససిద్ధిః సధర్మః." (గౌతముడు)

కావున పరమపురుషార్థసాధకములగు మార్గములన్నియు ధర్మపదార్థమం దిమిడియున్నవి. ఇతరమార్గములన్నియు ధర్మేతరములు. ధర్మమునకు "లా"కుగల ప్రధానభేదమిది. "లా" కేవలము రాజచోదితమైన వ్యవహారధర్మము (Positive Law). స్మృతులలోని వ్యవహారధర్మముగూడ వేదచోదితమైనదనియే ఆర్యుల సిద్ధాంతము. ధర్మశాస్త్రములన్నియు మూడు

భాగములుగ విభాగింపబడి యున్నవి. అయ్యవి ఆచార వ్యవహార ప్రాయశ్చిత్తాధ్యాయములు. మనుస్మృతియం దిట్టివిభాగము చేయబడియుండలేదు గాని యీ మూడువిషయములందును చెప్పబడియున్నవి. ఆచారాధ్యాయమున వర్ణాశ్రమాదిధర్మములు, వ్యవహారాధ్యాయమునదాయవిభాగము మున్నగు విషయములు, ప్రాయశ్చిత్తాధ్యాయమున ఆశౌచనిర్ణయము ఆపద్ధర్మాదికము యింక ననేకపాపకృత్యములకు ప్రాయశ్చిత్తవిధానము మున్నగువిషయములు, విస్తరింపబడి యుండును.

ఇంతవరకును ధర్మమునకు మూలమేమో, తత్ప్రయోజనమెయ్యదియో, ధర్మశాస్త్రములం దేయేవిషయముల గురించి ముచ్చటించియుండిరో సూక్ష్మముగ విచారించి యుంటిమి. కాని ధర్మమునకు లక్షణమేమో విచారించి యుండలేదు.

ధర్మలక్షణము స్మృతులయం దెచ్చటనుగానరాదు. "శ్లో॥ శ్రుతిః స్మృతిః సదాచారః స్వస్యచప్రియమాత్మనః। ఏతచ్చతుర్విధంప్రాహుః సాక్షాద్ధర్మస్యలక్షణం" (మనుస్మృతి) మనువు ధర్మమునకు మూలమేమో చెప్పియున్నాడు గాని ధర్మలక్షణము చెప్పలేదు.

"సూ॥ శ్రుతిస్మృతివిహితోధర్మః తదలాభేశిష్టాచారః ప్రమాణం." ధర్మశాస్త్రముల ధర్మసూత్రముల నన్నిటిని పరిశీలించినను ధర్మలక్షణము గానరాదు. స్మృతులయందు ధర్మములనుగురించి చెప్పిరిగాని ధర్మమును గురించి చెప్పలేదు. ధర్మలక్షణమును చెప్పుచుట వారి పనిగాదు. కాని స్మృతులలో చెప్పలేదనినంతమాత్రమున ధర్మమునకు లక్షణము మనవారు చెప్పనేలేదని యూహింప వలనుపడదు. ధర్మస్వరూపనిర్ణయము మీమాంసకుల పనిగాని స్మృతికర్తలపనిగాదు. పూర్వమీమాంసాశాస్త్రము ప్రత్యేకమీపనికొరకే యేర్పడియున్నది. ధర్మజిజ్ఞాస మీమాంసకులకు పట్టినదిగాని మన్వాదిస్మృతికర్తలకు పట్టలేదు.

సూ॥ "అథాతో ధర్మజిజ్ఞాసా"(జైమిని)అని జైమిని మీమాంస సూత్రములను ప్రారంభించియున్నాడు. కావున మీమాంసకులు ధర్మస్వరూపము నెట్లునిశ్చయించి యున్నారో విచారింపవలసియున్నది. ధర్మము, విధి ఈరెండుమాటలకు చాలదగ్గరచుట్టరికము. 'ధర్మమే విధింపబడును' విధింపబడినది ధర్మము. విధి అవశ్యము నిర్వర్తింపదగినది. విధులవిషయమున వికల్పమునకు తావు లేదు. విధివాక్య మనుల్లంఘనీయము. ధర్మమనగా ఒక విధమైన చోదనము (ఆజ్ఞ). ఈయాజ్ఞ శ్రుత్యుదితము. కావున వేదచోదితమైనది ధర్మము. ఎయ్యది శ్రుతిచే నాజ్ఞాపింపబడినదో (చోదితమైనదో) అదియంతయు ధర్మము. సూ॥ "చోదనాలక్షణోఽర్థోధర్మః" (జైమిని) చోదనాను (ఆజ్ఞ)సారముగ నెయ్యది నిర్వర్తింపబడవలెనో అది ధర్మము. ఆ చోదనము శ్రుత్యుదితము. ఇచ్చట శ్రుతిశబ్దమువలన మన్వాదిధర్మశాస్త్రములగూడ గ్రహింపవలసియున్నది. స్మృతులన్నియు అనుమానింపబడిన శ్రుతులపై నాధారపడియున్నవి. "అనుమేయంశ్రుతిమూలం మన్వాదిశాస్త్రం" (శాయనాచార్యుడు.) ఈ సందర్భమున పాశ్చిమమీమాంసకులు "లా"స్వరూపము నెట్లునిర్ణయించిరో విచారింతము:

"A law is a Command which obliges a person or persons to a Course of Conduct" (Austin) మానవులకు ఒకరీతి ప్రవర్తన విధించునట్టి యాజ్ఞ "లా" అని "ఆస్టిన్" వ్రాసి యున్నాడు. కావున "లా" అనుమాటకును "విధి"యను మాటకును కొంచెమించుమించుగ నొకటేయర్థము. దానికిని వీనికినిగల ప్రధానభేదమేమో ఇదివరకే చూచియుంటిమి. విధులన్నియు నపౌరుషేయములయిన శ్రుతిమూలకములు. వారి శాసనములు (లా) రాజచోదితములు— మూలభేదముతప్ప తక్కినలక్షణములు విధికిని "లా"కును సమానములే. ఈ రెంటికిని సామాన్యలక్షణములు: రెండును చోదనములు — రెండును మానవులకొకరీతి ప్రవర్తన విధించును. కాని యింకను మరికొన్ని లక్షణములు గల్గినగాని ఏయాజ్ఞయు విధియనిగాని, "లా" యనిగాని యనిపించుకొనదు. ఏలన, మానుషకృత్యములను నియమించునవి రెండుశక్తులు- ఆశ- భయము. ఒకపనిచేయుటవలన తనకేదియో లాభముగల్గునను ఆశవలననో, అదిచేయకుంట వలన బాధగల్గునను భయముచేతనో మనుజులు తమతమ వ్యవహారముల నిర్వర్తించుకొను చున్నవారు. లాభము గల్గునను ఆశలేకున్నను, బాధగల్గునుభయము లేకున్నను మనుజుడేపనిని చేయడు. కావునఏదేని విధిగాని, 'లా'గాని అవశ్యము నిర్వర్తింపబడవలయు నేని, అదినిర్వర్తించుట వలన లాభమో, ఉల్లంఘించుటవలన బాధయో కలిగించు శక్తి వానితోబాటుగ నుండవలయును. లేకున్నట్టి చోదనములు నిష్ప్రయోజనము లగును. "దొంగతనము చేయవలదు" అనియాజ్ఞాపించిన రాజునకు దొంగలను శిక్షించు శక్తి లేకున్నచో ఆయాజ్ఞవలన నెవ్వరు బద్ధులగుదురు? కావున ఆస్టిన్, ఇట్లువ్రాసి యున్నాడు: "Law is- a command enforced with *a Sanction.*" అనగా ఉల్లంఘనము చేసిన ప్రత్యవాయముగల్గింప శక్తిగలియుండు ఆజకు 'లా' అనిపేరు— [illegible]

రించినవారికి ప్రత్యవాయము గల్గించుటగూడ 'లా' కొక ముఖ్యలక్షణము. ఈప్రత్యవాయమునకే ఇంగ్లీషున 'Sanction' అనిపేరు. 'Sanction' అనుపదము ప్రత్యవాయమునకు మాత్రమే గాక, విధినిర్వర్తనము వలన గలుగబోవు లాభమునకు గూడ వర్తించునని మరికొందరిమతము. ఇక శ్రౌతస్మార్త విధుల కీలక్షణము కలదో లేదో విచారించవలసి యున్నది. లాభాపేక్షయో, ప్రత్యవాయభయమో లేనిది మనుజు లేపనిం జేయరను విషయము పశ్చిమదేశములలో నెంత నిజమో మనదేశములోగూడ నంతియు నిజము. కాని వారిమతమునకు, మనకుగల భేదమేమన:—

"లా"వలన గల్గబోవు లాభప్రత్యవాయములు ప్రత్యక్షమై ఐహికమై యుండవలయుననియు, తత్ప్రవర్తకతాశక్తి నియతమైన ఒకయధికారియందో (రాజు) తత్తుల్యమైన మరియొక సంఘమందో (Determinate body) ఉండవలయునని వారిమతము. ఇక శ్రౌతస్మార్త విధులవిషయమునన్నో, తదాచరణవలన గలుగబోవు లాభనష్టము లప్రత్యక్షములు, పారలౌకికములు. ప్రవర్తకతాశక్తి, నియతమైన ఒకస్థానమందు లేదు. ఈ మతభేదమునకు కారణమిదివరకే సూచింపబడియున్నది. ధర్మమునకు మూల మపౌరుషేయమైన వేదము, "లా"కు మూలము రాజాజ్ఞ అయియుంటయే కారణము. మరియు పాపభీతి, నరకభీతి జనులను సత్ప్రవర్తనయందుంచగలుగునని వారికి నమ్మకములేదు. ఆర్యావర్తమునన్నో పాపభయము మెండు. నరకప్రాప్తికిజంకినటుల రాజదండనమునకు వెరువరు. స్వర్గభోగాపేక్ష కాశపడినటుల ఐహికసుఖముల కాశింపరు. ప్రమాదవశమున పాపకృత్యము లొనర్చి, నరకప్రాప్తి తప్పించుకొనుటకై తమంతటతాము రాజదండనకు లోబడినట్టి పుణ్యపురుషుల చరిత్రములు పురాణాదుల గానంబడియెడి. అన్నగారూరలేనపుడాయన తోటలోనివి కొన్నిపండ్లుపయోగించి తరువాత తాను చేసినపని యకృత్యమని యెరింగి తనంతటతాను రాజుకడకేగి శిక్షననుభవించిన బ్రాహ్మణోత్తముని చరిత్రము భారతము చూచినవారికందరకును విదితమే. కావున ఆర్యావర్తమున పాపభీతి, పుణ్యకాంక్ష ఈరెండును ధర్మప్రవర్తనకు ప్రోత్సహించునటుల రాజదండనవలని భయము ప్రోత్సహింపజాలదు. కావున మెడమీద కత్తి పెట్టించి దడపించినగాని జనులు "లా"కు బద్ధులైయుండరని వారి నమ్మకము. "పాపముచేసిన నరకబాధ ననుభవింప వలయును, పుణ్యముచేసి స్వర్గసుఖము ననుభవింప వలయును" అని చెప్పినంత మాత్రముననే ధర్మహాని గలుగదని ఆర్యులనమ్మకము—ఇటులనుటవలన మనదేశమందు దండనీతియొక్క ఆవశ్యకత గుర్తింపలేదని యభిప్రాయముగాదు. అవసరమగునెడల రాజదండనము విధింపబడియేయున్నది. కాని ప్రధానముగ ధర్మమును రక్షించు శక్తులు, పుణ్యపాపభావనలు గాని, రాజదండనమాత్రముగాదు. ఈవిషయమున భేదమేమియున్నను ఉల్లంఘింపబడిన విధిప్రతిషేధములు ప్రత్యవాయజనకములనుట, వారికిని మనకును సమ్మతమే.

లాభాపేక్ష గలుగునను వాశ ధర్మాచరణకు పురికొల్పునని చెప్పియున్నాము. కాని, యాకలుగబోవు లాభము, ఇతరమార్గములవలన సాధించుటకు వీలుగానిదిగా నుండవలయు. ఆలాభ మన్యత్ర సిద్ధించునట్లయిన ధర్మమార్గమునకేల రావలె? కావున ధర్మాచరణవలన గలుగబోవు లాభము అనితరసాధ్యమై, అపూర్వమై, అతీతమై యుండవలెను. ఇట్టిలాభ మాముష్మికానందము. దీనికి మీమాంసపరిభాషలో "అపూర్వ"మని పేరు. విధివిహితమైన కర్మాచరణమువలన, మనుష్యదుర్లభమైన ఈ "యపూర్వము" సిద్ధించును. కావున జనులు ధర్మమార్గము తప్పకుండునట్లు చేయునది "అపూర్వము" లభించునను నాశ. ఇక అధర్మమెట్లు నివర్తింపబడునో చూడవలయును. సత్కర్మలవిధించునవి విధివాక్యములు. దుష్కర్మలను నిషేధించునవి ప్రతిషేధములు. ప్రతిషేధములను పాటింపకుండుటవలన ప్రత్యవాయము తప్పక కల్గును. ప్రాయశ్చిత్తరాజదండనాద్యైహిక బాధలు, మరణానంతరము యమదండనము — ఈబాధలు కల్గునను భయమువలన అధర్మప్రవర్తన మానివేయుదురు. కావున అపూర్వాపేక్షవలన ధర్మప్రవర్తనము, ప్రత్యవాయభయమువలన నధర్మనివర్తనము సిద్ధించుచున్నది. ఆర్యధర్మమునకు ఈరెండును పునాదులు:— స్వర్గకామభావన, నరకభయభావన.

ఇంతవరకును తెలిసినవిషయ మేమన, వేదచోదితమైనవెల్ల ధర్మమనియు, స్మృత్యాదులుగూడ, అనుమితశ్రుతిమూలకము గాన ప్రామాణికములనియు, మూలోద్దేశ్యముల విషయముసతప్ప, తక్కిన విషయముల ప్రాక్పాశ్చాత్యసిద్ధాంతములకు విరోధము లేదనియు, "లా" ప్రత్యక్షమగు రాజదండనవలనను, ధర్మమప్రత్యక్షములగు స్వర్గనరక భావనల వలనను, ప్రత్యక్షమైన రాజదండనవలనగూడ సంరక్షింపబడుచున్నదనియు చూచియుంటిమి.

శ్రుతిస్మృతివిహితమైనది ధర్మమైనచో నందు ప్రతివాక్యమును, విధియని శిరసావహింపవలయునా? ఆవాక్యములయందంతర్భేదము లేమైనకలవా? "పంచనఖములుగల మృగములమాంసము తినతగినది" అని యొకవాక్యమున్నచో దీనికి, సర్వజనులును, అట్టి జంతువుల మాంస మవశ్యము తినితీరవలయునని యర్థమా, మాంసము తినగోరినవారు అట్టిజంతువుల మాంసము గనవచ్చునని యర్థమా? ఆమాంసమందరు తినితీరవలయునని యభిప్రాయమై యుండదు. కావున కొన్నికర్మలవశ్యము చేయవలసినవి, ఇష్టమైనచో చేయదగినవికొన్ని, ఇట్టి భేదముండి తీరవలయును. ఈవిషయము విపులముగ ముందువ్యాసమున చర్చింపపబడును.

—వంటు శ్రీనివాసులు,
బి. ఏ., బి. యల్.

# విరహరాధిక.

శా. రారా! రాగమయస్వరూప! కనుగో
రా! నీ ముఖాలోకనా
భారంబుల్ గద! నీదు దాసిఁగు రా
ధా ప్రేయసీ ప్రాణముల్!
ఈ రాకామయ యామునీయతటుల
న్వేషించినఁ జాడ లే
దేరా! నీవ్వుడు వేణుగానవి మో
కృష్ణా! జగన్మోహనా.

సీ. నిదురలో నిన్గాంచి నిరతంబు మదినుంచి
కృష్ణా!యనుచు సంస్మరించుచుంటి
కౌముదీస్నాతసైకతదేశములనెల్ల
వెఱ్ఱినై యారీతి వెదకుచుంటి
వలపు వాసనలీను పసుపుమల్లియ సరుల్
దీర్చి నిన్నర్చింప దెచ్చుచుంటి
నీకు మంగవలోని నిశితపమ్మోహన
చ్ఛవియున్గి తమినొందఁ జనుచునుంటి

తే. గీ. విరియబడి వేణిబంధంబు వేఁబడింప
నే యలంకారములు సేయ కేగుచుంటి
రాగదే! కృష్ణ లావణ్యరసతరంగ!
రాధయిదే! రాగబాధార్తరాధయిదిగో!

—పాటిబండ అప్పారావు.

# జాతీయవిద్య.

తెలియని విషయములను తెలియజేయునది విద్యయనబడును. వేదమనగూడ యాపేరందులకే వచ్చెను.

శ్లో॥ ప్రత్యక్షేణాను మిత్యావాయస్తూపాయో నవిద్యతే
ఏతంవిదం వేదేన తస్మాద్వేదస్య వేదతా॥

వేదము, విద్య, యను రెండుపదములును నొకేధాతువునుండి వచ్చిన రూపములు. విద్యకు జ్ఞానము ఫలము. జ్ఞాన మాత్మవికాసమును చేయును. దానినే సామాన్యముగ నాగరకతయని యందురు. నాగరకత యనునది మానవుని పైపూతలపై నాధారపడి యుండదు. ఆత్మను వికసింపజేయనిది నాగరకతయనునామమున కర్హము కాదు. జ్ఞానము వివేచనాశక్తినిచ్చును. వివేచనమనగా మంచిచెడ్డలను స్వశక్తివలన నిర్ణయించుకొనుట. ఇది యైహికజ్ఞానము. నిత్యానిత్యవస్తువివేచన మాముష్మికజ్ఞానము. విద్యయొక్క ఫలము మొదటిజ్ఞానము నుత్పత్తి చేయుటయా లేక రెండవదానిని కలుగజేయుటయా? రెండును విద్యాకార్యములే. ఆకారణమువలననే మనపూర్వులు విద్యను రెండురకములుగా భాగించిరి. ఐహికవిద్య యపరవిద్య. ఆముష్మికవిద్య పరవిద్య. రెండవది యుత్తమమైనది. కాని మొదటిది రెండవదానికి మార్గము. అట్లు మార్గమగునదియే విద్యయను నామమున కర్హము. మనదేశమున విద్యలనబడువానికిని పాశ్చాత్యదేశమున విద్యలనబడువానికిని నిదియేయొక గొప్ప భేదము. అచ్చట నైహికమునకు నాముష్మికమునకును ప్రత్యేకత్వము కలదు. ప్రతిదినమును నారోజా రొట్టె నియ్యుమని భగవంతుని గోరుటయే రెంటికిని సంబంధము. మనదేశమున ప్రతిపనియొక్క యాద్యంతములయందు భగవానుని తలచుట విధియైయున్నది. అందునకే మనయాదర్శ మిమిడియున్నది. "హరిఃఓం," "ఓంతత్సత్" అను రెండువాక్యములును మనముచేయు ప్రతిపనియొక్క యాద్యంతములకుపలక్షణములు. "యద్యత్ కర్మకరోమి తత్తదఖిలం శంభో తవారాధనం!"

అనువాక్యము ప్రతిపనిని మన మేధృష్టితో చూచుచుండుమో తెలియజేయును. తత్త్వాన్వేషణము ననుసరించియే మనపూర్వులు శాస్త్రమును తీసుకొన్నను జగత్కారణమగు పరబ్రహ్మమునుండి బయలుదేరిదీని మరల తుదకా తత్త్వమునందే యుపసంహరించిరి. ఈయొక్కయంశమే మనవిద్యయొక్క వార్ధక్యమును చూపుటకు జాలును. పాశ్చాత్యవిద్యలుకూడ యట్టి తత్త్వమునుండియే బయలువెడలినవియని యనుకొన్నను పోనుపో నాతత్త్వమునుండివిడిపోయి మరల దానియందు కలియుటకువీలులేనంత విస్తృతములైనవి. మరియు నావిస్తారమును కేంద్రీకరించు ప్రయత్నములు చేయబడలేదు. తుదకు మతమునకును, ప్రవర్తనమునకును సంబంధము లేనంత స్థితికి వచ్చినది. మొన్నజరిగిన సంగ్రామముకూడ పాశ్చాత్యుల దృష్టిని సత్యముపైకిని ధర్మముపైకిని మరల్పజాలకపోయెను. చెప్పెడు మాటలకును చేయుచేతలకును దూరము తఱుగలేదు. మనసాంప్రదాయముల మనము మరచిన యెడల మనముకూడ యాముష్మికమునకు క్రమముగ దూరులమగుదుము.

విద్యకు ప్రాచ్య, పాశ్చాత్యత్వములు వర్తించునా? అట్టిభేదము విద్యకుకలదా యని చర్చించుట యవసరము. మొన్న లోకప్రముఖు లొకచో జాతీయవిద్యనుగూర్చి యుపన్యసించుచు తనమిత్రులలో నొకరు విద్యకు జాతి కలదాయని ప్రశ్నించిరని విన్నవించిరి. నేనుకూడ నీవ్యాసమునం దట్టితప్పనే చేయుచున్నాను. విద్యయనునది నిరాకారవిషయము. దానికి ప్రత్యేకముగ జాతిలేని మాట వాస్తవమే. కాని యే నిరాకారవిషయమును తనంతట తా నుండనేరదు. తప్పక యొక సాకారవస్తువు నాశ్రయించియుండును. విద్య నిరాకారవిషయమైనను నది వ్యక్తుల నాశ్రయించినప్పుడును నట్టివ్యక్తులుగల జాతికి పరంపరానుగతమై వచ్చునపుడును నిరాకారవిషయముగ పరిగణించుటకు వీలులేదు. వ్యక్తుల కెట్లుజాతి కలదో వ్యక్త్యాశ్రయమగు విద్యకుకూడ జాతీయత యుండుట కభ్యంతరములేదు. వ్యక్తులకు జాతులు కలవనుట నిర్వివాదాంశము. వ్యక్తులకు వేర్వేర ప్రత్యేక ప్రతిభకలదు. వ్యక్తులసమూహమగు నొకజాతికికూడ జాతిప్రతిభకలదు. అటులనే విద్యకూడ జాత్యాశ్రయమైనపుడు జాతీయమగును, భావము నిరాకారము. కాని యొకజాతికి తగినటుల జాతీయభావ ముండుట కేమి యభ్యంతరము? ఇప్పుడు ప్రభుత్వవిధానపాఠశాలలలో గఱపబడు విద్యలోని లోపమే యస్మజ్జాతీయభావరాహిత్యము. కావున కేవలము విద్యయనుదానికి జాతీయత లేకపోయినను నది సామాన్యముగ జాత్యాశ్రయమైయుండునుగావునను జాతి కొన్నిసాంప్రదాయములు కలిగియుండును గావునను నట్టి సంప్రదాయములనే యాజాతి చదువుకొనువిద్య యాధారము చేసికొనవలసి యున్నందునను, విద్యకుకూడ జాతీయత సిద్ధించినది. జాతీయవిజ్ఞానము జాతీయభావము నిక్షేపాధువులని యెంచవలయును.

నిరాకారమైన విద్య గఱపబడుటలో క్రియారూపముగ పరిణమించును. అప్పుడదానికి జాతీయత యవశ్యముగ సిద్ధించును. గణితశాస్త్రమునందు జాతీయగణిత ముండునా? తత్త్వశాస్త్రమునకూడ జాతీయతత్త్వశాస్త్ర ముండునా? ఇట్టి కుప్రశ్నములకు సులభముగ ప్రత్యుత్తరముల నొసంగవచ్చును. ఎట్లన నొక్క "యుండు"నుటతో తీరును. వేదసులు మొదలగునవి యనుసరింపబడునపుడు పద్ధతులనుబట్టి గణితము జాతీయమగును. తత్త్వశాస్త్రవిచారమున Matter & Spirit మొదలగువాని ప్రశంస వచ్చినప్పుడు ప్రకృతి పురుషులనియు, క్షేత్రక్షేత్రజ్ఞులనియు చర్చించునపుడు తత్త్వశాస్త్రపద్ధతి జాతీయమగును. ఒక పద్ధతిగాని యొకసంప్రదాయముగాని యొకశాస్త్రపఠనమును జాతీయముగ మార్చును. ఇచ్చట దృక్పథము లేకభావము ప్రధానములు. అట్టులేకాకపోయిన జాతీయవస్తువులు మొదలగునవికూడ యసంభవములే కదా! సౌకర్యముకొఱకు కేదుస్తుల ధరించిననేమి? అట్లే భగవత్ప్రార్థనములో నేమతము ననుసరించిన నేమి? ఉదరంభరణమున దేనినితిన్న నేమి? ఇట్లే వాదమున కనవస్థాదోషము ప్రాసగును. సాధ్యమైనంతవఱకు వాదము కుతర్కము ననుసరింపకుండునెడ విద్యకు జాతీయత లక్షణమువలననైన నున్నదనియే యొప్పుకొనవలసివచ్చుచున్నది. దేశములయొక్క శీతోష్ణస్థితి ననుసరించి యాదేశములందలి జాతులయొక్క స్వరూపస్వభావాదులుండును. ఈరెండును అన్యోన్యాశ్రయమును కోరునంశములైయున్నవి. వానితోకూడ భావపరివర్తనాదులు కలుగుచున్నవి. భావముపై విద్యకూడ యాధారపడియున్నదిగాన విద్యకుకూడ జాతీయత వర్తించుచున్నది. కలకత్తావిశ్వవిద్యాలయ విచారణసంఘము విద్యావిషయములపై విపులచర్చనుచేసి తమనివేదికయందు ప్రాచ్యవిద్యయనియు పాశ్చాత్యవిద్యయనియు ననేకమారులు వాడియున్నారు. విద్యకు ప్రాచ్యత్వపాశ్చాత్యత్వము లుండునెడ జాతీయత యుండుట కభ్యంతరమేమో నాకు తెలియదు.

జాతీయత యనునది యొక వ్యక్తిసమూహము తనసార్థక్యమును నిలుపుకొనుట కుపకరించు భావము. జాతీయభావమును కోల్పోయినజాతి తనవ్యక్తిత్వమును కోల్పోయినది యగును. జాతీయతను కాపాడుకొనుట యొక జాతియొక్క ముఖ్యకర్తవ్యము. ఒకజాతియొక్క వ్యక్తిత్వ మా జాతియొక్క భూతముపై నాధారపడియుండును. కావున వర్తమానము కొరకు భూతమును బలియిచ్చుటచే జాతియొక్క వ్యక్తిత్వము నాశనమగుటకు మొదలిడును. ఇచ్చట నొక పెడత్రోవగలదు. జాతీయత యను పేరిట దౌర్జన్యమునకు గడగుట గొప్పలోపము. ప్రతిజాతియు తనపృథక్త్వమును కాపాడుకొనుటకు ప్రయత్నములు సలుపవలయునే కాని యన్యజాతియొక్కయు నన్యజాతీయతయొక్కయు దూషణమున కెన్నటికిని గడంగరాదు. ఇట్లు చేయుటచే జాతికి గౌరవభంగమగును. ఒకజాతి తన జాతీయతామదమున సకలజాతిసౌభ్రాత్రమును మరువరాదు. దానిని మరపించు జాతీయత నిజమైనజాతీయత కానేరదు. ఇక దానిని దూషించు జాతీయత నేమనవలయునో నాకు తెలియదు. ప్రతిజాతియు తనసార్థక్యమును కాపాడుకొనుచు సకలప్రపంచకల్యాణమునకు తోడ్పడుచుండవలయు. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు వాఙ్మయములో శాశ్వతస్థానము నలంకరింపదగిన తమ బందరువాఙ్మాలయున స్వరాజ్యనిర్వచనమును చేసి దానిచే మహాత్ములదృష్టి నాకర్షించిరి. స్వరాజ్యమున భారతభూమియందలి యన్నిజాతులును తమతమ స్వధర్మమును నిర్వర్తించుటయేయని వారానతిచ్చిరి. అట్లే ప్రపంచశాంతి యేజాతివారాజాతియొక్క స్వధర్మమును కాపాడుకొనుటచే కలుగును.

జాతీయవిద్యయన నెట్టిది? ప్రస్తుతకాలమున నీప్రశ్న మనదేశమును కలవరము పెట్టుచున్నది. బంగాళమునందేమి, బీహారమునందేమి, యింకా యితరరాష్ట్రములందేమి జాతీయవిద్యానిర్వచనప్రయత్నములు చేయబడుచున్నవి. మనరాష్ట్రమునందుకూడ తత్సూచకముగ నాంధ్రజాతీయవిద్యాపరిషత్తు స్థాపింపబడి జాతీయవిద్యాస్వభావములను నిర్వచించుటకు ప్రయత్నములు సల్పబడుచున్నవి. ఎవరెన్ని విద్యాపీఠములను స్థాపించినను స్వరూపనిర్వచనము నెవ్వరును చేసియుండలేదు. తుదకు గాంధిమహాత్ముడు, మౌలనామహమ్మదలీ మొదలగు నత్యుత్తమ విద్యాధికులుకూడ దానిని పూర్తిగ చేసియుండలేదు. కొందరుమాత్రము కొన్నియభిప్రాయములను వెలిబుచ్చియున్నారు. అయ్యవి యాంధ్రదేశముయొక్క భావప్రపంచమును గలంపజాలును. కొన్నివిద్యాలయములు జాతీయములని పిలువబడుచు కొన్నిదారుల నడచుచున్నవి. ప్రతివిద్యాలయమును తన ప్రత్యేకప్రతిభను చూపవలసినదేకాని జాతీయపాఠశాలలకన్నిటికి వర్తించు కొన్ని మూలసూత్రము లుండవలదా? ఆసూత్రనిర్వచనము చేయవలదా? ఇప్పటి విద్యాలయములు తలకొక విధానము ననుసరించుచున్నవి. విద్యాస్వరూపనిర్వచనము నాబోటి మందబుద్ధియొక్కడు చేయగలపని కాదు. నాయకులలో కొందరు చెరసాలలయందున్నారు. మరికొందరు కార్యాంతరవ్యాపృతులై యున్నారు. ఉద్రేకపూరితములగు నితరవిషయములు దేశముయొక్క దృష్టి నాకర్షించుచున్నవి. ముఖ్యములెవ్వియో, యానుషంగికములెవ్వియో కనుగొనునంతటి మనశ్శాంతి ప్రజలకు చిక్కుటలేదు. జాతీయవిద్య యొక ముఖ్యాంశముగానున్న నిర్మాణకార్యక్రమము నెడల ప్రచారకులకనేకులకును, కొందరునాయకులకుకూడ నమ్మకములేదు. అతిముఖ్యమయ్యు ప్రస్తుతమనాథమైయున్న జాతీయవిద్యను వదలి యానుషంగికములయ్యు తాత్కాలికసనాథములైయున్న యితరవిషయములపై దృష్టి కేంద్రీకరింపబడి యున్నది. నిర్మాణశక్తిలేని ప్రతికక్షులు రంధ్రాన్వేషణమునకు గడగుచున్నారు. పరిస్థితులు సవరింపబడువఱకు ప్రయత్నములిట్లే డోలాయమానములుగ నుండును. దేశీయులకుమాత్రము జాతీయవిద్యావశ్యకత బాగుగ తేటపడినది. విధానమునందనేకభేదములున్నవి. కొందరు ప్రస్తుత ప్రభుత్వవిధానపాఠశాలలయందలి విధానమునకే హిందీని రాట్నమును చేర్చిన జాతీయవిద్య కాగలదని యనుచున్నారు. కొందరింగ్లీషును హిందీని పైతరగతులలో మొదలిడవలయుననుచున్నారు. మరికొందరు బొత్తుగ నింగ్లీషునే విధానములోనుండి తీసివేయవలయునని యనుచున్నారు. ఇట్లే తలకొక యభిప్రాయమును వెలిబుచ్చుచున్నారు. వీరందరొకచో చేరి విధానమునుగూర్చి చర్చసలిపి నిర్ధారణము చేసి దేశమునకు దారినిచూపి విద్యార్థులను సరియైన దారిని నడుపవలసియున్నది. ప్రస్తుతవిధానములలో నేదియు సంపూర్ణముకాదు. ప్రతిదానియందలి గుణములను గ్రహించి కూర్పవలయును. ఆధునిక నాగరికత యని పిలువబడుదానికికూడ యందు తావుండవలయును. ఆశయములను ముందు సిద్ధాంతీకరించిన వానిననుసరించి విధానముండవలయును. అన్నిరాజకీయపక్షములవారును ప్రస్తుతరాజకీయవిద్యయందు గొప్పలోపము లున్నవియని యొప్పుకొనుచున్నారు. ఆలోపము లెవ్వియో నిర్ధారణముచేసిన విద్యాస్వరూపము తేలగలదు. భారతజాతీయవిద్యకు నూతననిర్వచనము నీయకతప్పదు. ఏజా

తికితగినట్లు ఆ జాతికి నాగరికతగలదు. తదనుగుణములగు వాఙ్మయాదులు కలవు. వీనినన్నిటిని పరీక్ష చేసిన నే జాతి కెందు సహజప్రతిభకలదో తెలియగలదు. దానినిబట్టి యా జాతి కెట్టివిద్య కావలయునో తేల్చుట పొసగును. సామాన్యముగ ప్రాచి యాధ్యాత్మికచింత కలది. ఆముష్మికమునకు తోడ్పడు నైహికజీవనమే యత్యుత్తమమైనది యని మనపూర్వు లభిప్రాయపడిరి. విద్యకును ప్రవర్తనమునకును ప్రాచ్యదేశములందు మతమే యుజ్జీవనము. గాంధిమహాత్ముని యుద్యమ మందుచేతనే హైందవప్రజల హృదయముల నాకర్షింపగలిగినది. సత్యాగ్రహము, దౌర్జన్యరాహిత్యమను రెండుమాటలలో మన ప్రతిభ యిమిడియున్నది. ప్రాచీస్వభావమునకు మంత్రపూతమై విశ్వామిత్రుని గర్వభంగమునకు కారణముకాగలిగిన వసిష్ఠదండమే యుపలక్షణము. 'ఆత్మశక్తి', 'ఆత్మబలము', వీనియంతరార్థమును తెలియజాలినది ప్రపంచమునందలి దేశములలో నెల్ల నొక్క భారతదేశమే!! అట్టిశక్తి తప్పక తుదకు విజయము నొందగలదని మనకన్నులముందర సంపూర్ణవిజయముగాంచిన యకాలీయుద్యమమే యుదాహరణము.

ఎట్లు ప్రతివ్యక్తియు తనపృథక్త్వమును నిలుపుకొనుచు సంఘమున నొకసభ్యుడైనాడో యట్లే ప్రతిజాతియు తనపృథక్త్వమును కాపాడుకొనుచు ప్రపంచజాతులలో పరస్పరసౌభ్రాతృత్వము కలిగియుండవలయును. విద్యార్థియొక్క యింద్రియజ్ఞానమును వృద్ధిచేయుట విద్యాకార్యములలో ముఖ్యమైనది. ఇట్టితత్త్వశాస్త్రసూత్రము లన్నిజాతులకును విద్యాభ్యాసమునందు సమానములు. అట్టివానిని వదలి మిగిలినయంశములందు జాతీయవిద్య జాతీయసాంప్రదాయముల ననుసరింపవలయు. అట్లు కాకపోయిన నావిద్యాపద్ధతి విజాతీయమగును. ఆధునికపరిజ్ఞానమునుకూడ నీజాతీయసంప్రదాయములకు చేర్పవలయును. లేక దానిని జాతీయసంప్రదాయము ననుసరించి యన్వయించుకొనవలయును. విద్యావిధానము, పైన చెప్పిన యభిప్రాయములను సమన్వయించినగాని తేలుటకు వీలులేదు. విధానము నమలులోనికి పెట్టుటలో నే జాతికిని మనస్తాపము కల్గకుండునట్లుండవలయును. మతవిషయకవిద్యాబోధన మవశ్యకర్తవ్యమని తలపబడునెడల నట్టిబోధనము విద్యార్థులలో పరమతసహిష్ణుత్వమును స్వమతగౌరవమును కలుగజేయవలయు. మతవిషయములందు విద్యార్థులను స్వతంత్రవివేచనాశక్తివంతులుగ జేయుట యాశయముగ బెట్టుకొని పిల్లలను సంశయాత్ముల జేయుటకంటె నాశహేతువులేదు. మతమునకును ప్రవర్తనమునకును సంబంధముకల్పించి వారివారి మతసిద్ధాంతముల నా మతానుయాయులగు విద్యార్థులకు బోధించుచు సర్వమతసామ్యమును నొక్కిచెప్పవలయును.

జాతీయప్రతిష్ఠాపనము లనబడువానిలో ముఖ్యములగు వానినిగూర్చి కొంచెముగ చెప్పెదను. అన్నిటియందును జాతీయభావమనబడు నొకసామాన్యవాతావరణము కలదు. కాని తత్ప్రచారములో భిన్నమార్గము లనుసరింపబడుచున్నవి. మొదటిది బోల్పూరాశ్రమము. అది కొద్దిదినములక్రిందటవరకు కలకత్తావిశ్వవిద్యాలయమునకు సంబంధింపక స్వతంత్రముగ నుండెను. అప్పుడది పవిత్రవాతావరణపూరితమై దేవాలయసదృశమై పవిత్రభావముల కాలవాలమై విలసిల్లుచుండెడిదియని చెప్పుదురు. ఇప్పుడా యాశ్రమము విశ్వవిద్యాలయముతో సంబంధింపజేయబడినది. దానితో నాశయములు మారినట్లే మనము తలపవలసియున్నది. వెనుకటిగుణములే యింక ననువర్తించుచుండవచ్చును. అందు తయారైన విద్యార్థులు ప్రపంచమునకుగాని స్వసంఘమునకుగాని యెట్లుపకరించుచున్నారో చెప్పజాలము. కాని యాశ్రమము "ఆండ్రూసు" మొదలగు కొందర నద్భుత ప్రపంచసేవాతత్పరులను తయారుచేసినది. అంతమాత్రమున తృప్తిపొంద వీలులేదు. అద్భుతవ్యక్తులనుబట్టి సర్వానుగతమగు సామాన్యమును నిర్ణయించుట పొరబాటు. అట్టివ్యక్తు లత్యల్పసంఖ్యాకు లన్నిజాతులయందు నుందురు.

రెండవది హరిద్వారమునందలి గురుకులము. హరిద్వారము విద్యాప్రతిష్ఠాపనముండుట కన్నివిషయముల తగినప్రదేశమైన నెక్కడనో మారుమూలను పర్వతమధ్యమున ప్రపంచమునకు సంబంధించనిస్థలమున నున్నది. విద్యావిధానమున విద్యార్థుల కప్పుడప్పుడు ప్రపంచమెట్లుండునో చూపుచు సంఘ మెట్లునడచుచున్నదో తెల్పుచు విద్యార్థుల పరిజ్ఞానశక్తిని వృద్ధిచేయుచుండవలయును. అట్లుగాక నెక్కడనో పిల్లలనుంచి వారిని బోనులోని యడవిమృగములట్లు చేసిన, వారు సంపూర్ణవిద్యావంతులైనను వారివలన ప్రపంచమునకును వారికికూడ నేమిలాభము? గురుకులమునం దనుసరింపబడునది కొంతవరకు శ్రీ రామలింగారెడ్డిగారుచెప్పినటుల "పోతపద్ధతి." కొన్ని సంవత్సరములందు తయారయిన విద్యార్థుల గొందర మనము చూచుచున్నాము. వారివద్ద సత్యశౌచాదు లుండవచ్చును. ప్రపంచజ్ఞానముమాత్రము శూన్యమని తెలిసికొనగలము. జాతీయసాంప్రదాయములమీదనే యావిద్యాభవనము నిర్మింపబడినను యట్లచ్చొత్తుట శ్లాఘనీయముకాదు. ఋషికులమని మరియొక యాశ్రమపద్ధతులపై నడపబడు

విద్యాప్రతిష్ఠాపనము కలదు. ఈరెండును లక్ష్యభేదము నందుతప్ప యొకదానినొకటి బోలియున్నది. క్రమశిక్షణయుండవలయునుగాని యది స్వేచ్ఛాయుతముగ నుండక పోయిన తుచ్ఛముగ పరిణమించి విద్యార్థులయాత్మలను సంకీర్ణీభూతములుగ జేయును. బాహ్యవిద్యతో సంబంధముకలుగ జేసికొనుట యసిధారావ్రతమువంటిది. అది యాటకాగు. మరియు కొందరుప్రత్యేకవ్యక్తులు విద్యార్థిసామాన్యముపై తమనిరంకుశత్వమును చూపుట తగదు.

మూడవది సత్యాగ్రహాశ్రమము. ఇం దింద్రియజేతలును కామాదివివర్జితులును సత్యపరాయణులును, నగు నాముష్మికులు తయారగుదురు. సేవయన్న నిందుతయారైన వారికి ధర్మము. కాని యైహికమును పూర్తిగ వదలి యహంప్రత్యయ నాశనమును చేయువిద్య సామాన్యమానవకోటికి కాదు. ఆముష్మికమునకు సాధనమగు నైహికవిద్య మనయాదర్శముగ నుండవలయు. ఈమూటిను క్రమముగ ప్రస్తుతహైందవులలో నప్రతిమానప్రతిభావంతులని పిలువబడు మహామహులగు రవీంద్ర లజపతిరాయ గాంధిగార్లచే స్థాపింపబడినవి. పేరుల వినినంతనే ముఖవిధానమగుచున్నది. వారాదర్శపురుషులు గాన వారూహచేసినది యాదర్శవిద్య. అట్టిది ప్రతివిద్యార్థికిని లక్ష్యముకానేరదు. వీనిలోని విద్యావిధానములు సర్వతోముఖములుకావని యనుమానింపవలసియున్నది. మరియు నీసంస్థలు వ్యక్తిప్రధానములు. అట్టివి యెల్లకాలములయందు వరలుచు విద్యార్థుల నాకర్షించుచునే యుండును. అవ్వియనేల! కేవల మతవిద్యాలయములుకూడ తప్పక యుండవలయును. అభిమానవిద్యాపఠనము చేయువారికి సౌకర్యములు కలుగజేయుటకూడ తప్పక మనవిధియే! జాతీయవిద్యయొక్క యుద్దేశము పైమూడువిధములుమాత్రమే కాదనియు విద్యార్థులను దైవరాజదేశభక్తులుకలిగి స్వతంత్రజీవనముచేసికొనగలిగి మానవసేవ కుపకరించువారులనుగ చేయుటయని నామందబుద్ధికి తోచుచున్నది. విద్యార్థులను విప్లవకారులనుగ చేయుట మనయాశయముగ నెప్పటికి నుండరాదు. విద్యార్థులు సంఘముయొక్క కష్టసుఖములలో పాల్గొనునట్టి మనశ్శాంతము గల్గినవారుగ నుండవలయును. టాగూరుగారు విద్యయనునది విశ్వసామాన్యముగనే యుండవలయు నని యొకమహాశయము నెలవిచ్చియున్నారు. దనికి కొంత వెనుకనే సమాధానము నిచ్చియున్నాను. విశ్వవిద్యయనునది చరమసోపానము. అట్టిచో యెక్కలేనిది స్వర్గమున కెక్కుట యెట్లు? కావున విశ్వవిద్యామార్గములో వ్యక్తివిద్య, జాతీయవిద్య యను నవి రెండును సోపానములు. ఈసోపానపరంపరను సామాన్యమానవుడు క్రమముగ నొకదానివెనుక నొకటిగ చేరగలడు. కొన్ని యద్భుతవ్యక్తులు తమశక్తిచే వీనిలో నేమెట్టునైనను తాకకుండనే పైకిపోవచ్చును.

ఇప్పుడు జాతీయపాఠశాలలలో గరపబడువిద్య యాదర్శప్రాయమైనదియని చెప్పుట కెవ్వరికిని నోరాడదు. ఇది పరివర్తనకాలము. మరియు విద్య క్రమముగ కాలమునను సరించి మార్పుచెందు నంశములలో నొకటి. "ప్రవర్ధమానత దానిలక్షణములలో నొకటి." విద్యావిషయములలో నొకయాచార్యపదవి నలంకరింప సామర్థ్యముకలిగియు ప్రస్తుత మేకారణములచేతనో బయటకు రాకుండ నుండిన యరవిందఘోషుమహనీయు డొకమారు హిందూజాతికి స్వరాజ్యములభించువరకు జాతీయవిద్యయనునది యుండనేరదని తెల్పియున్నారు. మనము జాతీయవిద్యయనుకొనునది జాతీయనిర్మాణవిద్యయని చెప్పియున్నారు. కాని స్వరాజ్యమున కెట్లుపాటుపడుచున్నామో తదంగముగ నేకకాలావచ్ఛేదముగ జాతీయనిర్మాణవిద్యనుకూడ ప్రక్కనేవడిపించుచు తుదకు దానిని జాతీయవిద్యగ పరిణమింపజేయుటకూడ మనవిధియై యున్నది. తుదకు స్వరాజ్యప్రాప్త్యనంతరము కొంతకాలమునకు మనజాతీయవిద్య యంతర్జాతీయవిద్యగా పరిణమించును. అద్దియే టాగూరుగారి విశ్వవిద్య. దానికొరకా మహామహుడు పునాదిని వేసి పనిచేయుచునేయున్నాడు. భగవంతుడు తత్ప్రయత్నమునకు సంపూర్ణసాహాయ్యము నొసంగుగాక! ప్రస్తుతజాతీయవిద్యావిధానము ప్రభుత్వవిధానప్రతిబింబముగనే యుండకతప్పదు. అట్లని దానిని మీ రుదాసీనతతో చూడరాదు. ఏలన, భావము ముఖ్యము. విధాన మేదియైనను జాతీయభావముతో గరపుట మిక్కిలిప్రధానమైన యంశము. ప్రస్తుతము విధాననిర్ణయము కాలేదుగాన విధాన మేదియైన నేమియని యంటిని. అదికూడ తప్పక మారవలయును. సంధికాలపువిద్య యెల్లపుడును సంకరముగ నుండును. స్వరాజ్యసూర్యోదయము కానున్నది. అరుణోదయమగుచున్నది. అందు రాత్రిగుణములును, దివాగుణములు నుండకతప్పదు. సూర్యోదయానంతరము చీకటికి తావుమాత్ర ముండుటకు వీలులేదు. కావున స్థైర్యముచిక్కిన వెనుక సంపూర్ణవిద్యాపరిణామము రాగలదు.

జాతీయవిద్యావిమర్శకులు చెప్పు కొన్నిమాటల కిట సంగ్రహముగ నుత్తరముల నీయ బ్రయత్నించెదను. ప్రస్తుతజాతీయవిద్యాలయముల స్థితిగతులను తెలిసికొని వాని యుంచదలచుకొనబడు పద్ధతులను విమర్శించి జాతీయవి

ద్యానాదులుకూడ తప్పక యాత్మపరీక్ష చేసికొనవలయును. సర్వజ్ఞత్వ మెవ్వరికిని తగదు. ఒక్క భగవంతుడే సర్వజ్ఞుడు. విద్యావిషయములలో మనము సంబంధము గలుగ జేసికొనునది బాలురతోగాన బహుజాగరూకతతో మెలంగవలయు. లేకపోయిన వారిభవిష్యత్తును పాడుచేసినవార మగుదుము. ఇట్టిసలహా నొసంగినందులకు విమర్శకులకు వందనములిడుచు రంధ్రాన్వేషణము సులభసాధ్యమనియు నిర్మాణము కష్టమనియు మనవి చేయుచున్నాను.

జాతీయవిద్యాలయము లల్పసంఖ్యాకములుగ నున్నవియని యనుచున్నారు. "అల్పారంభః క్షేమకరః" అన్నటుల యిప్పటియల్పారంభము భవిష్యన్మహత్వసూచకము. కాంగ్రెసను నొకసంఘమును స్థాపింపవలయు నుద్దేశముతో మద్రాసులో శ్రీయుత సుబ్రహ్మణ్యయ్యరుగారింట కూడిన సభ్యు లల్పసంఖ్యాకులని మనకు తెలిసిన విషయమే. కాని యిప్పుడు కాంగ్రెసెట్లున్నది? యెవరెన్నిమాటలన్న నధికారపీఠ మాప్రతిష్ఠాపనమే యాక్రమించియున్నది. మఠకర్త లెందరు? తన్మతానుయాయు లెందరు? అట్లుగాకపోయిన నందరు నేనుక్రీస్తులేయైన వసుంధర మోయగలదా? ప్రపంచ మెప్పుడు నల్పసంఖ్యాకులచేతనే యుద్ధరింపబడినది. కావున నల్పసంఖ్యాకత్వ మొకవిషాదకారణము కాదు.

దేశభక్తి యని నొక్కిచెప్పిన దేశభక్తి యలవడగలదా? అసత్య మాడగూడదనువిషయ మెంతిమంది యెన్నిమారులు చెప్పినను ప్రవర్తనలో భేదము కలిగినదా? దేశభక్తియని యెల్లప్పుడును నెవరు నొక్కిచెప్పుచున్నారు? ప్రస్తుతప్రభుత్వవిద్యలో మొదటితరగతినుండి రాజభక్తి కీర్తనముల పిల్లలతలలోని కెక్కించుటచే పెద్దవారైనవెనుక రాజభక్తి యెంతయలవడినదియో మనము చూచుటలేదా? కావున ప్రవర్తనము స్థిరపరచుటకు నొక్కిచెప్పుటయు, బలవంతముచేయుటయు మాత్రమే కారణములు కానేరవు. వాతావరణమును కల్పించుటయు, నుపాధ్యాయుల ప్రవర్తనమును, గృహముయొక్క ప్రోద్బలమును కూడ ముఖ్యకారణములు. ప్రత్యక్షబోధనమునకును ప్రకృతికిని భేదమన్నమాట నిజమేయైనను బోధనమును బొత్తుగ మానవలయునా!

పాలకవర్గము మారినంతమాత్రమున నొకపాఠశాల జాతీయమగునా? అగునని యెవ్వరనిరి? ఏమార్పులులేక సర్కారువారిభృతిని గ్రహించనంతమాత్రమున నొక విద్యాలయము జాతీయ మెన్నటికిని కానేరదు. ముఖ్యముగ జాతీయభావమును గమనించి దానినివ్యాపింప జేయుటకై పాటుపడని పాఠశాలలు తన్నామమున కర్హములు కానేరవు. ప్రభుత్వవిధానపాఠశాలలో కూడ రాట్నము హస్తకౌశలవిద్య క్రిందను, హిందీ యైచ్ఛికభాషగాను నెలకొల్పుటకు ప్రయత్నములు సల్పబడుచున్నవట! అంత మాత్రమున నవి జాతీయములుగ మారునని యనుకొనుచున్నారు కాబోలు! అది భ్రమ. లక్ష్యములో నంతరమధికముగ కలదు. లక్ష్యము లక్షణమునకు పునాది. భావపరివర్తనములేనిది, యెన్నిమార్పులు చేసిన నవి పెనుకటివలెనే సర్కారుద్యోగముల కభ్యర్థులను తయారుచేయు యంత్రశాలలే యగును.

విద్యాపద్ధతులయందు మార్పుండవలయుననియు, ప్రస్తుతవిద్యలో లోపములు కలవనియు నాందోళనము చేయుట యొక్క కాంగ్రెసుతలనే పుట్టలేదనియు తమరటి పనికి కాంగ్రెసునకంటె పూర్వమే గడగితిమనియు కొందరుమహాశయు లనుచున్నారు. ఆగౌరవము వారికే దక్కనిండు! వారికి కాంగ్రెసుకంటె దూరదృష్టియు విషయపరిజ్ఞానము నెక్కుడుగనున్నవని యొప్పుకొందము. కాని మార్పులు మాయుద్దేశములు కావనియు పునర్నిర్మాణము మాయాశయమనియు నేను వారికి సవినయముగ మనవి చేయుచున్నాను. సామాన్య జాతీయపాఠశాలలలో "పాతపద్ధతి"ని చూచితిమని వారనుచున్నారు. కాని వారు జాతీయపాఠశాలలను బాగుగ పరికింపలేదనియు విషయనిర్ధారణమునందు పొరపడిరనియు మనవి చేయ సాహసించుచున్నాను.

చేయబోవుపని కష్టమా సుఖమాయని పరీక్ష చేయుట యవసరమని చెప్పుచున్నారు. నిజమే! అయినను కర్తవ్యము ధర్మమగునెడ కష్టసులభపరీక్ష పనికిరాదు. యథాశక్తి నెరవేర్ప బ్రయత్నించుటయే విధి. "నానృతంవదేత్" అనుచు నబద్ధమాడగూడదను నిషేధము కలదు. అబద్ధమాటకుండుట విధి. కాని యది నిర్వర్తించుట కష్టము. అట్లు నిర్వర్తింపనేరక కష్టమని నిర్ధారణముచేసి సులభమైన యనృతకథనమునకు గడగుట మానవలక్షణమా? దీనికి "ప్రాణవిత్తమానభంగమం" దను శుక్రవచనమును చూపుదురు కాబోలు!! పాపముకూడ శాస్త్రీయమే యగుచున్నది!

జాతీయవిద్యనుగూర్చిన కొన్ని నాయభిప్రాయములను దిఙ్మాత్ర మిట సూచించితిని. సాహసమునకు మన్నింప బ్రార్థితుడు. విద్యావిషయములను చర్చించి యాంధ్రజాతీయవిద్యాస్వరూపస్వభావముల నిర్ణయించుటకు మన యాంధ్రప్రముఖులు జాతీయవిద్యాపరిషత్తును స్థాపించి, విద్యాప్రతిష్ఠాపనములన్నిటిని దానితో సంబంధింపజేసి విద్యాధికుల యభిప్రాయములనారసి జాతీయవిద్య నేక

ముఖముగను, జయప్రదముగను నడపుటకు ప్రయత్నములు సల్పుచున్నారు. మీదంద రద్దానికి దోడ్పడి దాస్యభూయిష్టమగు విద్యను పొందినందులకు చింతించుచు నికముందువచ్చు సంతానమునకైనను జాతీయసాంప్రదాయముల పై నాధారపడువిద్యను గరపి దేశదాస్యవిముక్తికై పాటుపడవలయునని ప్రార్థించుచు విరమించుచున్నాను.

—కురుగంటి సీతారామయ్య.

---

# మొగమాటము.

౧

అణచిన నణగక నారాటపడుచు
పడుచుప్రాయపు టుబ్బుపారవశ్యమున
తనకంఠ మెత్తి తీయనిపాటఁ బాడ
నుల్లాతలూగు నీ యుత్సాహసఖిని
పల్లెత్తనీయ వీ పాపమేమోయి?

౨

పచ్చనియెలదోట పడకలనడుమ
తెల్లని సెలయేటి తిన్నెలమీద
నలువురు కలకల నవ్వురచ్చలను
తన కంఠ మెత్తి ... ... ...

౩

పూలపిందెలతెరల్ పురుడాడువాడ
చూడియాల్ నడలేక సోలేటి చోట
దినిమొలపనికన్నె తిరిగేటియెడల
ప్రొద్దు ప్రొద్దున పాడల్ ప్రష్పించుకడల
తన కంఠ మెత్తి ... ... ...

౪

ఎంత గారాబమో! యెంత మోహంబొ!
ఎంత దాపఁకమో! యెంత పామరమొ!
కడకు ఘోషాకన్నె గా జేసినావు
నీ గానముదితమో రాగాలరంగ!
తన కంఠ మెత్తి ... ... ...

౫

పలుకుసింగారంబు పైకిరాకుండ
ముసుగులోముచ్చటే ముద్దోయి ప్రియుడ
వినరాని పాటలే వేడకోసఖుఁడ
... ... ... ...

౬

సన్నగాపాడినా సంతోసమేను
మెల్లగాబాడినా యుల్లాసమేను
పదములు చెదరినా పాటింపఁబోము
శ్రుతులలో దోసాలు వెతకంగబోము
తీయగా హాయిగా తెనుగుగీతముల
పాడనీవోయి నీబంగారు చెలిని.

---

# ఆంధ్రగీర్వాణవిద్యాలయము, కొవ్వూరు.

శ్రీయుత తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారిచే 1912 సం॥రమున స్థాపింపఁబడినది. 10 సంవత్సరములనుంచి అవిచ్ఛిన్నముగ నాంధ్రగీర్వాణవిద్యల యభివృద్ధికై పనిచేయుచున్నది. ఆంధ్రసాహిత్యము ప్రత్యేకముగఁగాదుకదా, పేరునకైన నేర్పు విద్యాలయములు దేశమునం దెచ్చటనుగూడ లేవు. ఆంధ్రసాహిత్యమున గట్టిపునాదిలేనిచో నాంధ్రవాఙ్మయము పరిశుద్ధమయిన దెప్పటికిగాని దేశమున బయలు దేరనేరదు. ఆంధ్రవాఙ్మయము లేనిచో నాంధ్రదేశమునకు వృద్ధిలేదు. దొరతనమువారి పాఠశాలలలోగూడ దేశభాషయందే సర్వవిషయములును నేర్పబడవలెనను నభిప్రాయములు ప్రబలియున్న యీకాలమున నిట్టివిద్యాలయముల యావశ్యకత వేరుగఁజెప్ప నక్కరలేదు. సంస్కృతములేక యాంధ్రసాహిత్యమునకు జీవములేదు. అందువలన ఆంధ్రగీర్వాణసాహిత్యములకు బ్రాధాన్యమొసంగి వానియభివృద్ధికై యీవిద్యాలయము పనిచేయుచున్నది. ఆంగ్లవిద్యాపరిచయము మున్నగాని నూతనభావములు పెంపొందుటయు బ్రస్తుతకాలమునకనువగు విద్యావబోధనముగల్గుటయు సంభవింపదు. దానికై ఆంగ్లభాషాగ్రంథముల నర్థముచేసికొనుటకు దగిన యాంగ్లభాషాజ్ఞానముకూడ నిందు నేర్పబడును. ఆంధ్ర

గీర్వాణములయందు గట్టిపునాది కుదిరిన వెనుకగాని యాంగ్లభాష నేర్పబడదు. తర్కము, వ్యాకరణము, వేదాంతము మున్నగు శాస్త్రములన్నియు నిప్పుడు సంస్కృతమునందేయుండుటచే నాశాస్త్రములు పూర్వముమాదిరినే బోధింపఁబడుచున్నవి. గురుకులవాసమున విద్యాభ్యాసముకల్గినఁగాని దైవభక్తి, జాతీయభావము, దేశభక్తి, గురుభక్తి మున్నగునవి చిన్ననాటనుండియు నలవడుట సంభవింపదు. చిన్ననాట నేర్పడినగాని పెద్దయయిన వెనుక నివి లభ్యముగానేరవు. అందులకై గురుశిష్యులు విద్యాలయమునందె యుండి విద్యాభ్యాసము జరుపుటకు దగినయేర్పాటు కొంతవరకేర్పరుపఁబడినది. వర్ణాశ్రమవిధుల ననుసరించి చాతుర్వర్ణ్యములవారికిని విద్యగరపు నేర్పాటులు చేయబడినవి.

ఇప్పుడు 60 మంది విద్యార్థులును 8 గురు ఉపాధ్యాయులును నున్నారు. విద్యార్థులందఱకును భోజనసదుపాయము చితముగానే చేయబడుచున్నది. ఏకొలది మందియొతప్ప విద్యార్థులందఱును గాళిదాసత్రయమువఱకయినను సంస్కృతము నేర్చినవారేగాని క్రిందితరగతివారలేరు.

అధ్యాపకభృతికిని విద్యార్థులభోజనములకును నెలకు దాదాపు వేయిరూపాయిల ఖర్చున్నది. విద్యాలయమునకు నాలుగువేలరూపాయలు వఱకును వచ్చు స్థిరవసతులున్నవి.

ఇనాములో గొన్నిభూములు దానపూర్వకముగ లభ్యమైనవి. దాదాపు ఇరువైవేల రూపాయిల యప్పులున్నవి. అవి తీరినఁగాని ఆ యాదాయమును దీనివెచ్చించుటకై స్వేచ్ఛగా వినియోగింప నవకాశములేదు. దొరతనమువారి సహాయము గత సం॥రం రు 600 లు మాత్రమె వచ్చినవి. ఒక్క నెల వెచ్చమునకుకూడ జాలదు.

విద్యాలయమునకు రెండు భవనములు మాత్రమున్నవి. ఒకటి విద్యామందిరము. రెండవది భోజనశాల. అధ్యాపకులకు వాసగృహములును విద్యార్థులు చదువుకొనుటకు ప్రత్యేకభవనములును నిర్మింపవలసియున్నది. స్థలము మాత్రము సంపాదితమైనది. ఈయిండ్లకన్నిటికిని నధమ మిరువైయైదు వేల రూపాయిలయిన నుండవలెను.

మొన్నటివఱకును సంస్కృత విద్యాశాలకు సూపరింటెండెంటుగానున్న శ్రీమత్ తిరుమల గుడిమెళ్ళ వరదాచార్యులు ఎమ్. యె. గారు నెలకు నెండువందల రూపాయిలువచ్చు తమ యుద్యోగమును వదలి దీనికి నియంతగానుండి యుచితముగా బనిచేయుచున్నారు. బ్రహ్మశ్రీ పురఘళ్ళ సూర్యనారాయణశాస్త్రిగారు విద్యాలయమునకు చందాలు పోగుచేయు విషయమున ధర్మాగ్రముగ రాత్రింబగళ్ళు మిగుల గష్టించి పనిజేయుచున్నారు.

---

## అమరగానము.

మధురసంధ్యల వీధిగుమ్మములనిలచి
అలతిసిగ్గుల వాడిచూపులను మెలపి,
మొలకనవ్వుల విశ్వమ్ముఁ గలతవెట్టు
పదిపదాఱేండ్ల వయసు పైఁబడని పడుచు
పిల్లలు, తమంతఁదాముగా వల్లకొనగ
సంస్కృతములైన సిదువాలుఁ జడల ముడువ
మొగ్గవిడిచిన పరిమళ్లెపూవు టమ్మ
లనుదొడిగి దివ్యసుమకోమలమ్ము లయిన
యువకుల హృదంతరమ్ముల నవయ నేయు
మన్మథునివింటిసడి వినంబడు వసంత
చంద్రికాసాంద్ర యమునాపరిశాంతసలిల
మృదుల భావగీతమ్ముల మేళవించి
ప్రకృతి సర్వమ్ము తన్మయత్వమ్ము నొంద
మురళి మ్రోయింపఁగలిగిన ముద్దుకృష్ణు
నమరగానమ్ము లీలాశుకాదు లట్టి
ఎందఱి కవీశ్వరులనో సృజింపఁగలరు.

—కొడాలి ఆంజనేయులు.

# గ్రంథాలయోద్యమము.

అనంతపురముజిల్లా కదిరితాలూకా నాగిరెడ్డిపల్లెగ్రామమున శ్రీశారదాపుస్తకభాండాగారసమారంభోత్సవదినము (1923 వ సంవత్సరము ఫిబ్రవరి నె॥ 13 వ తేదీ మంగళవారము)న, సభాధిపత్యము వహించియున్న శ్రీరంజితులు సాహిత్యసరస్వతి సీరిపి ఆంజనేయులవారిచే నియ్యబడిన ప్రారంభోపన్యాసము:—

సీ॥ ఆచారమునకు దా ♦ స్యము సేయుచు నంట
 యిల్లు దాటఁగలేని ♦ యిందుముఖుల,
ఉదయాస్తమయములు ♦ నొంపలి చెమ్మటఁ దీసి
 క్షేత్రసేవలు సేయు ♦ సేద్యగాండ్ర,
బ్రతికినన్నాళ్లు తీ ♦ అరికస్సి, కూకట్లు
 విడిచి జీవించెడు ♦ పేదజనుల,
అక్షరపంక్తులై ♦ యరయరానను చు, దు
 గ్ధములఁ ద్రాసిన చెప్ప ♦ రానివాండ్ర
తే॥గీ॥ పూలతోఁ నిండి కమ్మదనాలు చిమ్ము
 పుస్తక నికుంజ పుంజాళి ♦ పొంతఁ బిలిచి
 'నాజనము, నాదిదేశ' మ ♦ నంగఁ జాలు
 ఇంత జ్ఞానభిక్షాదాన ♦ మిమ్ము తల్లి!
 —గ్రంథాలయ సర్వస్వము.

### "క్రొత్త యొకవింత."

ప్రియభ్రాతృవరులారా! నేను మీకుఁ గ్రొత్తవాఁడనేయైన, నొక్కమాఱుగ నిందఱిమహాజనుల పరిచయభాగ్యము నాకుఁ గలిగించిన నాధర్మభ్రాతలగు మ॥ రా॥ రా॥ శ్రీ॥ మాచిరెడ్డి వేంకటస్వామిరెడ్డిగారికిని—అట్టియవకాశ మొసఁగిన మీకును— నానమస్కారములు. ఈపవిత్రస్థానముఁబొంద నర్హులగుమహనీయులు వేఱు. ఇందులకు నేనెంతమాత్రము దగను. అట్టిశక్తియు బ్రపంచజ్ఞానమును ననుభవమును నాకు లేదు; కాని యుదారవంతమైన మీవాత్సల్యభావమే నన్నిచ్చట నిల్పినది. అట్టి మీదయార్ద్రహృదయమునకుఁ గృతజ్ఞుఁడను. నేను నేఁటిధర్మమును జక్కఁగ నిర్వహింపఁజాలనేమో, అయినను, అనురాగపూర్వకముగ నన్ను క్షమించుఁడు. నేనిపుడు విన్నవింపఁగూడు విషయము మీకుఁ జాలఁ బ్రాఁతవి; కాని మనలోఁ 'గ్రొత్త యొకవింత'యను సామెత గలదు. నేను గ్రొత్తవాఁడనగుకారణముచేనైన నీయంశములు మీకుఁ గ్రొత్తలుగఁ దోఁచెడునుగాక!

### ఉద్యమ తత్త్వము.

ప్రపంచమునఁగల యేదేశపు టౌన్నత్యమైన నాదేశజనుల యనుభవమును— జ్ఞానమును— విద్యయు—గ్రంథభాండారమును— నాగరికత— బట్టియుండును. ఏలయన ననుభవములేక జ్ఞానమును, జ్ఞానములేక విద్యయు, విద్యలేక గ్రంథసామగ్రియు, గ్రంథసామగ్రిలేక నాగరికతయు, నాగరికతలేక వృద్ధియు, దేనికిని నొండుఁగూడి యుండలేదు; గనుక దేశాభ్యుదయమునకు మానవసంఘాభివృద్ధి మూలము. ఆసంఘాభివృద్ధికి జ్ఞాన మాధారము. ఆజ్ఞానాతిశయమున విద్యయు— గ్రంథజాలమును జెందును; కావున గ్రంథములన నేమియని మనము విచారించునపుడు, మానవుఁడు తన్నెదురుకొన్న శ్రమలను— తన్నివృత్తికై సల్పిన ప్రబలప్రయత్నములను— తన్మూలమునఁ బొందిన ఫలములను— వానిచేఁ దనకుఁగల్గిన సంపూర్ణలోకానుభవమును— తనజనుల హితాభివృద్ధికై వ్రాసియుంచిన జ్ఞానకోశములని వ్యక్తమగుచున్నది. ఆదియుగమునుండియుఁ బుట్టి గిట్టిన మానవజాతిచిత్తవృత్తులను— వానిపరిణామదశలను— ఫలాఫలములను నిరూపించి, జాతీయజీవనచారిత్రమును దెల్పుచు, ప్రపంచోన్నతి కుచితమార్గమునఁ దోడకునవి గ్రంథములు. అనఁగా లోకమునఁగల యనాగరికత నడఁచి తమవినిర్మల విజ్ఞాన చంద్రికలచే నందలి కలుషాంధకారము నెగురఁజిమ్మి, దానినుద్ధరించునవి గ్రంథములు. అట్టిపవిత్ర గ్రంథముల యునికికై యేర్పాటుసఁబడిన యాలయములు గ్రంథాలయములు. వానిపెంపునకై సల్పఁబడు నుద్యమమే గ్రంథాలయోద్యమము. ఈయుద్యమచారిత్రముఁ గొంతవఱకైన సాంగోపాంగముగ నెఱుంగవలయునన్న. మన యొక్కమాఱు

### ప్రపంచ చరిత్ర

నారయుటయో, లేక యట్టిచారిత్రమున కనువగు నంశములను గ్రహించుటయో, యావశ్యకము. గ్రంథాలయోద్యమచరిత్రయనఁగా బ్రపంచవిద్యాచరిత్రయనిగాని నాగరికతాచరిత్రయనిగాని చెప్పవలసియుండును. ఎచ్చట నీయుద్యమము క్షీణదశనుండునో యచ్చట విద్యయు నాగరికతయు నైష్ఫల్యము నందియుండుట సహజము; కనుక నేదేశగ్రంథాలయోద్యమమును గూర్చి నుడువవలసియున్నను దానియుపాంగములగు జ్ఞానాదికములను గురించి చెప్పవలెనియుండుట యావశ్యకము; ఒకవేళ నాయాసందర్భముల నది యప్రస్తుతమని తోఁచునెడల విజ్ఞులు మన్నింతురుగాక!

మానవుఁడననేమి? ఇతరజంతువులకు నాతనికిఁ గల యంతరువెట్టిది? అతని ధర్మమెద్ది? అను విచారము లేశమును లేక, యుదరపోషణమే పరమావధిగాఁ గల్గి, యందులకుఁదగిన యుపాయమెఱుంగమిఁ, బట్టున నొక్కచోట బదిదినములైన నుండక, తిండికై భార్యాపుత్త్రులతో—వస్తువాహనములతో—దిమ్మెక యూరుగాఁ దిరుగుచు, దొమ్మరి—ఎఱుక—జాతులవలె నికృష్టజీవనమును బొందియుండుట, యనాగరకతయగును. జగమున నిప్పు డసమానశేముషీసంపదలచే నొప్పి, మహత్తరవైభవముల ననుభవించుచుండెడి యాంగ్లభూమి, యిప్పటికి రెండువేల సంవత్సరములక్రిందటివఱకు నిట్టిస్థితినే యనుభవించియుండెను. వ్రాయుట—చదువుట—యెట్టిదో నాఁడాదేశజనులకుఁ దెలిసియుండలేదు. వారిలో ననేకులు పశుపక్ష్యాదులఁ జిక్కినవానినెల్లఁ జంపి, వాని మాంసముఁదిని జీవించుచుండిరి. గుడ్డలు నేసికొనుటగాని వేసికొనుటగాని వారికిఁ దెలిసియుండలేదు. గడ్డపువెండ్రుకలను శిరోజములను బెంచుకొని, దేహమంతయు నీలిరంగుపూసికొని, మొలకుఁ జర్మములను జుట్టుకొని, శాంతియనునదిలేక—యడవిమెకములకంటె వికారముగఁ—జాల భయంకరముగ—నుండిరి. ఆసందర్భమున యూరపునందుఁ బ్రసిద్ధినొందిన దేశములును గొన్నియుండెను. అందొకటి,

## గ్రీసు.

రామాయణ మహాభారతములకు సమానములగు కావ్యములను వ్రాసి, లోకవిఖ్యాతిఁగాంచిన 'హోమరు' గ్రీసున కాదికవి. ఈతఁ డిప్పటికి రెండువేల నాలుగువందల యేండ్ల క్రిందటివాఁడు. ఆకాలముననే యాదేశమున నవవిధకళలు ప్రబలియుండెను. ఒక్కొక్కకళకొక్కొక యధిదేవతవంతున నవవిధకళాధిదేవతలు గలరనినమ్మి, గ్రీకులు వాని నారాధించుచుండిరి. నాఁడు శిల్పులు—గణితశాస్త్రజ్ఞులు—న్యాయశాస్త్రవేత్తలు—చిత్రకారులు—చరిత్రకారులు—కవులు—తత్త్వజ్ఞానులు హెచ్చి, ఆయావిషయములపై వివిధములుగ—విరివిగ—గ్రంథములు వ్రాసియుంచిరి. ఆసందర్భముననే, మిగులఁ బ్రసిద్ధిఁగాంచిన రెండుగ్రంథాలయములా దేశమున వెలసెను. అందు మొదటిది 'ఏథన్స్' పట్టణమునందలి మహాగ్రంథాలయము. దీనిలో రెండులక్షల గ్రంథములుండెనఁట! నేఁటివలెఁ గాగితములు—కలములు—మున్నగు వ్రాఁతసాధనములు నాఁటికాలమున నుండలేదు. ఆదినములలో గ్రంథము లన్నియు నొకవిధమైన చెట్టుబెరడుపైనను—ఆకులపైనను—మేఁకచర్మములమీఁదను—వ్రాయఁబడుచుండెను. ఇట్లుండియు లక్షలకొలఁది గ్రంథములను సమకూర్పఁగలుగుటఁ దలఁప, నాఁటిగ్రీకుల భాషాభినివేశము బోధపడఁగలదు. ఆకులపై వ్రాయుపద్ధతినిఁ గనుఁగొన్నవారు గ్రీకులే. గ్రీసునకుముందు గ్రంథాలయబీజమును నాటినది 'అస్సీరియా.' ఆదేశజనుల లేఖనక్రమము చిత్రరీతినుండెను. వారు పత్త్రములపై వ్రాయుట నెఱిఁగియుండలేదు. నాఁటిజను లొకవిధమైన మంటిపలకలపైఁ దమ భావములను శిలీముఖాకృతిఁగల యక్షరమాలికారూపమున వ్రాసి, యాపలకలను జక్కఁగా నావములోఁ గాల్చి, యొకయాలయమునఁ బదిలపఱచుచుండిరి. గ్రీకుల వాఙ్మయాభివృద్ధియు—నాగరికతయు—నాదేశమునఁ బ్రజాప్రభుత్వము నెలకొనియున్నంతకాలము, ప్రథమయుగమున (క్రీస్తుశకమునకుఁ బూర్వము రెండువందల యేండ్లవఱకు) నవిచ్ఛిన్నముగ సాగెను. పిమ్మట రోమనులు గ్రీసుపైఁబడి దానిని స్వవశముగావించుకొన్న యనంతర మందులకుఁ గృశత్వము ప్రాప్తించెను. గ్రీసుదేశ మభివృద్ధియందున్న సమయముననే, ఆఫ్రికాయందలి,

## ఈజిప్టు

కూడ నుత్తమదశఁ బొందియుండెను. అందలి జనులకు గ్రీకులధర్మములే సామాన్యధర్మములై యుండెను. వీరు గ్రీకులనాగరికత ననుకరించియుండిరి. నాఁటికి గ్రీసునందువలె నచ్చటను గ్రంథాలయప్రయత్నము వ్యాప్తిలోనుండెను. అందుఁగల యొక "యలెగ్జాండ్రియా" నగరమందే, యేడులక్షల పుస్తకముల మహోత్తమగ్రంథాలయ మొకటి యుండెనఁట! ఈజిప్టుదేశమును జయించి వశపఱచుకొనుటకును—అందు మహమ్మదీయమతమును నిరాటంకముగా వ్యాపింపఁజేయుటకును—నిశ్చయించుకొనిన మహమ్మదుపీఠాధిపతియగు "ఓమర్" అనుపేరుగల ఖలీఫా, క్రీస్తునకుఁ దరువాత నెనిమిదవ శతాబ్దమున నీజిప్టుపై దండెత్తిపోయి, దానిని జయించెను. తదుపరి, ఆదేశమునంగల యలెగ్జాండ్రియాలోని మహాగ్రంథాలయము నతఁడు చూచెననియు, నందీక్రింది చిత్రచారిత్రము నడపెననియుఁ, జరిత్రములు నుడువుచున్నవి.

ఖలీఫా గ్రంథాలయమునఁ బ్రవేశించి యందలియధికారితో "ఇందేమిగ్రంథము లున్నవి?" అనియడిగెను. "నక్షత్రశాస్త్రములు—వైద్యశాస్త్రములు—వేదములు—గణితములు—తర్కములు—శాసనగ్రంథములు—మున్నగునవియున్న"వని యధికారి నుడివెను. ఖలీఫా యదివిని "ఇవియన్నియు ఖొరానులోఁ జెప్పిన సంగతులా లేక

"యందులకుఁ బ్రతికూలములా?" అని మరలఁ బ్రశ్నించెను. గ్రంథాలయాధికారి కేమి చెప్పుటకును దోఁపలేదు. అతఁడు మిన్నకుండెను. ఖలీఫా యతని గ్రంథాలయాధికారితో "కొరానువంటి వేదము జగమున లేదు. కనుక నన్నిగ్రంథములలోను కొరానులోని విషయములే యుండవలెను. ఈ గ్రంథములలో కొరానులోని విషయములే యున్నచో నందులకు కొరానే యున్నది; కనుక నివి పనికిరావు. కొరానులో లేనివిషయ మేదియైన నున్న నది యసత్యము. అట్టిగ్రంథము లోకమున నుండఁగూడదు. ఏవిధమునఁ జూచిన నీగ్రంథము లుంచవలసినయవసరము మాకుఁ గాన్పింపదు." అనుచు నాతఁడు తన యనుచరులతో నమ్మహాగ్రంథనిలయమును దగులఁబెట్టించెను. అది మూఁడుదినములు లోకేతీరున కుమిలి—కాలి—కూలిపోయెను. అంతటి యుత్కృష్టజ్ఞానధనమొక్కమాఱు మంటఁగలియుటచే ఈజిప్టు తనకుఁదానే దహించుకొనినట్లు తపించెను.

## రోమము.

శాస్త్రజ్ఞులు—చరిత్రకారులు—కవీశ్వరులు—ఉపన్యాసకర్తలు నీదేశమునఁగూడఁ జిరకాలమునుండి యుండిరి. "లివీ" యనునతఁడు సుప్రసిద్ధుఁడగు రోము చరిత్రకారుఁడు. "సిసరో" అనునతఁడు ప్రముఖుఁడగు వక్త. "వర్జిల్" అనునతఁడు ల్యాటిన్‌నందు మహాకవీశ్వరుఁడు. నాఁటికాలమున రోమనులు ల్యాటిన్—గ్రీక్ భాషల సమాదరభావమున నభ్యసించిరి. వారు దేహబలమున గ్రీకులకు పూఁదుచేయుగ నుండినను నాగరికతలోఁ గ్రిందువారే. రోమనులు గ్రీసును స్వాధీనము చేసికొనిన వెనుక, పగవారగు గ్రీకులే తమ నాగరికతను—ఆచారధర్మములను—మతసిద్ధాంతములను—రోమనులకు నేర్పిరి. "యుద్ధమున రోమనులు గ్రీకులను జయించినను నాగరికతలో గ్రీకులే రోమనులను జయించిరి" అను సామెత పైవిషయమునకుఁ దార్కాణము. "గ్రీకుల నాగరికతాభివృద్ధికి వారిజ్ఞానము హేతువు, ఆజ్ఞానమునకు విద్య కారణము. ఆ విద్యకు గ్రంథము లాధారములు. జనపదమునకు గ్రంథకోశ మత్యవసరము." అని గ్రహించిన రోమనులు ముఖ్యముగ రోము నగరమున నొక మహాగ్రంథభాండాగారమును బ్రయత్నపూర్వకముగ స్థాపించిరి; మఱియు కాన్‌స్టాంటునోపిలుపట్టణమున ప్రఖ్యాత మొక యుత్తమ గ్రంథాలయము సంస్థాపితమయ్యెను. ఈ గ్రంథభాండాగారమున గ్రీకులు వ్రాసిన పుస్తకములే యమితముగనుండెను. తొలుదొల్త నీ దేశమున నగరగ్రంథాలయము లారంభము కాంచెను. దేశమునంగల ప్రముఖులు తమతమ మందిరములయందు వానిని నెలకొల్పిరి. ఈ నగరగ్రంథాలయ సంస్థాపనమే పౌరగ్రంథ-యాంకూరమున కాదర్శమయ్యెను. ఈజిప్టుదేశమును జయించినకొనుక నెనిమిదివందల యేండ్లకుఁ దురుష్కులు కాన్‌స్టాంటినోపిలుపట్టణమును గూడ ముట్టడించి, ప్రయత్నము ఫలకారికానందున నడుమ నడుమ మరలిపోవుచున్నను, ఎడనెడఁ బనిచేసి పదేండ్ల కాలమునకు క్రీ. శ. 1453వ సంవత్సరమున దాని నాక్రమించుకొనిరి. ఆలోపల నగరమునన్న శాస్త్రవేత్తలు—పండితులు—కవులు—మున్నగువారు పట్టణమునందలి యమూల్య గ్రంథరాజముల నెల్లఁ దీసికొని, యూరపునందలి, ప్రధానపట్టణములకు బరువెత్తిరి. పౌరులును దమకుదొరకిన గ్రంథముల నెత్తుకొని దగ్గఱనున్న క్రైస్తవపురములకుఁ బారిపోయిరి. క్రైస్తవ పట్టణముగనుండిన కాన్‌స్టాంటునోపిలు కొంతకాలమునకే మహమ్మదీయపురముగ మాఱిపోయెను. ప్రార్థనాలయములు మసీదు లయ్యెను. ఆ మతగ్రంథములు చాలవఱకు నశించెను. నగరమునకుఁ దురుష్కులు "స్ట్యాంబోల్" అను పేరు పెట్టిరి. "స్ట్యాంబోల్" అనఁగా మహమ్మదీయమతమును విశ్వసించినవారి పట్టణమని యర్థము.

## ఇంగ్లండు.

ఇది క్రీస్తునకుఁ బూర్వము మిక్కిలి యనాగరికదశలో నుండెనని వెనుకఁ దెల్పియుంటిమి. ఆస్థితినుండి చిరకాలమునకుఁగాని యది మాఱలేదు. క్రీస్తుశకమునకుఁ బిమ్మట నాదేశము నేలిన ప్రభువు లొక్కొక్కరు కొంతకొంతగా దీని సంస్కరించుచు వచ్చిరి. ఇంగ్లండు విద్యాభివృద్ధియు నాగరికతాభివృద్ధియు వేయిసంవత్సరముల క్రిందనేగాని యటుపూర్వము లేదు. క్రీ. శ. 871వ సంవత్సరమున, ఆంగ్లభూమికి మూఁడవరాజుగా వచ్చిన 'ఆల్‌ఫ్రెడ్' అనునతఁడే, యచ్చట విద్య కంకురార్పణముఁ గావించిన మహనీయుఁడు. ఆరాజు దేశాంతరమునుండి పండితులనురప్పించి—తననగరమున నుంచుకొని—గొప్పవారిసంతతికెల్ల విద్య నేర్పింపఁ బ్రారంభించెను. పాఠశాలలలో బాలుర పఠనమునకుఁ గావలసిన గ్రంథములను, ల్యాటిన్‌నుండి స్వభాషకు మార్చెను. పండితుల నెక్కండ్ర నాదరించెను. క్రమక్రమముగాఁ బాఠశాలల సంఖ్య హెచ్చించెను. విద్యనభివృద్ధిదశకుఁ దెచ్చెను. క్రీ. శ. 1450-60 సంవత్సరముల మధ్య 'విల్లియముకాక్స్‌టన్' అనునతఁడు ముద్రాయంత్ర నిర్మాణపద్ధతినిఁ గనిపెట్టెను. అది మొదలు రాష్ట్రమున ముద్రాక్షరశాలలు హెచ్చెను. గ్రంథప్రచురణమున కెక్కుడు సౌలభ్య మేర్పడెను. ఈ కారణమున సర్వసాధారణముగ నందఱకుఁ

ప్రోత్సాహమొసంగియుండెను. పిమ్మట 'ట్యూడర్' వంశము నందుదయించిన 'ఎలిజబెత్' రాణి క్రీ. శ. 1600 వ సంవత్సరమున రాజ్యమునకు వచ్చిన తరువాత, విద్య చాల వృద్ధినొందెను. ఆ కాలముననే సుప్రసిద్ధ నాటకకర్త యగు 'షేక్స్పియరు'—రాజ్యతంత్రప్రవీణుడును తత్త్వవిజ్ఞానియు నగు 'బేకను'—మున్నగు పండితమండలి కాంగ్లభూమి నిలయమాయెను. నాడు విద్య యనంతముగ హెచ్చెను. సర్వకళాశాలలు స్థాపింపబడెను. ఆ కాలమున పెక్కు గ్రంథములు విరచింపబడెను. అప్పుడే గ్రంథాలయోద్యమమునకు మార్గమేర్పడెను. తదనంతర మిగ్లండు సర్వవిషయములం దగ్రమోన్నతినందె లోకచరిత్రమున జాలవిఖ్యాతిం గాంచెను. ఇప్పుడా దేశమున గ్రంథభాండాగారముల సంఖ్య మిక్కిలి హెచ్చియున్నది. ఈయుద్యమమున నిది ప్రపంచమున సర్వోన్నతస్థానము వహించి యున్నది. ఇందలి ముఖ్యపట్టణమగు లండను నగరమున క్రీ. శ. 1773 వ యేట స్థాపింపబడిన బ్రిటిషు మ్యూజియము గ్రంథాలయమున [illegible] గ్రంథములున్నవి. లోకమున నింతటిది మరిలేదు. 'ఆక్స్ఫర్డు' పట్టణమందలి 'బాడ్లియన్' గ్రంథాలయమును గొప్పదియే. దీని 'బాడ్లియన్' అను మహాశయుడు దానము చేసెను.

## అమెరికా.

ఈ దేశమున నీయుద్యమము క్రీ. శ. 1876 వ సంవత్సరమున నారంభించెను. అందు సంయుక్తరాష్ట్రములలో నీ ప్రయత్నము వ్యాపకముగనున్నది. అచ్చటి నగరముల యన్నింట మహాగ్రంథాలయములు గలవు. ఆగ్రంథాలయాధికారులు పట్టణములలో శాఖాస్థానముల నేర్పరచి గ్రంథాలయములను నాయాప్రాంతవాసులకు [illegible] సానుకూల్యము గావించుచున్నారు. చిత్రపటశోభితమైన పిల్లల కాకర్షకములుగ నుండు చరిత్రాదులను బెట్టెలలోనుంచి, బాలుర వినియోగమునకై యుపాధ్యాయులకిచ్చి పాఠశాలలకు బంపెదరు. యంత్రాలయములలో బనిచేయుకూలీలకు—వైద్యశాలలయందలి రోగులకు—వాసములలోని బిచ్చగాండ్రకు దగిన గ్రంథముల బని—ప్రేమాదరములన బంపెదరు. సంచారగ్రంథపేటికలు మోటారుబండ్లపై గొనిపోబడుచుండును. చిత్రములుగలవారికి లోకి బడుచున్నవి. ఆరాష్ట్రమునందలి గ్రంథాలయములన్నియు గొప్పగొప్ప పనులనుగూడ నిర్వహించుచున్నవి. ఈ యుద్యమమునకు దగిన ప్రోత్సాహ మిచ్చుట గలరు. సామాన్యముగ నేతపనివలన జీవించువాడగు "విల్లియము కార్నెజీ" కుమారుడగు "ఆండ్రూ కార్నెజీ" యనుపురుషుడు, స్వకాయకష్టమువలన సారించిన ద్రవ్యములో, కేవల మొకగ్రంథభాండాగారముల యభివృద్ధినిమిత్తమే, 18 కోట్లు 24 లక్షలురూపాయలు వ్యయముచేసెను. ఈతడు మొన్న మొన్నటిదాక, అనగా క్రీ. శ. 1913 వ సంవత్సరమువఱకు దనదేశవిద్యాభివృద్ధికొఱకై దానముచేసినది 30కోట్లు 52లక్షలు 50 వేలరూపాయలని తేలినది.

## ఆస్ట్రేలియా.

ఇందలిజనసంఖ్య 45లక్షలు. అప్రిజకు మొత్తమున 30లక్షలు 40వేల సంఖ్యగల గ్రంథసముదాయముతోగూడిన 15 వేల గ్రంథాలయములున్నవి. సరాసరి లెక్కచూచినచో, నొక్కొక మూడువందలజనులకు, రెండువందల గ్రంథసంఖ్యగల, యొక్కొక గ్రంథాలయమున్నట్లు తేలుచున్నది. ఈగ్రంథాలయములలో నాదేశసంబంధములగు నన్నివిధములైన గ్రంథములును గొలుతలేకయుండునట! పాఠకుల సౌకర్యార్థమీ భాండాగారములలో, జెక్కులు, తలుపులులేని బీరువాలయందు గ్రంథము లుంచియుందురట! పాఠకుడెవ్వడైన నితరుల సాహాయ్యములేకయే, తనకావశ్యకమైన గ్రంథమును దానే బీరువానుండి యేరి తీసికొని—చదివి—యాపై మరల దాని నాస్థానముననే యుంచి పోవచ్చును. యజమానులు పాఠకులయెడ విశ్వాసముతో, గ్రంథములనిట్టి యందుబాటులో బాహాటముగ నుంచినను, నష్టమైన పుస్తకములసంఖ్య యత్యల్పము. ఒకానొకసంవత్సరమున నొకగ్రంథాలయమునకు బదిరూపాయల విలువగల గ్రంథములు పోయినవట! ఈదేశమునంగల "సిడ్నే" నగరమున "మిల్చెల్" అను గ్రంథాలయమొకటి స్థాపింపబడినది. దానికి "డేవిడ్‌స్కాట్ మిచ్చెల్" అను మహాత్ముడు, క్రీ. శ. 1908వ సం॥మున విద్యార్థిజనుల యభివృద్ధి నుద్దేశించి, తనయొద్దనున్న 60 వేల గ్రంథములను—మూలధనమునకై 10లక్షలు 50 వేలు రూపాయలను—దానముచేసెను. ఇందలి గ్రంథాలయములలో క్రీ. శ. 1913వ సం॥రము "మెల్బోర్న్" పట్టణమున దెఱవబడిన "మెల్బోర్న్ ధర్మగ్రంథాలయము" గొప్పది. అందు వేర్వేఱు బీరువాలలో రమారమి 25లక్షల గ్రంథము లుంచుటకు జాలినంత స్థలమున్నదట! దానిమీది భాగమున నడుమ నలంకారమునకై యష్టకోణాకృతిగ జిన్నని గోపురమువలె నిర్మింపబడియుండు మందిరమున, బల్లలాసనములపై, మూడువందలమంది పాఠకులొక్కమాఱు కూర్చుండి చదువుకొనుటకు దగినవసతియున్నదట! ఈ భవననిర్మాణమునకు 12లక్షలరూ—

యలు వ్యయమగుచున్నవఁట! ఈ ముఖ్యగ్రంథాలయమునుండి యేఁటేఁట 10 వేల గ్రంథములు ప్రత్యేకస్థానములకు సంచారపేటికలమూలమునఁ దీసికొనిపోఁబడుచున్నవఁట! ప్రతిదిన మీ గ్రంథాలయమునకువచ్చి చదువు పాఠకుల సంఖ్య నైదువందలు.

## జర్మనీ.

గ్రంథాలయోద్యమవిషయమునఁ దామసించిన దేశములలో, పరాను జర్మను దేశములు చేరిన వనవచ్చును: ఇవి కొన్నియేండ్లనుండియే యీయుద్యమమున శ్రద్ధవహించియున్నను, మహత్తరములైన గ్రంథాలయములఁ గల్గి, వానియభివృద్ధికై యపారద్రవ్యము వినియోగించుచున్నవి. నూఱేండ్ల క్రిందట జర్మను ప్రభుత్వము వారు దేశమున గ్రంథాలయములను విరివిగస్థాపించి, వానిని దమ పాలనమున నుంచుకొనియున్నారు. ఇప్పుడచ్చటఁ బ్రతిగ్రామమునను గ్రంథాలయము లున్నట్లు తెలియుచున్నది. వానికగువ్యయములను పాలకులే భరింతురు. జర్మను దేశపు ముఖ్యపట్టణమగు బెర్లినునందుఁ బనిచేయుచుండు సార్వజనిక గ్రంథాలయ మన్నింటిలోను బ్రధానమైనది. క్రీ. శ. 1915వ సంవత్సరమున, నది యుద్ధరంగమునను వైద్యశాలలయందును నుండు జర్మను సైనికులు చదువుకొనటకై దినమునకు నాల్గువేల గ్రంథములవంతునఁ బెట్టెలలోఁ బంపుచుండును. ఈ పెట్టెలఁ గొనిపోవువారు ప్రయాణవ్యయములనైనఁ దీసికొనక దేశసేవార్థము గౌరవముగఁ బనిచేసిరి.

## భారత వర్షము.

౧ వేదయుగము:—మనయార్యావర్తక్షేత్ర ప్రాచీనచారిత్రము నారసినచో నిది బహుపురాతనకాలమునుండి వాఙ్మయమున నేమి— యాధ్యాత్మికవిద్యయందేమి— గ్రంథాలయప్రయత్నమున నేమి— యత్యున్నతస్థితిని బొంది, ప్రపంచమునకెల్ల గురుప్రాయముగ నుండియున్నట్లు వ్యక్తము కాఁగలదు. మన తొల్లింటి ఋషులు తమ ధీశక్తిచేఁ గనుఁగొన్న విజ్ఞానమును ఛందోబద్ధమగు భాషారూపమున నిల్పి, జిజ్ఞాసాపరులగు శిష్యకోటికిఁ దత్త్వోపదేశము చేయుచుండిరి. అనంతరము చిరకాలమునకు లిపి యేర్పడెను. లిపియేర్పడునందాఁక నా మహర్షుల జ్ఞానధనమంతయు శబ్దరూపముననే యుండినది. లిపి కుదిరిన పిమ్మటనే యది యక్షరాకృతినిఁ దాల్చి గ్రంథస్థమయ్యెను. మన వేదములు నుపనిషత్తులు నిట్లు కలిగినవే. క్రమముగా నాగరికత వృద్ధినొందెను. వస్త్రభూషణాద్యలంకారములఁ గల్పించుట—యుద్ధోపకరణముల సృష్టించుట —యాకాలజనులకుఁ దెలిసియుండెను. వాస్తుశాస్త్రపద్ధతి—క్రయ విక్రయ సరళి— నావికానిర్మాణవిధానము నప్పటివారు గ్రహించియుండిరి. వారోడలను నిర్మించి వానిపై సముద్రయానము చేసి, దేశాంతరములయందు వ్యాపారము సల్పుచుండిరి.

౨ సూత్రయుగము:— కల్పసూత్రములు, ధర్మసూత్రములు, రేఖాగణితము, పాణినిసూత్రములు, నక్షత్రాధ్యాయము, దశాంశగణితము, జ్యోతిశ్శాస్త్రము, నిప్పటికి మూడువేలసంవత్సరముల క్రిందటినాఁడు మేధాసంపన్నులగు మన ప్రాచీనులు వ్రాసిరి. నాఁటి రాజులు విశేష వ్యయప్రయాసముల కోర్చి, యాగ్రంథములనెక్కటొక్కటిగ సేకరించి, ప్రతులువ్రాయించి, రాజమందిరములయందును, దేవసదనములయందును, [illegible]లయములయందును నిలిపి, జనులకు జ్ఞానాభివృద్ధిని గల్పించఁజొచ్చిరి. మనదేశమున గ్రంథాలయముల పుట్టుక కిదియే మొదలు. నేటికి మూడువేలయేండ్ల క్రిందట నె భారతదేశమున గ్రంథాలయోద్యమ మార్యులచే బ్రారంభము నొందినది. వారు స్వాతంత్ర్యభుక్తులై యుండినంతవఱకు [illegible] నీ ప్రయత్నము మహోన్నతదశ నందెను.

౩ బౌద్ధయుగము:—గ్రంథాలయస్థాపనకీ యుగ మతోడ్పాటుగ నుండలేదు. ఈయుగమున జైనుల ప్రాబల్యము హెచ్చెను. అన్యమతగ్రంథములయెడ— వైదికధర్మసిద్ధాంతములపట్లను— [illegible] వారికెంతయు సానుభూతియుండలేదు; కనుక మొదట మొదట గ్రంథాలయములవిషయమున స్వమతాభిమానమునకు గల్గినను, పిమ్మటఁ గొంతకాలమునకెల్ల గ్రంథముల నాదరింప దొరకొనిరి.

౪ పౌరాణికయుగము:— [illegible] భూమి మిక్కిలి యనాగరిక స్థితి ననుభవించుచున్న సమయమున, మన భారతదేశము [illegible] విక్రమాదిత్యుని పాలనమున నుండెను. విక్రమాదిత్యుఁడనట యుప్పటిప్రభుని నిజమైనపేరు గాదు. అది [illegible] సూచకమగు బిరుదము. విక్రమాదిత్యుఁడన [illegible] వంటి పరాక్రమశాలియని యర్థము. ఈతని యాస్థానమున మహాకవులు—విద్వాంసులు—నుండిరి. రాజధానీనగరమగు నుజ్జయిని [illegible]—[illegible] నిలయమై—గీర్వాణభాషాసంస్కృతి [illegible]—మిక్కిలి యొప్పియుండెను. ఉజ్జయినియం దప్పుడొక [illegible] విద్యాపీఠముండెను. ఈవిక్రమార్కుని సమయముననే ఉజ్జయినీపట్టణమున [illegible]

యుండినది. హర్షవర్ధనుని కాలమువఱకు నీయుద్యమ మొకేవిధముగ సాగుచుండెను. హర్షవర్ధనుని కాలమునఁ బురాణరచన యారంభము నొందెను. ప్రధానముగఁ గొన్ని పురాణములు — పారాశరాదిస్మృతులు — బృహత్సంహిత, పంచసిద్ధాంత్యాది శాస్త్రములు — పద్యగద్యాత్మిక కావ్యములు — నాటకాదులు — నీయుగమునచే యుద్భవములైనవి. వాఙ్మయాభివృద్ధియు గ్రంథాలయాభివృద్ధియు నీపౌరాణికయుగమున మఱింత హెచ్చెను. నాఁటికిఁ గాశ్మీరము — నేపాళము — తంజాపూరు — మున్నగుపట్టణములయందెల్ల గొప్ప గొప్పగ్రంథాలయము లుండినవి.

౫ మహమ్మదీయయుగము:— మహమ్మదీయప్రభువులు భారతప్రపంచమునఁ బాదముంచిరి. ఆర్యరాజమండలితో నాశారదరాత్రి తేఁగెను. విమలవిజ్ఞానచంద్రప్రకాశమునకు భంగమేర్పడెను. అజ్ఞానాంధతమోమయకృష్ణపక్షమి యార్యావనిని నాక్రమించెను. కాలుమేఘము లన్నియెడలఁ గ్రమ్ముకొనెను. దేశమంతట నొక్కుమ్మడి గాఢతిమిరసందోహము సమాకీర్ణమయ్యెను. అభాగ్యదేవతాస్వరూప పిశాచతండము లెల్లకడలఁ జెలరేఁగి నిర్భయముగఁ దిరుగాడుచు, నార్యసంతతిని యథేష్టముగఁ బీడింప దొరకొనెను. వారి మతాచార వ్యవహారములకు విచ్ఛిత్తి గల్గెను. శిల్పములకు — భాషకు — విలక్షణ మొదవెను. అశాంతి ప్రబలెను. ఆర్యలోకమున నాందోళన మతిశయించెను. మన మతగ్రంథరాజము లెన్నియో భస్మీకృతము నందెను.

౬ బ్రిటిష్‌యుగము:— ఆసందర్భముననే యాంగ్లప్రభుత్వ మారంభమయ్యెను. దేశ సంక్షోభము చాలవఱకు నడిఁగెను. భారతీయుల ప్రాణవిత్తరక్షణమునకు మార్గమేర్పడెను. వారిమతధర్మ ప్రవృత్తికి స్వేచ్ఛ యొదవెను. ప్రజల హృదయతాపము చల్లాఱెను; కాని వాఙ్మయవిజ్ఞానోన్నతి కాధారమై — గ్రంథాలయాభ్యుదయాభివృద్ధికిఁ దావలమైనదారి సంకుచితమయ్యెను. కారణము మనగీర్వాణభాషా గ్రంథరత్నములు క్రమక్రమముగ స్థానభ్రంశము నొందుటయే. ఇందులకు 'సర్ విలియమ్ జోన్సు' అను నాంగ్లపండితుఁడు కాళిదాసకవికృతమగు నభిజ్ఞాన శాకుంతలము నాంగ్లములోనికి మార్చుటయే ప్రధానహేతువు. ఈయనువాదగ్రంథము యూరపుప్రజ నద్భుతప్రమోదములకు లోనుగావించి, భారతదేశమునను రసమయములగు కావ్యము లనంతములుగ నున్నవను తలఁపు వారికిఁ గలిగించి, యందలి మహాపండి[illegible] యమువంక

మరల్చినది. అదికారణముగ నాంగ్లపండితు లనేకు లీయార్యభాష నభ్యసించి, గీర్వాణకృతులలోని భాషాసౌష్ఠవమును — స్వారస్యసంపదను — విషయగాంభీర్యమును — గుర్తెఱిఁగిరి. ఇందువలన మనదేశమునందలి ప్రాచీన తాళపత్రగ్రంథములు వేలకొలఁది విదేశములకు వెడలిపోవుటయే మనకుఁగల్గిన ప్రథమప్రయోజనము. పాశ్చాత్య దేశములలోని లండన్ — బెర్లిన్ — వియన్నా — సెంట్‌పీటర్సుబర్గు — మున్నగు నగరములలోని గ్రంథాలయములయందలి బీరువాలు ప్రాచ్యదేశ పురాతన గ్రంథరత్నముల శతాధికముగ నలంకరించుకొని యున్నవఁట! మోక్షమూలరుగారు ఋగ్వేదమును ముద్రించి ప్రకటించుచుండ దానిఁ గాంచుభాగ్యమే మనకు లేకుండెననియు — నాల్గవవేదము దేశమున నెచ్చటను లభింపనందున స్వామి దయానంద సరస్వతులవారు దానిప్రతిని జర్మనీ నుండి తెప్పింపవలసి వచ్చెననియు నీవల పండితులొకరిద్దఱు తమ యుపన్యాసములలో సూచించియుండిరి. హర్షవర్ధనునిపాలనమున క్రీ. శ. 630—40 సంవత్సరములమధ్యమున దేశమునకు వచ్చి పదియేండ్ల కాల మిచ్చట నుండిన 'హ్యూయెన్ స్యాంగ్' అను చీనాబాటసారి, యిచ్చటి 'నాలందా' విద్యాపీఠమునఁ బ్రాకృతభాష నభ్యసించి, దేశమంతయుఁ జుట్టి యందలి యాఱువందల గ్రంథములను తనదేశమునకుఁ గొనిపోయెను. లిఖితప్రతు లన్నియు నెల్లకడలఁ జెదరిపోవుటచే ననేకామూల్య గ్రంథములు మాయమైపోవుచున్నవి. ఇట్లుండ తంజాపూరియందలి యుత్తమగ్రంథ భాండాగారమున నిప్పటికిని బదునెనిమిదివేల ప్రతులు నిలిచియున్నవఁట! ఈగ్రంథనిలయ మాంధ్రరాజులచే 16వ శతాబ్దమున నెలకొల్పఁబడినది. ఈ పుస్తక భాండారమునుగూడఁ గొని స్వదేశమునకుఁ దీసికొనిపోవఁ బూనిన జర్మనుల ప్రయత్నము యూరపు మహాసంగ్రామ కారణమున నాఁగిపోయెనఁట! మనదేశముననే పురాతన తాళపత్రగ్రంథములెన్నియో జీర్ణమయిపోయినవి. కొన్నియింకను గొందఱివలనఁ బ్రాణధనమట్లు సంరక్షింపఁబడుచున్నవి. ఈగ్రంథాలయోద్యమవిషయమున మనదేశమున,

### బరోడా

చాల వన్నెకెక్కినది. అచ్చటిప్రభువగు "శ్రీశాయాజీరావుగాయక్వార్" గారీయుద్యమమును క్రీ. శ. 1910 లోఁ బ్రారంభించి భాగలవర్షగ్రంథాలయ ప్రయత్నమునకు మార్గదర్శులైరి. వారు బరోడాయందలి ప్రధాననగరములలోను — పట్టణములలోను — గ్రామములలోను — కుగ్రామములలోను — గూడ, వందలకొలఁది గ్రంథాల

యములను స్థాపించియున్నారు. అందలి కేంద్రగ్రంథాలయమున నిరువదివేల గ్రంథములున్నట్లు తెలియుచున్నది. అమెరికా సంయుక్తరాష్ట్రములయందలి నగరగ్రంథాలయములవలె నివియు మహత్తరకార్యములను నిర్వహించి పరిశ్రమించుచున్నవి. ఈ గ్రంథాలయములకుఁ బ్రభుత్వమువారు ఏఁటేఁట నేఁబదివేలరూపాయల ద్రవ్యసాహాయ్యమొనర్చుచున్నారు. బరోడాకుఁ దరువాత వంగదేశమునందలి

## కలకత్తా

పేరొక్కనఁదగినది. అందుఁ బ్రధానములైన గ్రంథాలయములు మూఁడున్నవి. రాష్ట్రీయపుస్తకభాండాగారమిందు గొప్పది. ఇది ప్రభుత్వమువారిచే నడుపఁబడుచున్నది. ప్రజలచే స్థాపింపఁబడిన తక్కిన రెండింటిలో చైతన్యగ్రంథాలయము మొదటిది. ఇది ముప్పదిసంవత్సరముల క్రిందట నెలకొల్పఁబడినది. దీనికిఁ బ్రారంభమున నూఱు పుస్తకములు—మూఁడు వార్తాపత్రికలు—నైదుగురు చందాదారులు—ఐదురూపాయల మూలధనము—నుండెను. ఇప్పుడుపదివేలగ్రంథములు—150 పత్రికలు—అయిదువందలమంది చందాదారులు—రమారమి 15 వేల రూపాయలమూలధనము—గలిగియున్నది. రెండవది రామమోహనరాయిపుస్తకభాండాగార మెనిమిదివేల గ్రంథములచే నొప్పుచున్నది.

## ఆంధ్రదేశము.

ఇది 11 మండలములను, 31 వేల గ్రామములను గల్గి ఒక కోటి డెబ్బదిలక్షల జనసంఖ్యచే వెలయుచున్నది; కాని యీ సంఖ్యలో నొకకోటి 60 లక్షలకుఁ బైఁబడిన జనులు చదువెఱుఁగనివారు. మనలో నూటికైదుగురు మాత్రమే వ్రాయుటకును జదువుటకును నేర్చినవారు. గ్రంథాలయోద్యమ మీరాష్ట్రమున క్రీ. శ. 1914వ సం॥ ర మారంభమయ్యెను. ఆ యేఁట రాష్ట్రమునకెల్ల 163 గ్రంథాలయములే యుండెను. ఉద్యమానంతర మీ సంఖ్య సక్రమముగ హెచ్చినది. అయిన నది యంతతృప్తికర మనరాదు. జనసంఖ్యవిషయముగ నాస్ట్రేలియానుబట్టి చూచినచో మనదేశమునకు 56 వేల గ్రంథాలయము లుండవలసియుండెను. కాని క్రీ. శ. 1919 వ సంవత్సరమున కీ పదునొకండు మండలములలోను 560 పుస్తకభాండాగారములు మాత్రమే యుండినట్లు తేలెను. ఈ సంఖ్యలో కృష్ణ—గుంటూరు—గోదావరిమండలముల మూఁడింటిలో 4 వందలకు మైఁబడియున్నవి. అందొక గుంటూరు మండలమే 160 గ్రంథాలయములఁ గల్గియున్నది. ఈ పుస్తకాగారములలో రాజమహేంద్రవరమునందలి గౌతమీ గ్రంథాలయము మాత్రము పదివేల సంపుటములచే నొప్పి యాంధ్రదేశ గ్రంథాలయములలోఁ బ్రథమస్థానము నందియున్నది. దీనికిఁ దరువాత విజయవాడయందలి రామమోహనరాయి గ్రంథాలయము చెప్పఁదగియున్నది. అన్ని విషయములలో వలె మన

## అనంతపుర మండలము

గ్రంథాలయోద్యమమునఁ గూడఁ జాల వెనుకఁబడియున్నది. గుంటూరుమండల జనులకును మనకును విద్యావిషయమున నెంత తారతమ్య ముండునదియు గ్రంథాలయములఁబట్టి యూహించుట సులభము. ఆమండలమున నున్న గ్రంథాలయముల సంఖ్య 160. మన మండలమునఁ బదునైదు మాత్రమే. ఇది 1919 వ సంవత్సరమున నిర్ణయించినలెక్క. మన మండలమున నిప్పుడీ సంఖ్యయు తగ్గియున్నది. ప్రకృతమిందుఁ బదింటికంటె గ్రంథాలయములు హెచ్చుగ లేవు. వేయిగ్రంథసంఖ్యను మించిన గ్రంథాలయ మరుదు. స్వతంత్రభవన మసలే పూజ్యము, చిన్నపల్లెలమాట యటుండ, గుత్తి—తాడిపత్రి—మడకసిరా—కల్యాణదుర్గము—మున్నగు తాలూకాపట్టణములయందింతవఱకు నిట్టియత్నమున్న మాటయే తెలియరాలేదు. ఉన్న గ్రంథాలయముల వృద్ధికిని మార్గములేదు. ఇట్టిచో మనకర్తవ్యమేమి? మన ప్రాంతమున నీ గ్రంథాలయోద్యమాభివృద్ధికిఁ జేయఁదగినకృషి యెట్టిది? దానిని సుకరముగ సాధించుట కేమి వెరవు? మూటలు లేక వట్టిమాటలచేతనే యీ యుద్యమము నడచునా? మనమన్ననో నిర్భాగ్యదేవతకు దాసులగువారము. నూటికొక్కరైన మనలో ధనికులు లేరనుట సత్యవిరుద్ధము కాదు. అమెరికాదేశపు "ఆండ్రూ కార్నిజీ" వంటి కోటీశ్వరులు మనకు లేరు. ఆస్ట్రేలియారాష్ట్రపు "డేవిడ్ స్కాట్ మిచ్చెల్" వంటి లక్షాధికారులు—నుదారశీలురు మనకు లేరు. ఆంగ్లదేశపు "బాడ్లియన్" వంటి ధననిధులు మనకు లేరు. బరోడాదేశపు "శ్రీ శాయాజీగాయక్వార్" వంటి ప్రభువులు మనకు లేరు. నిజముగా నట్టివారు మనకు లేరు. కుబేరులకు సములగు నిట్టిధననిధులు మనకు లేకున్నను త్యాగమున వెనుదీయని యుదారశీలురగు రెడ్డిసోదరులు మనమండలమున విరివిగ నున్నారు. మనసంస్థలకెల్ల వారిభిక్షయే మూలమగును.

మీరు మనమండలప్రధానపట్టణమున నవీనముగ నిర్మింపబడిన పురమందిరము (Town Hall)ను జూచియున్నారుకదా? ఆనిర్మాణమునకు వేలకొలఁది ద్రవ్యసాహాయ్యము చేసిన మహాశయులనామము లందలి యొకానొకదారుఫలకమున, స్వర్ణాక్షరపంక్తులుగఁ జెక్కఁబడియుండుటయు మీరుగమనించియుండఁగలరు. ఏయొకటిరెండో తక్కఁ దక్కినవన్నియు మన రెడ్డిసోదరుల నామములే. ధర్మవరమునందలి మా క్రియాశక్తి యొడెయరు గ్రంథభాండాగారమున కొకస్వతంత్రభవనము కావలసియున్నదనియు, నందులకు విరివిగ విరాళము లావశ్యకములై యున్నవనియు, నేను విన్నవించుకొనఁగా, శ్రీ పాముదుర్తి బయపరెడ్డిగారు భవనము పూర్తిగా నేనే నిర్మించి యిచ్చెదననియు, నందుల కొకొక్కరిని యాచింపవలదనియు సెలవిచ్చి వారి మహోదారభావమును వెల్లడించిరి. కనుక మనమండలమునకుఁ దగిన త్యాగశీలురగు రెడ్డిమహాజను లెందఱో యున్నారు. కాని ప్రయత్నప్రాబల్యముమాత్ర మావశ్యకమై యున్నది.

మనమండలమున ముఖ్యముగ గ్రంథాలయోద్యమప్రచార మతిశయముగ జరుగవలసియుండుట యత్యంతావశ్యకము. గ్రామగ్రామమునను గ్రంథాలయములు నెలకొల్పి, యవి చక్కనిమార్గమున నడచునట్లు చూడవలసియుండుట మండలజనుల ప్రధానకర్తవ్యము. నేను కడచిన చలికాలపుసెలవులలో కదిరికివచ్చియున్న సమయమున, నా మిత్రులగు శ్రీ వేంకటస్వామిరెడ్డిగారు, మాపల్లెలో నొక గ్రంథాలయము చిన్నచిన్నగఁ బనిచేయుచున్నదనియు, మీరెప్పుడేని వచ్చి దానిని బహిర్గతము గావింపవలసియున్నదనియు సూచించిరి.

కదిరి (ఖాద్రీపురము)

వంటి తాలూకాగ్రామముననే నూఱుపుస్తకములు గల యొక గ్రంథాలయమైనఁ జక్కని ప్రచారమున లేకుండఁగా, దానికిఁ జేరిన యొక కుగ్రామమగు

నాగిరెడ్డిపల్లె

యందు, గ్రంథభాండాగారప్రయత్న మున్నదన్న నాకెంతయు నాశ్చర్యము గల్గెను. అందుచేత ఫలముగా నేఁడిప్పటి వందలకొలఁది విలువగల గ్రంథములతో సమారంభోత్సవము గావింపఁబడుటచూడ, నాకపరిమితానందము గల్గినది. నేఁడు—

మహాశివరాత్రి.

హైందవప్రపంచమునకెల్ల నిది పుణ్యదివసము. శివుఁడు లోకదహనకారణమైన విషమును త్రావి—యమృతమును బ్రసాదించి—జగము నుద్ధరించిన పవిత్రపర్వదినము. ఇట్టి పావనదినమునఁ గొండలవలె మిమ్మెదురుకొనిన విషసదృశములగు విఘ్నపరంపరలనెల్ల దిగమ్రింగి, కేవల మమృతప్రాయమగు నీదివ్యసంస్థాపనము వెలువఱుచుటలో మీ పావనహృదయమునఁగల పూజ్యసంకల్పము వ్యక్తమైనది. మీరుపల్లెటూరుజనులైనను గ్రంథపరిశీలనమునను బ్రకృతిపరిశీలనమునను దక్షులు. కనుకఁ బట్టణవాసుల వంటి యనాగరికులుగారు. అన్ని యాచారములలో నెక్కుడుగ భావింపఁబడిన జీవదయ, మీ నిర్మలాంతఃకరణమున పొంగి పొరలుచున్నది. మీలోఁ గొందఱు జీవజంతువులపైఁ గరుణపూని, వాని హితాభివృద్ధికై చిరకాలమునుండి యాచరణమునయున్న మాంసభోజనమును బరిత్యజించి, కేవల సాత్త్వికశాకాహార నియమవ్రతులై దేవతలవలెఁ బ్రకాశించుచుండుట—మీ దివ్యనాగరికత కొక యుత్తమలక్షణమై యున్నది. మీరందఱు రైతుసోదరులే. చేతిపనులవలనఁ గుటుంబపోషణముఁ గావించుకొను స్వాతంత్ర్యప్రియులగు సాలీండ్రును మీలోనున్నారు. అందుఁ బెక్కండ్రు బీదలుగ గలరనుట వాస్తవమే. పట్టినకార్య ముత్కృష్టమైనదే, ఇదెట్లుండునోయని మీరు భయపడ నవసరములేదు. మీరందఱు నొడలు విఱిచి—చెమ్మటనూడ్చి—పాటుపడు స్వభావముగలవారుగాని తిని కూరుచుండుసోమరులుగారు. ప్రపంచమున నాగరకులమనియు—ధనికులమనియు—సుఖవంతులమనియు నెవ్వరు విఱ్ఱవీగుచున్నారో, వారి నాగరకతకును—ధనమునకును—సుఖమునకును—మూలమైనవారు మీరలేకదా? గొప్పమేడలలోని—ఉత్తమ సౌధాంతరాళమునందలి—దూదిపఱుపులమీఁదివారి సుఖజీవనము, పొలములలోను—చేతి మగ్గములలోను గష్టించి కార్చెడు మీ యొక చెమ్మటచుక్కపై నాధారపడియున్నదనుట మీరు మఱచినారా? ఇట్టి లోకరక్షణ కారకులగు మీరు సామాన్యులా? మీవంటి సుస్థిరసంకల్పుల కసాధ్యములగు కార్యము లున్నవా? సద్విషయములలో మనవారికిఁకను వాంఛ యొదవలేదనుట సత్యమే. అట్టివారి తలఁపులును—పలుకులును—పనులును వేఱు. రెండు మైళ్ళదూరమునన్న యొకవనమున భోగపుమేళము జరుగుచున్నదని తెలిసినఁ బురమునకుఁ బురమే యచ్చటఁ గూడుచున్నది; కాని ప్రక్కనింట నొక ధర్మోపన్యాస

చర్చ యారంభమైయున్నదన్నఁ ద్రొక్కిచూచువార లేయుండరు. ఈ విషయము మన కనుభవాతీతము కాదు. ఇది కేవల మొక్క ఖాద్రిపుర వాసులకే కాక సర్వసాధారణముగ దత్తమండల వాస్తవ్యుల కెల్ల నన్వయించుచున్నదనుట సామాన్యవి. ఇందులకు బ్రహ్మశ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారును దత్తమండల వాసులలో ననేకులకు సాహిత్యమునకన్న సిగరెట్లలో నభిరుచి యెక్కువయని నిన్నటి పినాకినీ పత్రికలో సాక్ష్యమిచ్చియున్నారు. మనవారు తమకాలమును—ధనమును—నీవిధమున దగ్ధముచేయ నలవాటుపడి యుండుటచే, సదుద్యమముల యున్నతికవకాశము లేకపోవుచున్నది. ఇట్టిదశలో నొక కుగ్రామవాసులగు మీరలి మ్మహోద్యమమున కుపక్రమించుట మీ దివ్యశీలమున కొక యుత్తమ తార్కాణమై యున్నది. ఇంతవఱకు నిట్టి ప్రయత్నమున ముందంజవేయని పురములకెల్ల మీ యీ యున్నతోద్దేశము చక్కని యాదర్శమగునుగాక! మిమ్మునుఁజూచి మీపొరుగునముండు జానపదులుచితగుణపాఠమును గ్రహించి, యిట్టి యుద్యమములయందు వర్తిలెదరుగాక! శివభగవానుఁ డిందులకు దోడగునుగాక!

ఓం తత్సత్.

---

# సర్వము నీవె!

గగన మండల మీవె మేఘములు నీవె
వర్షములు నీవె నది సరోవరము లీవె
సూర్యచంద్రులు నీవె యా చుక్క లీవె
జగతి సర్వోపగత మహాస్వామి వీవె!

అల్ల సెలయేటి తుంపరలందు బాల
సూర్యతేజో విరాజిత శోభ లలరఁ
దాండవము సేయు దివ్యేంద్ర ధనువు నీవె
తుంపరలు నీవె సెలయేటి పెంపు నీవె!

సౌరభాస్తోక వికచపుష్పప్రశస్తిఁ
గనుల పండువుసేయు చొక్కంపుఁ దరులఁ
జిగురు జొంపము లీవె యాచెలువ మీవె
పుష్పములు నీవె సౌరభ పుంజ మీవె!

—కొత్తపల్లి సుబ్బన్నాచార్యులు.

---

# కల.

అయ్యా!

ఈ క్రిందియుత్తరమును తమ పత్రిక యందు ప్రకటింపగోరెదను. ఒకనాటిరాత్రి నేనొకకల గంటిని. ఆకలయందు ఈ యుత్తరమునందలి భావముల నే కనులార గంటిని. కొలదిదినములకే పోష్టుజవాను ఈ యుత్తరమును దెచ్చి యిచ్చినాడు. ఇది దైవవిలాసమని భావించితిని. చిత్తగించవలెను.

సోదరా!

మీ కెన్నోమార్లు ఉత్తరం వ్రాతామని కలము పట్టితిని. ఎన్నో భావములు మానసము పట్టి పట్టకుండా త్రొక్కిళ్లాడ సాగినవి. తుద కా రభసరములో ఏదీ బయటపడక పొయ్యేది. ఇల చాలాపర్యాయము లైనది. ......మీ స్వభావము నే నెఱుఁగుదును. పట్టిన కార్యరీతి గూడ నాకు తెలియును. అందులో ఎంతవఱకు కృతార్థులయినది గూడ నేను చెప్పగలను. మీ రిపుడు విజయవృక్షముయొక్క మొదటిపంగలో నున్నారు. అంతవఱకు ఎక్కడానికి మీకళత్రమె ప్రధానసాధనము. మిమ్ము నామె ధర్మప్రచారముకొఱకే వివాహమాడినదా యేమని నేననేకపర్యాయములు తలపోసితిని.

మీకు మాతృసందర్శనసుఖము చాల చిన్నతనములోనే కలిగినది. నేను మన ...... దినములను ఇప్పు డనుభవించుచున్నట్లు భావించుచున్నాను. అప్పటి మీవయసు; మీకళత్రము వయస్సు; కేవలము భోగభాజనములగా విస్ఫారవలసిన తరుణము. అలాటి యున్మాదావస్థలోగూడ మీచిత్తము దేశానరము దలచుకొని తత్తరించెను. దాని నివారణకొఱకు ఏమేమో ప్రయత్నాలు సల్పినారు. ఈ మీ ప్రయత్నా లన్నీ ఆమె కేదోవిధముగా కష్టపెట్టేవే యైనవి. నీచుట్టూ చేరిన స్నేహాలకి ఆమె ఒడలువంచి చేసినయుత్సాహసేవ కావ్యమునకు జీవము పోయగలది. ఆమె ప్రసన్నభావమును, అప్పటి ఆమెవయసును పరస్పరము విషమింపవలసి యుండె; కాని అట్లు కాలేదు. ఆమెవయసు ఆమెప్రసన్నతకు నూతనమైన పసుచుదనము నిచ్చెను! నేసే విస్తరికీ తీసే విస్తరికీ విధివిరామములు లేకుండా నీకళత్రము నీయనంతకోటి అతిథిజనము నాదరించినది. నీకు యశము దెచ్చినది. నీగృహమును సౌశీల్యసుగంధముతో మనోహరము చేసినది. తుదకు నీభుజమునెత్తి విజయశాఖ నందించినది! ఎక్కడగలవని విశ్వసించినది కాంబోలు! ఆమె యవలంబనమును ఆవలఁ జేసినది. ఇది నిరాలంబనావస్థ:—

నీచిత్తవృత్తిని నేను పలుమారు భ్రమరముతో పోల్చుదామనుకొంటిని. ఎందుకా? తీరిక లేదు. అలుపు లేదు, మితిలేదు. ఎంతదూరముపోయినా యింకా ముందుచూపే! అయితే పూలమీదనే! పరిమళపజ్జనే! అట్టియుత్సాహముతో నీజీవితమునే తేనెతుట్టెను రసవంతముచేశావు. ఎవరికోసమో? ఇక్కడ నాయన్యాయము తప్పవచ్చు. కాబట్టి మానేస్తాను. అయితే ఎలాగైనా మధుకోశమున్నది. అందరి కన్నులనిండా మధురసమున్నది. ఏకొమ్మమీద దీనిని లగించినావో, ఆకొమ్మ యిప్పుడు దేవతలు కాంక్షించి పైకి లాగికొన్నారు. కాని రసకణములు ఎడతెగకుండా పైనుంచి రాలుతునే వున్నవి. ఎక్కడ? నీనాలుకమీద కాదు. నీహృదయముపైన. ఇదే శేవము. వాణితడిస్తే పొదుగుచేపినట్లు చేపుతుంది. హృదయము తడిస్తే కర్పూరమువలె కరిగిపోతుంది. నీగుండె స్వచ్ఛమయిన పచ్చికొబ్బరిముక్కవంటిది. తీయనిపాల నిగనిగలె పైకి కనబడే రూపవైభవము. కొబ్బరి నలిగితే గాని పాలురావు. కాని రూపము మారుతుందేమో అని భయము. ఒక్కమాట నూతఁజేసికొనుము. వెతకినా కృత్రిమములేని మాతృసేవ చేసినావు. ఆంధ్రభారతి కాళ్లు కడిగి విద్యార్థులనెత్తిన చల్లినావు. పండితులయిండ్లలో బందాలుపడ్డ భాషాబాంధవిని పల్లెలు పట్టణాలు అనకుండా సర్వత్ర స్వచ్ఛందవిహారములకుఁ దెచ్చినావు ...... ఆలయములు గట్టించినావు. భావిభారతీయులను ............లనుజేసి దేశారాధన కంకణము కట్టినావు. నిజముగా నీవు ధన్యుడవు కావా? నాయంతర్వాణి అవునని మారుమ్రోగుచున్నది. నీవు ఉజ్జీవమిచ్చిన ఒకానొక కుమారకవిసోదరుని అనునయ మిది. పరిగ్రహింపుము. ప్రసన్నతను వదలకుము.

---

# శ్రీరామారాయ గ్రంథాలయము.

నరసారావుపేటతాలూకా పమిడిపాడు అగ్రహారమందున్న శ్రీరామారాయ గ్రంథాలయ ద్వితీయవార్షికోత్సవము 31-10-22 తేదిన శ్రీఅయ్యంకి వెంకటరమణయ్యగారి అధ్యక్షతక్రింద జరిగినది. సాయంత్రం 3 గంటలకు మా గ్రంథాలయ భజనశాఖచేతను మంగళవాద్యములతోను అధ్యక్షుని యెదుర్కొని అర్ఘ్యపాద్యాదుల చేగౌరవించి గ్రంథాలయమునకు తోడ్కొనివచ్చిరి. దైవప్రార్థన జరిగినపిమ్మట శ్రీబెల్లంకొండ రాఘవరావుగారిచే ఉపపాదింపబడి, అధ్యక్షులు తమ ఆసనము నలంకరించి తమ ప్రారంభోపన్యాసమును గావించిరి. అందు ముఖ్యమగు కొన్ని సంగతులను తెలుపుచున్నాను.

గ్రంథాలయము ఒకవిద్యావంతులకే కాక విద్యావిహీనులకుగూడ ఉపయోగపడునట్లుగా ఉండవలయును. అది యెట్లన, పత్రికలను చదివి దేశీయవార్తలను తెల్పుట, పురాణకథలను తెల్పుట మొదలైనవి. ఇందుండు భజనశాఖయందు విద్యావిహీనులనుగూడ చేర్చి కోలాటమును నేర్పి గరుడస్తంభము మొదలైనవి యేర్పాటుచేసిన చాలా బాగుగయుండును. ప్రస్తుతము ఒక చందాలవల్లనే యీ గ్రంథాలయమునకు ధనము వచ్చుచున్నట్లున్నది. విద్యావిహీనులయినరయితులవల్లను ధాన్యమువగైరాలు

వసూలు చేసి వారికిని ఇందు భాగము కల్పించి ద్రవ్యము సమకూర్చవలయును. పిమ్మట గ్రంథాలయావశ్యకతనుగూర్చి శ్రీయుత వేమూరి శ్రీరాములుగారును, గ్రంథాలయ తత్వమునుగూర్చియు, యీగ్రంథాలయము జరుగుచున్న విధమునుగూర్చియు బ్రహ్మశ్రీ లంకా సుందరరామశాస్త్రిలుగారును ఉపన్యసించిరి. తదుపరి గ్రంథాలయ కార్యదర్శియగు శ్రీయుత బెల్లంకొండ హనుమంతరావుగారు యీక్రింది కార్యనివేదికను చదివిరి:—

## కార్యనివేదిక.

సుజ్ఞానజనకంబునకు మూలస్థానంబును ధర్మార్థకామమోక్ష చతుర్విధపురుషార్థప్రదంబును, కామక్రోధాద్యరిషడ్వర్గదూరీకరణంబును, సర్వజనవిద్యాబోధకంబును, దేశీయవార్తాజ్ఞాననివ్యచక్షువును, సర్వమతబోధకంబును, గాంధ్యుపదిష్టఅసహాయయోగతత్వవిస్తరీకరణంబునకు ఆధారభూతమును, యగు గ్రంథాలయం బత్యావసరమని యెంచి సర్వజనానుమతంబై దత్సహాయంబున రౌద్రి సంవత్సర విజయదశమీ భృగువాసరంబున యీగ్రామంబున నొకగ్రంథాలయంబు స్థాపింపబడియె.

గ్రంథాలయప్రకరణోచితంబగు గ్రంథాలయ నామకరణంబు యుక్తంబుగాన కీర్తిశేషులును, న్యాయవేదాంత ధర్మశాస్త్రముల కాకరుండును, అఖండవిద్యాప్రదాతయును, యేతత్పురవాసియు, అస్మద్వంశాబ్ధిమృగలాంఛనుండు నగు శ్రీయుత బెల్లంకొండ రామారావుగారి నామంబుచే యీగ్రంథాలయం బలరారుట యుక్తమని యెంచి సర్వజనానుమోదితంబై "శ్రీరామారాయగ్రంథాలయం" బను పేర యీ గ్రంథాలయంబు స్థాపితంబై యేతావత్పర్యంతము శోభిల్లుచున్నది.

దుర్మతిసంవత్సర ఆశ్వయుజ బహుళ విదియయందు పల్నాడుతాలూకా అంబాపుర గ్రామవాస్తవ్యులును, ప్రస్తుత మీ గ్రామమందు సంస్కృతవిద్యాప్రబోధకులు యగు బ్రహ్మశ్రీ లంకా సుందరరామశాస్త్రిగారి అధ్యక్షతక్రింద బహిరంగసభ గావింపబడి యందు సకలజనానుమోదితంబయి, అధ్యక్ష, కార్యదర్శి, ఉపాధ్యక్షుల యెన్నికలు జరుపబడియె.

అధ్యక్షుడు — బెల్లంకొండ రాఘవరావు.

కార్యదర్శి — బెల్లంకొండ హనుమంతరావు.

ఉపాధ్యక్షుడు — ముత్తరాజు లక్ష్మీనరసింహంగార్లున్నూ నిర్ణయింపబడి ప్రతి శనివారమును యీగ్రంథాలయ శాఖయగు భజనశాఖచే భజనలు జరుపబడుచున్నవి. యీ గ్రంథాలయమందు బ్రహ్మశ్రీ లంకా సుందరరామశాస్త్రిగారిచే కార్తిక శుద్ధ ౫ మొదలు మార్గశిర పూర్ణిమపర్యంతము జైమినీభారతమున్నూ, దుర్మతిసంవత్సర మార్గశిర బహుళ ౧౧ మొదలు మాఘబహుళ సప్తమి పర్యంతము అధ్యాత్మరామాయణమున్నూ పురాణరూపకముగా చెప్పబడియె. పుష్య శు ౨ (విదియ) రోజున యీగ్రంథాలయమందు సీతాకల్యాణమహోత్సవమున్నూ జరుపబడియె. మాఘ బ ౯ రోజున శ్రీరామ పట్టాభిషేక సమారాధనయు జరుపబడియె. శ్రావణ బహుళ ౧౧ రోజున యీ గ్రంథాలయపక్షమున తెప్ప ఉత్సవము జరుపబడియె. భాద్రపద శుద్ధ ౫ రోజున యీ గ్రంథాలయ నాటకసంఘములయొక్క ఛాయాపటగ్రహణమున్నూ జరుపబడియె. మార్గశిర శుద్ధ ౧౫ రోజున గతసంవత్సర వార్షికోత్సవమందు ఆమోదింపబడిన శ్రీయుత బెల్లంకొండ సీతారామయ్యగారి స్మారకోత్సవమున్నూ జరుపబడియె.

ఈగ్రంథాలయమునకు సమకూర్చిన గ్రంథములు 320. చందాదారులు 10. నిత్యమువచ్చు ప్రేక్షకులసంఖ్య 2163. రోజునకువచ్చు ప్రేక్షకులసంఖ్య 7. గ్రంథగ్రాహకుల సంఖ్య 153. ఈగ్రంథాలయమునకు వచ్చువార్తాపత్రికలు (1) ఆంధ్రపత్రిక (దినపత్రిక) (2) కృష్ణాపత్రిక (3) అభినవసరస్వతి.

## గ్రంథాలయ ఆదాయవ్యయ నిర్ధారక పట్టిక:

ఆదాయము:

రు 40-9-0 చందాలవల్ల వచ్చినది.
43-0-0 ఇతర విరాళములు.
1-8-0 రామదండువల్ల వచ్చినది.

రు 85-1-0 లు వెరశి.

వ్యయము:

రు 35-13-0 లు పత్రికలకుగాను.
38- 0-0 లు తెప్పవుత్సవమునకు.
4- 0-0 లు చిల్లరఖర్చులు.

రు 77-13-0 లు వెరశి.

ఈరోజున కార్యదర్శివద్ద నిల్వయున్నది రు7-4-0 లు.

గీర్వాణవాఙ్మయమున కస్మదాదుల కాద్యగురువులును, పండితోత్తములును, యీ గ్రంథాలయమునందు యేవిధమయిన ఆధిపత్యము లేకపోయినను అస్మదాదుల వలె శ్రమతీసుకొని యీగ్రంథాలయమును ఉద్ధరించు

చున్న బ్రహ్మశ్రీ లంకా సుందరరామశాస్త్రిగారికి యీ సంఘపక్షమున వందనశతకంబు లర్పించుచున్నవాడను.

ఈ గ్రంథాలయమందు యేవిధమయిన పదవి లేకున్నను కడు జాగరూకతతో యీ గ్రంథాలయ భారమును వహించుచున్నవారలును, అసహాయయోగ ప్రవర్తకులును యగు శ్రీయుత రాళ్ళభండి వెంకటేశ్వరశర్మ, రంగావఝుల రామకోటయ్యగార్లను యెంతయో యీ సంఘపక్షమున కొనియాడుచున్నాను.

ఈ గ్రంథాలయమున కుచితముగా గ్రంథములనిచ్చిన వారికి యీసంఘపక్షమున వందనశతకంబు లర్పించుచున్న వాడను.

అనంతరము శ్రీయుత బెల్లంకొండ రాఘవరావుగారు యీగ్రంథాలయవిషయమై చాలాపాటుబడిన బ్రహ్మశ్రీ లంకా సుందరరామశాస్త్రిగారిని శ్లాఘించుచు యీ గ్రంథాలయవిషయమును బోధించిరి. అధ్యక్షుని అంత్యోపన్యాసముతోను మంగళవాద్యములతోను సభ ముగిసెను.

ఈ గ్రంథాలయశాఖయగు నాటకశాఖచే ఆరాత్రి శ్రీకృష్ణరాయబారము (పాండవోద్యోగము) కడురమ్యముగా సకలజనాహ్లాదకరముగా ప్రదర్శింపబడెను. మరుసటిదినము అనగా దుందుభిసంవత్సర కార్తికశుద్ధ ౧౨ రోజున తృతీయవార్షిక కార్యనిర్వాహకవర్గయెన్నికలు జరుగుటకై బ్రహ్మశ్రీ లంకా సుందరరామశాస్త్రిగారి అధ్యక్షతక్రింద సభగావింపబడి యీ క్రిందివిధముగా యెన్నికలు జరిగెను:

అధ్యక్షుడు—బెల్లంకొండ రాఘవరావు. ఉపాధ్యక్షుడు—ముత్తరాజు లక్ష్మీనరసింహం. కార్యదర్శి—బెల్లంకొండ హనుమంతరావు. సహాయకార్యదర్శి—ముత్తరాజు రంగారావు.

కార్యనిర్వాహకసభ్యులు—బెల్లంకొండరామారావు. బెల్లంకొండ జగన్నాధరావు. బెల్లంకొండ నారాయణరావు. కోట రామసుబ్బయ్య.

ఈ గ్రంథాలయపక్షమున హిందీ, రాజ్యాంగతంత్రము, చరిత్ర, వాఙ్మయము మొదలైన విషయములలో శిక్షణయిచ్చుటకు ఒక జాతీయపాఠశాల స్థాపించుటకై తీర్మానించబడినది.

—బెల్లంకొండ హనుమంతరావు,
కార్యదర్శి.

# శ్రీశారదా పుస్తకభాండాగారము, నాగిరెడ్డిపల్లె.

అనంతపురముజిల్లా కదిరితాలూకా నాగిరెడ్డిపల్లె గ్రామమునందలి శ్రీశారదా పుస్తకభాండాగార సమారంభోత్సవము 1923 వ సంవత్సరము ఫిబ్రవరినెల 13వ తేది మంగళవారము (మహాశివరాత్రి) నాటిరాత్రి 9 గంటల సమయమున ధర్మవరపురవాసులును—సాహిత్యసరస్వతీ బిరుదాంకితులును,—అగు మ| రా| రా. శ్రీ సీరిపి ఆంజనేయులవారి యాధిపత్యమున జరుపబడెను. ఊరిలోని చిన్నలు, పెద్దలు, స్త్రీలు, పురుషులు గ్రంథాలయమునకు గిక్కిరిసియుండిరి. కదిరిపురమునుండి కొందఱుసోదరులు విచ్చేసియుండిరి. ప్రారంభమున శ్రీయుత చిట్టా నరసింహప్పగారు ఈశ్వరప్రార్థన చేసిరి. ఆహ్వానసంఘాధ్యక్షులగు మ॥ రా॥ రా॥ శ్రీ మాచిరెడ్డి వేంకటస్వామిరెడ్డిగారు సభ్యులపక్షమున స్వాగతపత్రమును జదివి యధ్యక్షుల కర్పించిరి. కార్యదర్శి గ్రంథాలయ నియమములను సభ్యులకు వినిచెను. అనంతర మధ్యక్షులు తాము వ్రాసితెచ్చియుండిన గ్రంథాలయోద్యమ చారిత్రమున, నీయూరి జనులయంతరువునకు దగిన ముఖ్యావసర విషయములను—దేటమాటల—నాకర్షకముగ నుపన్యసించిరి. సభాపతి తమ యంత్యోపన్యాసానంతరము, పదునేనురూపాయల విలువగల 33 గ్రంథములు, నిలయమునకు దానముచేసి, యితరులకు మార్గదర్శులైరి. తదుపరి క్రింది విరాళములు కృతజ్ఞతాభివందనపూర్వకముగ నందుకొనబడినవి.

| | | |
|---|---|---|
| వాయల్పాడు చింతల రఘునాధరెడ్డివర్మగారు | ౬ | గ్రం॥ |
| ఓ. ఓబుళరెడ్డిగారు, కదిరితాలూకాగుమాస్తా | ౫ | ,, |
| మల్లిపూల నరసప్పగారు | ౨ | ,, |
| మాచిరెడ్డి వేంకటస్వామిరెడ్డిగారు | ౧౫౦ | ,, |
| గణాపల్లి చిన్నపరెడ్డిగారు | ౨౦ | ,, |
| సాకిరెడ్డిగారు | ౧ | ,, |
| హిందూపురము ప. నంజుండప్పగారి గ్రంధములు—కరపత్రములు | | |
| దక్కన్ హైదరాబాదు లాల్జీమేఘజీగారు | ,, | ,, |
| మొగిలి సాంబయ్యశెట్టిగారు, కదిరి | ౨౦ | |

| | | |
|---|---|---|
| బండ్రేపల్లి గణాదిపల్లె రామిరెడ్డిగారు | ౧ | ,, |
| రొద్దం నరసింహారెడ్డిగారు | 1 | గ్రంథము. |
| రొద్దం సాకిరెడ్డిగారు | 2 | ,, |
| కటికెల రామప్పగారు | 3 | ,, |
| పాపనార్యులుగారు | 3 | ,, |
| గణాదిపల్లె రామిరెడ్డిగారు | 2 | ,, |

కృతజ్ఞతాభివందనములతో — పుష్పతాంబూలసమర్పణముతో — విజయవంతముగ సభ ముగిసెను.

మా గ్రామమందు యీపుస్తకభాండాగారమును నెలకొల్పి యిందుకు సుమారు నూరు రూపాయలకు మించిన అమూల్యమైన గ్రంథములనుయిచ్చి యిందుకు తన శక్తికొలది తగు సహాయముచేస్తూ దేశోపకారముచేయునట్టి మా గ్రామనివాసులును మాగ్రంథాలయ అధ్యక్షులగు మహారాజశ్రీ మాచిరెడ్డి వెంకటస్వామిరెడ్డిగారి ఉదారగుణము చాలా ప్రశంసించవలయును. ఇదే విధముగా మాగ్రంథాలయమును, మాగ్రామమును అభివృద్ధికి తెచ్చునట్లు పాటుపడుటకు ఈశ్వరుడు వీరికి ఆయురారోగ్యైశ్వర్యము లిచ్చుగాక.

—జి. చిన్నపరెడ్డి,
కార్యదర్శి.

---

# నవీనాంధ్రకవులు.

## II తిరుపతి వేంకటకవులు.

తెలుగుబాసలో నిటీనల మొలకెత్తి, నలుమొగముల నల్లికొని, క్రొత్తపోకడల మించి మెరయు, కవితారంభంపుమొగసాల దిరుపతి వేంకటేశ్వరులు నిలచియున్నారు. ప్రాచీనాంధ్రసారస్వత సారమంతయు లక్ష్యలక్షణసమన్వితముగ వీరిలో జీర్ణించియుండెను. వర్తమానకాలమున మానవజాతులలో కావ్యకళాదులగూర్చి జగగుచున్న భావవిపర్యయముల జక్కగ గుర్తించు వివేకము వీరికమరియుండెను. ప్రాచీనాంధ్రభాషాసంప్రదాయముల నూతనకాలోచితవిషయముల కుపకరింపజేసి, ప్రాచీనలక్షణమర్యాదల నవీనాదర్శములకు జతపఱచి, కావ్యములయొక్కయు, లక్షణగ్రంథములయొక్కయు, పరస్పరసంబంధముల గుట్టుమట్టుల గమనించి, స్వతంత్రించి, క్రొత్తపోకడల మించి దారిజూపెడి మేటిమగంటిమి వీరికొప్పుచుండెను. స్వతంత్రించి మొదలిడిన కావ్యవైఖరుల దిగంతముల వ్యాపింపజేసి, భావిప్రయత్నములకు వలయు నుత్సాహోద్వేగముల నుత్పత్తిజేయదగు ఆత్మవిశ్వాసము, ఔదార్యము, పట్టుదల, వాదోత్సాహము, ధైర్యము వీరియందుండెను. ఆంధ్రకవితోపాసకుల భూత వర్తమాన భావిజీవితగతులు వీరి జీవనములో గోచరింప, నవ్యాంధ్రకావ్యరీతులు వీరి మానసారామనిబంధముల బలుతెరవుల వెలయ తిరుపతివేంకటేశ్వరు లీనాటి తెలుగుపోకడల నాయకులై, నేతలై, సూత్రధారులై యెగుకగల్గి వెలుగుచున్నారు.

వీరి జీవితాంశముల తెలుగువారెల్ల లెఱుంగుదురుగాన వాని నీయెడ విస్తరించము. ప్రాచీన గురుశిష్యసంప్రదాయముల నేటివరకు నిలుపుచు, నిరుపమశిష్యవాత్సల్యమునను, పరహితాపేక్షచేతను, వేలకొలదిశిష్యుల సంపాదించి, సత్స్నేహధర్మములచే నిలుపుకొనజాలు సత్పురుషులు. చమూనాథులకుండు ఆశ్రితపక్షపాతము, నిరాఘాటప్రచారము, నిర్భయసమరోత్సాహము గల్గి వీరకరుణారసముల కాలవాలమయి, శాపానుగ్రహశక్తులొప్పుచు, నాయకస్వరూపమును నిండువెలుగున బ్రకటింపగల ధీమంతులు. వీరు నిరంతరకావ్యరసోపాసకులు. ప్రాచీనకవులయెడను, తమ కావ్యములపట్లను, ఆరని యుత్సాహ ముత్పత్తిజేయగల తన్మయత్వము వీరి కలవడెను. ప్రాచీన కావ్యసాంఘికమర్యాదలందు గౌరవముంచుచు, వాని ననవసరముగ నిర్హేతుకముగ ఖండింపక, ప్రాతవని పాడువెట్టక, వాని శృంఖలముల జిక్కకొనక, సమయోచితముగ నుపయోగించుచు స్వతంత్రజీవితసూత్రముల నేర్పరచగలిగియుండిరి. ఇందుచే వీరు ప్రాచీన నవీన మర్యాదావలంబకులగు నాంధ్రభాషాసేవకు లందరివిశ్వాసమునకు గుదురైరి. వీరి యౌదార్యము, బాలకవులయెడ జూపెడి వాత్సల్యప్రోత్సాహములు, మాటలసొబగు, స్నేహధర్మములు వీరిప్రతిభ నెల్లెడల జాటినవి.

శ్లో॥ కేచిత్ శ్రీపతివేంకటేశ్వరకవీ దృష్ట్వాథ శుశ్రూషయా। కేచిత్ కేచిదమిత్రతా ముపగతాః కేచిత్ప్ర

త్యాంతికే । అభ్యస్యంతి శతావధాన కలనాం కీర్తిం
లభంతే ధనం । తస్మా దాధునికావధానిగురుతా
హేతూ గురూ సంశ్రయే ॥

వీరి యుత్సాహప్రోత్సాహ తన్మయత్వముల కాంతిచే నెందఱో భాషాసేవకులై సరసకావ్యముల గూర్పగలిగిరి. తిరుపతి వేంకటేశ్వరులు గుణగ్రాహులు, పరాభిప్రాయమును సహించువారలు, వినయసంపన్నులు. పెద్దఱికముల దారు లెఱుగక నందఱితో కలసి మెలసి సంచరించు నిండుకుండలు. అయినను వలసినచో వెట్టి మెట్టి బడాయిల నణగద్రొక్కవలసినచో, పండితవాద ప్రహారముల నెదుర్కొనవలయుచో, వీరి మానస మిట్లుండెను.

శా॥ "మాకన్నన్ మహనీయులైరె కవు లీ క్ష్మామండలిన్
లేకపో । రీకాలంబున యుష్మదీయ కవితాద్వీపంబు
ముంపంగ నస్తోకశ్రీక మదీయ దివ్యకవితాతుంగాచ్ఛటీ
ఘోరగంగాకల్లోలవతీ ప్రవాహభర వేగ ప్రక్రియల్
చాలవే॥"

తాము స్వతంత్రించి యూనిన నూత్నకవితామార్గముల నిలచి నిలుపగల యహంకారము, పూనిక, ఉత్సాహము నైజసత్త్వమున దీపింప, తిరుపతి వేంకటేశ్వరులు నవీనాంధ్రకవితాపురోగాములై విలసిల్లిరి.

తిరుపతికవులు తెలుగుకవిత్వమును ప్రభుపోషణమునుండి తప్పించి, ప్రజాపోషణమున జేర్చి, కవుల స్వాతంత్ర్యమును, కావ్యముల పరమైశ్వర్యవిభూతిని నెలకొలిపియున్నారు. రాజుల దర్శించి, సంపన్నుల జూచి, "సన్మానము లంది బహుమానములన్ గ్రహియించిరే" గాని, కావ్యలక్ష్మీవిలాసముల నరస్తవమున కుపయోగింపలేదు. నానారాజసందర్శనమునం దగుపడు చర్యలన్నియు, "జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః। నాస్తి తేషాం యశఃకాయే జరామరణజం భయం" బను నార్యోక్తి జాటుచు, "ధరణీశులు మ్రొక్కగ నిక్కినా" మను నిర్లక్ష్యమానసస్వాతంత్ర్యమును సూచించుచుండును. అంతకుమున్ను రాజాశ్రితులగు తెలుగుకవులు తామల్లినపొత్తముల రేకుల కంపించు వేతనకు పెద్దప్రొద్దు లోపికతో వేనిచూపుల గాచియుండ, తిరుపతి వేంకటేశ్వరులు విజయనగరమున, నభినవ భోజుడోయన సరస గుణసాంద్రుడై, సకలకళాసంపన్నుడై, కవికల్పవల్లియై వెలుగొందు ఆనందగజపతీంద్రుని గనుంగొని "ఎందరి జూచె నేని వరియింపదు మాకవితాకుమారి......తటాలున దీని బరిగ్రహింపుమా" యని పెండ్లాడించి, వసుమతీశులుకూడ కావ్యసామ్రాజ్యవైభవంబుల పరమోత్కృష్ట్యమును అంగీకరింపవలయుగౌరవ మేర్పరచిరి.

తిరుపతికవులు కావ్యసాధనమే మోక్షసాధనమని విశ్వసించి, నిర్మలవిశుద్ధ రసానుభవమున నుత్తమగతుల జెంద నుద్యోగింతురు. శ్రోత్రియమగు జీవనముకాని, వైదికాచార సంపత్తులు కాని, దేవతోపాసనకాని, పరతత్త్వమును, పురాణగాథలను పఠివని చేర్కొనుటకాని, కవుల నిత్యసాధనగ వీ రంగీకరింపరు. "శృంఖలాత్పృణీకరణమందు" కావ్యకలనానుకూలమగు మానసమే, రసాత్మకమగు నీశ్వరోపాసనయే మోక్షకారణమగునని చెప్పియున్నారు. ఇందువలన తిరుపతికవుల కుపాసితదేవి లేదనరాదు. వెంకటశాస్త్రి సహజగాంభీర్యములో, "అస్మదుపాస్య, అస్మమహోదారచరిత్ర యియ్యెడల దా రచియింపకపోదు సాయమున్" అని నిత్యము నమ్మచుండెను. తిరుపతిసింగపు హృదయాంతరాళము, భీముని మానసమువలె, కోమలవినయలాలిత్య మొప్పుచు "హేయంబైన సభాపరాభవము రానీకమ్మ కాత్యాయనీ," యంచు జాలిపలుకుల నమ్మను గొలుచుచుండెను. గురుజనంబులగూర్చి వీరి కపరిమితవిశ్వాస ముండెను. ఈకృతజ్ఞతయే వీరి భక్తవర్గమును గూర్పగలిగినది. "వాసింగన్న కవీశ్వరుండయిన, నెవ్వాడైన" గురుద్రోహ మొనరింపగూడదనియే వీరి యభిమతము. ప్రాచీన హైందవాచారములపట్ల సహేతుకమైన యభిమానముంచి నిలవదీయుచు, పాశ్చాత్య సంపర్కమున నేర్పడిన సంఘసంస్కరణాభిలాషను నిగ్రహించుచు, జాతీయధర్మప్రతిష్ఠాపనలందు మాన్యత నేర్పరచుచుండిరి.

తిరుపతికవులు ఖండకావ్యములకు దారి జూపిరి. భారతభాగవతాది మహాపురాణముల రచించుటకు వలయు లోకానుగ్రహదీక్షయు, తపస్సంపత్తియు, రససిద్ధియు తిక్కన పోతనాదుల కొప్పియుండెను. ఆంధ్రకవితాపితామహుని మనుచరిత్ర యేర్పడు కాలముననే తెలుగుకవులపస కొంత చెడినదని చెప్పవచ్చును. పెద్దన మూడాశ్వాసముల బూరించినంతనే కావ్యవైఖరి మారినది. తరువాతి కావ్యకర్తలు ప్రబంధములలో నష్టాదశవర్ణనల నింపి, కావ్యము ఖండచిత్రములసంపుటముగ నొనర్చిరి. ఇవియు చేమకూరివాని యనంతరము రసరూపసౌందర్యముల వీడినవి. సామర్థ్య మెట్లున్నను తిరుపతికవులకుముందు పేరొందిన వీరేశలింగకవిగూడ, "శుద్ధాంధ్రనిరోష్ఠ్యనిర్వచననైషధము" రచియించెను. తిరుపతికవులవధానకవిత్వమును జనరంజకముగ నొనర్చి, సులువగు సరసమగు, లక్షణసహితమగు భాషలో సమస్తవిషయము

లను, నానాసందర్భములను, సుబోధకముగ ముద్దులొలుక బలుకుచుండిరి. అవధానములందును ప్రస్తావనలందును వీరువచించిన కావ్యవైఖరులు ఆశుకవిత్వ సాగళ్య మొప్పియు, నందచందముల తొల్లిటి మేటికవుల కల్పనలకు వెనుదీయక తెలుగుపద్యముల నతిశీఘ్రముగ నతి లాఘవముగ నల్లుతెరవుల గల్పించెను. తిరుపతి వేంకటేశ్వరుల మానసప్రభావమున సర్వజనాంగీకారమంది మాన్యతవహించిన యవధానకవిత్వము, ఇతివృత్తమందును భాషాప్రయోగమందును, విషయ స్వాతంత్ర్యమందును ఖండకావ్యములమూలమై, నవ్యాంధ్రకవితాస్రవంతికి యూరని బిచ్చుమిడినదాయెను. వాడుక తెలుగు నెంతయు మనోహరముగ నుపయోగించి యల్పసంస్కారులగు బాలకవులపాలిటి దైవమై, తారకమంత్ర ముపదేశించిన ప్రౌఢ లీ తిరుపతికవులు.

ఉ॥ "వేసవి దగ్గరాయె మిము ♦ వీడుటకున్ మనసొగ్గదా
యె మా। వాసము దూరమాయె పర ♦ వాసమ దెట్టు
లొ భారమాయె మా। కోసము తల్లిదండ్రిలది♦ గో
ఇదిగో నని చూచుటాయె వి। శ్వాసమెలర్పగా సెల
వొసంగినఁ బోయెదమయ్య భూవరా."

అను పద్దెములందును కామేశ్వరీశతకమందును, శనిగ్రహమందును, అవధానప్రస్తాపనకల్పనలందును, తిరుపతి వేంకటేశ్వరులు బింకాననడచిన ముద్దుపోకడ లాధునికాంధ్రకవితావిర్భావమహారంభమున కాధారములైనవి. ప్రస్తావనలో వీరి సమయస్ఫూర్తి, తిరుపతిశాస్త్రి కాకినాడ శైలనిలయమున నుండగా శృంగభంగమును బ్రచురించినవార్త విని, యచ్చెరువంది చెప్పిన పద్యరాజమే వేనోళ్ళ జాటుచున్నది.

ఉ॥ చుక్కలు రాలలేదు రవిసోములపోకడ మారలేదు న
ల్దిక్కులు కూలలేదు జలధిజ్వలనం బుబుకంగ లేదు నే
డక్కట రామకృష్ణకవు లక్కఱలేగతి జేయనేర్తురా
ధిక్కృతవైరివేంకటసుధీశ్వర మౌళికిశృంగభంగముల్॥

తిరుపతికవుల తేతకైతలు, నవ్యవైఖరులదెలుప వేంకటశాస్త్రి మందస్మితావలోకనకళాసంపర్కమున నాంధ్రభాషామాధుర్య మనివార్యమోహపాశముల వెదజల్ల నెందరో అవధానులై, నాటకకర్తలై, కావ్యకలనావైదుష్యమును సంపాదించియున్నారు.

తిరుపతికవు లాంధ్రగీర్వాణ భాషాలక్షణములం దసమానపాండిత్యము నొప్పుచున్నను, సుప్రయోగదక్షులయ్యును, పూర్వకవుల గుట్టుమట్టుల నెఱిగి యీగతి వచించిరి:

క॥ వ్యాకరణ మొక్కటేగా మహాకవు లొక్కత్రోవ కోశమణిల మ్మొకత్రో, వైకనుపట్టెడి నీ భాషాకావ్యమ్ములను దఱుచు చదివినకొలందిన్." "తెలుగనకున్న వ్యాకరణపేపము చిన్నది. భారతాదులలో యతిభ్రంశాదిదోషములుగలవి యొకదోషముకాదు. భారతాదుల లేనిపదములు నవనికలవే? అందుచే నిది గ్రామ్యమనియు, దేశ్యమనియు పెనగశక్యంబే?" మన్నగువాక్యములతో తిమ కావ్యనియమముల బేర్కొనియున్నారు. వాడుకపదములను సందర్భోచితముగ నందముగవాడితమ కావ్యముల కసమానజీవకళలను గూర్చియిచ్చిరి. "కూటికి నడ్డకై పరులకొంపకు జేం"——ఎంతబాగుంది?——పద్యమల్లుటలో వీరివృత్తములు సైతము షేక్స్పియర్ గీతముల వైఖరిలో సరళముగ భావానుకూలమగు సంభాషణారీతుల గద్యమువలె రసస్ఫురితములై దుముకుచుండును. వ్యాకరణలక్షణముల బాటింపక వాడుక తెలుగుపోకడల రసవత్పద్యరత్నముల జూపుటయేగాక, గద్యపద్ధతుల సమీపించు పద్యవైఖరుల నేర్పరచి, భావికావ్యారంభములకు దారి జూపిరి. దేవీభాగవతములో దేవపురోహితుడు చంద్రునివాకిట నిలబడి యరచినయర పెంతగద్యసైజ మొప్పుచున్నదో చూడుడు!

ఉ॥ ఔర! దురాత్మ యెంతటి దురాచరణం బొడగట్టి
నావురా! దారను జూడనేగు నను ద్వారమునం దొకం
డాగువాండె? నా నీరజనేత్రి నాయతివ నీకు స్వ
తంత్రమె? నాకుదూరమే?"

ఇట్లులే భారతనాటకములందు పలుతావుల గద్యవైఖరు లందమైన పద్దెముల గన్పట్టుచున్నవి. "పెండిలియాడినన్ పిదప బిడ్డలుపుట్టుట నిశ్చయంబు, నే పెండిలియాడకొంటి,"——"సేనాధర్మము నూతధర్మమును రాశీభూతమై యొప్ప వాచావాత్సల్యముజూపె కర్ణుడిటు మాత్సర్యంబు మీకేల?" "అంచితులైన బందుగుల అందఱిముందర జెప్పి నిన్ను మెచ్చించెద, కుంతి చేత రవి చేతనిజంబని నీకు సాక్ష్యమిప్పించెద, ఫల్గుణప్రముఖవీరులు గొల్వగనెల్ల భూమి యేలించెద.." గద్యవైఖరే కాదు——ఉపన్యాస తీవ్రతయు నిందిమిడియున్నది. పదముల వాడుటలోకూడ స్వాతంత్ర్యమెంతయు ద్యోతకమగుచున్నది. "ప్రాచీన గురుశిష్యపద్ధతి"లో,

"శా॥ బెంచీలక్కఱలేదు గేమ్సు మొదలౌ ఫేటాల్ వినన్ రావు హోమ్వర్కుచున్ నిర్ధను ద్రోచిపుచ్చును" మున్నగు నవ్యభాషాపదప్రయోగములు, సువిదితమైనవి ప్రయోగింపబడినవి. నవీనాంధ్ర రచయితలలో కొందరు సువిదితమగు నవ్య భాషాపదములకు మఱవగాహమగు నాంగ్లపదముల

గల్పించి వాడెడిదురాచారము నీమహాకవులపోకడ ఖండించుచున్నది.

అల్పవిషయముల నందమగువాడుక తెలుగులో గద్యవైఖరులొప్ప పద్యములలో రసభావసౌందర్య మట్టిపడ జిత్రించుటయే గాక, లౌకికపరిజ్ఞానమందును, లోకానుభవమందును వీరు మిన్నలైయున్నారు. జార్జి పట్టాభిషేక సమయమున బ్రచురింపబడిన పద్యావళులన్నిటిలో తిరుపతివెంకటేశ్వరులు సమర్పించు దానియందు దాశీర్వచనమునకు తోడు వందివాక్యములకు జోడుగా, రాజకార్యభార ప్రశంసయు, ధర్మవిరోధమున గల్గనోపెడి యధికార భ్రష్టతయు నెంతెయో లలితవ్యంగ్యరీతుల దెలుపబడినవి. వీరి నాటకములందు,ప్రబంధములందు, అవధానప్రస్తావనములందు గోచరించు కథాసందర్భములు, సంభాషణ వైఖరులు, అసమానమగు లౌకికపంజ్ఞానమును వెల్లడించును. ఉంగరము పోయినప్పుడు వ్రాసినపద్య మెంత నిర్యోగమర్యాదల దూగుచున్నది! సరసాలాపవర్ణనములందునకూడ పూర్వకవిప్రయుక్తమైన వర్ణనల దలమార్చి వాడక, స్వకీయానుభవమునుండియే గూర్చుచుందురు.

చ|| సరసునివైపు వీపు, అలచాన మొగంబటు గోడవైపు,
ఆసరసుడు కేలుచాపు,నలచానయు చన్నులమీద మో
పు, నాసరసుడు కొక్కుచూపు, నలచానతోడం దోడ
లానదోపు,నీనరుసని తెల్లవారె నొకవైఖరికొక్కని
కొక్కవేశ్యతోన్||

తిరుపతి వెంకటేశ్వరుల విఖ్యాతకావ్యములందు వారి యనుభవములే, వారి యహంకారపూరిత వాగ్వైభవములే మిక్కిలి యందముగ దోచుచున్నవి. శ్రవణానందము, పాణిగృహీత, గీరతము, వారి యనుభవసారమును దెల్పుచు నహంకారోద్వేగభరితములై యున్నవి. స్వానుభవములను చిత్రించుటలో, నహంకారమును పద్యనాయకుల బ్రవహింపజేయుటలో, సామాన్యులు హేయముగ రసవిహీనముగ, మాత్సర్యగర్వపూరితముగ జేయుదురేకాని, సరసరీతుల పదనిగ్రహముతో వెలువరింపజాలరు. తిరుపతికవు లీపని యవలీల నొనర్చిరి. "ఎవ్వారిని లక్ష్యపెట్టక యవారణదిగ్విజయం బొనర్చి ప్రజ్ఞానిధులంచు బేరుగొనినార"మను వాక్యములోని నిజప్రతిభాభివర్ణనమందలి దోషము నెల్ల "నీవలనన్ సరస్వతీ" యని భారతీగుణపోషణమునకై వినియోగించిరి. గీరతము తాకినవారిభావము లెట్లున్నను, అందలి యహంకృతులెల్ల సద్ధర్మనిర్వహణార్థమై, లోకహితైకకాంక్షతో నుద్దీపితమైన వాస్తవము చదువరులకెల్ల స్ఫురించును. గీరతకవిత్వము నవీనాంధ్రకావ్యసంకల్పములలోనెల్ల నుత్తమమైనది. మానసకోశమున మెలగుచు, రసభావ పదప్రయోగనైదుష్యమున దురాచారముల జెండాడు సాగస్వతమహారథుల సమరార్భాటము లీ గీరతమున కావ్యవిస్తరత నొందియున్నవి. శ్రవణానందమున, యౌవనవసంతసమాగమమున పులకరించి మొగ్గదొడగిన, కోమలభావకుసుమంబులు, సుధామాధుర్యమీనుచు, సౌందర్యరాసులై తెలుగుపదముల జెన్నొందియున్నవి. రవీంద్రుడు విజ్ఞానకోశమున జల్పించు దేవోపాసి; తిరుపతి వెంకటేశ్వరులు మానసరంగమున స్వానుభవముల నహంకారచోదితులై నిరాఘాటముగ, నిశ్శంకముగ, ఘంటాపథముగ మ్రోయించు కావ్యకర్తలు. వంగీయాధునికమహాకవి సంశయనులప్రోగు; తానెరుగని దాని చెప్పజూచెడివాడు. తెలుగుకైతల క్రొత్తమగలు నిశ్శంకముగ, స్వతంత్రించి, మానసవ్యాపారముల నుద్బోధింపగల యాంధ్రస్వభావవిరాజితులు. తిరుపతికవులు రసభావముల మానసికవిమర్శకులేకాని, యాధ్యాత్మతత్త్వవిజ్ఞాతలు కారు.

తిరుపతి వెంకటేశ్వరులు రచించిన ఇతర కావ్యములు బుద్ధచరిత్ర మొదలగునవి, తమ స్వానుభవోద్దీపకంబులగు శ్రవణానంద గీరతములకు జంకిపోవుచున్నవి. కాని భారత నాటకములందు వీరు దేశమున కత్యంతోపకార మొనర్చిరి. వ్యాసున కందరాని మెఱపులను భారతకవులు చూపియున్నారు. వీరినిమించి తిరుపతికవులు నాటకముల గూర్చినారు. ఈ నాటకములలో కొన్నితావుల పేలపిండి కవిత్వమున్నను, అనవసరముగ పద్యము లనేకములు జేర్చినను, మంచిపట్టుల దివ్యమైన పద్యములు, రసస్ఫూర్తి, కథావిన్యాసము గన్పట్టుచున్నవి. వీరు భారతములోను ఆంధ్ర గీర్వాణములలో గూలంకషముగ జదివి, వివాదాంశముల జక్కగ బంశీలించి, మానసప్రచారవైదుష్యమున పాత్రపోషణ మతినిపుణత నిర్వహించిరి. భారత నాటకములు వెలువడుకాలమున మన తెలుగుదేశములో దేశీయభావ ముదయించుచుండెను. రసపుత్రవీరులగాథలు, శివాజీమున్నగువారి చరిత్రములు, ఓరుగల్లు విద్యానగరముల వీరప్రతాపములు, తెలుగుచదువరుల డెంద మానందపరుచుచుండెను. అట్టిసందర్భములలో తిరుపతికవులు భారతవీరుల విచిత్రచరిత్రముల సర్వజనామోదమగు నాటకములుగ జేసి దేశాభ్యుదయమునకు దోడ్పడిరి. వీరు కొన్ని భారతపాత్రలపట్ల నదివరకు దేశమందుండిన యపోహల రూపుమాపి, వారి నామములకు శాశ్వతకీర్తి నొనగూర్చిరి. వేణీసంహారము మున్నగు నాటకములవలన న్యాయమార్గ మెరుగని కర్ణత్రయంబును వదంతి మిగుల

వ్యాపించియుండెను. తిరుపతికవులు కర్ణునిచారిత్రమును చర్యలను సహేతుకముగ, న్యాయ్యముగ పోషించి, యీ మహాత్మునికీర్తిబింబమును నిష్కళంకముగ నొనగూర్చియున్నారు.

కావ్యనాటకములందు తిరుపతికవు లెట్టిమహనీయసిద్ధినొందిరో, గద్యవిమర్శనమందును, వాదప్రకారములందును అట్టిచక్కని సిద్ధియే పొందియున్నారు. గుంటూరుసీమ, గీరతములందు గోచరించు వ్యవహారదక్షత చిరాభ్యస్త న్యాయవాదులకుగూడ సంతృప్తిపరచుచున్నది. వీరికృతులలో నీశ్వరప్రశంస మిక్కుటముగ, భక్తిపారవశ్యమున గోచరించదు. వీరు లౌకికులు, భాషాసంస్కర్తలు, స్వతంత్రకావ్యనిర్మాతలు, స్వానుభవాహంకార నిరూపకులు, రసికాగ్రగణ్యులు. అంతియే కాని, శాశ్వతలక్షణములు వీరికావ్యములం దెంతవరకున్నవో ప్రస్తుత మూహించజాలము. ఏమైనను శ్రవణానందములోని కొన్నిపట్టులు, మిగిలిన గ్రంథములన్నిటిలోని సుభాషితములు తెలుగువారలగారవమందుచు చిరస్మరణీయములై నిలచియుండుననుటకు సంశయములేదు. భాషాభివృద్ధికిని, యాధునికాంధ్రసారస్వతవ్యాప్తికిని వీరేశలింగ మొకవంకను, తిరుపతికవు లొకవంకను దోడ్పడి, సూత్రధారులై మెలగిరనుటకు సందియముండదు. ఆంధ్రసారస్వతచరిత్రములో వీరెల్లప్పుడు నవీనయుగారంభకులుగ గారవింపబడుదురు. కావ్యనిర్మాతలుగ భావిసంతతు లెట్టిగారవమాపాదింతురో కాలగర్భితమై తెలియకున్నది.

తిరుపతికవుల భాషాసేవ మరపుదగిలినను, వారి కావ్యములు ప్రాచీనశల్యోపమములై యుపకరింపకున్నను, వారి నిత్యచారిత్రము వారి నిరాఘాటప్రచారము, వారిగాథలు, వారిసుగుణములు తెలుగువారిచే నెల్లప్పుడు స్మరింపబడునని నా నమ్మకము. భోజరాజువలె, ఆనందగజపతివలె, కృష్ణదేవరాయునివలె, వీరును తమకథలచే మెప్పించుచుందురు. తిరుపతికవుల నిర్దుష్ట లక్షణపరిజ్ఞానముకన్న స్వతంత్ర భాషాప్రయోగ వైదుష్యమెక్కువ వాసికెక్కినది. వారికావ్యసిద్ధికన్న, మహోదార జీవితచారిత్ర మెక్కువ గారవింపబడుచున్నది. దిగ్విజయములు, అవధానములు, వాదప్రచారములు, సరసప్రబంధరచనలు, మృదుగంభీరహాస్యోపన్యాసములకన్న తిరుపతివెంకటేశ్వరుల లలితమర్యాదలు మిన్నలై నిలిచియున్నవి. పండితసంస్కర్త, రసప్రవక్త, తన వైదుష్యముచేకన్న, కావ్యవిజయములచేకన్న, తన నిత్యాలాప సౌకర్యమాధుర్యమున కాలప్రవాహమున నిలువగలిగియున్నారు, అనుటకు తిరుపతి కవులే నిదర్శనములై యాచంద్రతారార్కమగు కీర్తి ననుభవింతురు.

—పురాణం సూరిశాస్త్రి.

# ఆంధ్ర గ్రంథాలయోద్యమము.

ఇరువదవ శతాబ్దములో నూతనశక్తి యాంధ్రుల నావహించినది. ఈనూతనశక్తి దేశోపయోగమునకై వినియోగపడునట్లుచేయుట మనవిధి. జనసామాన్యము విద్యావంతులు కావలెను. అందుకు మాతృభాషయే పరమసాధనము. మాతృభాషను పెంపొందించుటకు గ్రంథాలయమే మంచిసాధనము. ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమము స్వయంసహాయముపై నెక్కువ యాధారపడియున్నది. ఉద్యమాభిలాషులు కార్యశూరులు కాని వాక్శూరులు గారు. ఆంధ్రదేశగ్రంథాలయోద్యమచరిత్రను మూడుభాగములుగ విభజింపవచ్చును. మొదటిభాగము 1897 సం॥లో ప్రారంభమయి 1914 సం॥లో నంతమొందెను. ఆంధ్రగ్రంథాలయములందు ప్రాచీనములు రెండు. మొదటిదగు తంజావూరు పుస్తకభాండాగారము ఆంధ్రనాయకులచే 17వ శతాబ్దమున స్థాపింపబడి అమూల్యములగు 8 లక్షలగ్రంథములను కలిగియున్నది. రెండవదియగు చెన్నపురి ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారము బ్రౌనుదొరగారి ప్రోత్సాహమున దొరతనమువారిచే డెబ్బదివత్సరములక్రిందట స్థాపింపబడినది. కాని మన దురదృష్టమో యన రెండుగ్రంథాలయములును ఆంధ్రదేశమునకు వెలుపలనున్నవి. ఈరెండుగ్రంథాలయములందును పూర్వకవివిరచితములగు ముద్రితాముద్రితగ్రంథము లనేకములున్నవి.

ఆంధ్రదేశమున ధర్మగ్రంథాలయములస్థాపనకు పూర్వము క్లబ్బులని వ్యవహరింపబడు కొన్ని సంఘములు అచట బయలుదేరినవి. ఈ సంఘములు సాంఘికుల వినోదపరచుటకు మాత్రమే యుపకరించుచుండును. వానియందు యితరులకు ప్రవేశములేదు. 1897 సం॥లో మొట్టమొదట నవీనధర్మగ్రంథాలయము ఆంధ్రదేశమున

స్థాపింపబడినది. భీమవరము తాలూకా కుముదవల్లిలో వెలసియున్న వీరేశలింగకవి సమాజము స్థాపింపబడిన దీవత్సరముననే. ఈసమాజము డైరక్టరుల పరిపాలన క్రింద నున్నది. ఈసంఘమునకు స్వంతభవన మున్నది. ఈ గ్రంథాలయమున ననుబంధముగా మతధార్మికశాఖ లున్నవి. రాజమహేంద్రవరమున 1900 సం. రలో శ్రీయుత నాళము కృష్ణారావుగారిచే నొకధర్మగ్రంథాలయము స్థాపింపబడినది. ఇపు డాగ్రంథాలయము గౌతమీగ్రంథాలయ మనుపేర బరగుచున్నది. ఈ గ్రంథాలయమున నిప్పుడు సుమారు పదిహేనువేల సంస్కృతాంధ్రాంగ్లేయగ్రంథములు కలవు. ఆంధ్రగ్రంథాలయములలో గ్రంథసంఖ్యయందు దీనినే మిన్నయని చెప్పవచ్చును. ఈసంఘ మిదివరలో ననేకమార్గముల ప్రజాసేవ చేసియున్నది. స్వంత భవనమును నిర్మించుటకు నిర్వాహకులు తగుప్రయత్న మొనరించుచున్నారు.

1911 సం నుండియు ధర్మగ్రంథాలయములు దేశమందంతటను వెలయుటకు ప్రారంభమైనవి. ఆంధ్రసారస్వతమునకు నూతనవికాసములగు గ్రంథమాలలు, మాసపత్రికలు స్థాపింపబడి ఈ యుద్యమమునకు దోహదమొసగినది. విశాఖపట్నమున ఆర్షపుస్తకభాండాగారమును, హైదరాబాదు నగరమున ఆంధ్రభాషాభివర్ధనీ సమాజము స్థాపింపబడినది. గ్రామములలోకూడ కొన్ని గ్రంథాలయములు బయలుదేరినవి. గ్రంథాలయనిర్వాహకులు గ్రంథపఠనమున జనుల విద్యావంతుల జేయుటయేగాక పత్రికాపఠనమందిరముల నెలకొల్పియు, రాత్రిపాఠశాలల పెట్టియు, పురాణపఠనము నేర్పరచియు, పోటీపరీక్షల జరిపి బహుమానముల నొసంగుచు ననేకవిధముల విద్యాదానము చేయగడంగిరి.

1914 సం॥ తో నీయుద్యమముయొక్క రెండవ భాగము మొదలిడి 1918 సం॥ రముతో నంతమొందెను. ఈ అయిదుసంవత్సరములలోను ధర్మగ్రంథాలయోద్యమమునకు నామరూపము లేర్పడినవి. 1914 సం॥న బెజవాడ రామమోహన ధర్మగ్రంథాలయమువారికి గ్రంథాలయమహాసభ జరుపవలెనని యుచ్చ వొడమినది. తత్ఫలితముగ ఏప్రియల్ 10 తేదీని ఆనగరమున ప్రథమ ఆంధ్రదేశ గ్రంథాలయమహాసభ బ్రహ్మశ్రీ చిలకమర్తి లక్ష్మీనృసింహము పంతులుగారి యధ్యక్షతక్రింద సమావేశమయినది. ఆసభకు పలుప్రదేశములనుండి 163 గ్రంథాలయములవారు విచ్చేసిరి. ఆమహాసభలో ఆంధ్రదేశమంతటను ధర్మగ్రంథాలయముల స్థాపించుటకును స్థాపించినవానిని పెంపొందించుటకును ఆంధ్రదేశగ్రంథాలయసంఘ మను శాశ్వతసంఘము స్థాపించుటకు తీర్మానింపబడినది. ఈసంఘకార్యస్థానము బెజవాడ రామమోహనగ్రంథాలయమునం దుండుటకును సంఘపక్షమున నొకపత్రికను ప్రచురించుటకును ఆంధ్రగ్రంథవిభజనపట్టికను తయారుచేయుటకును, మాజికలాంతరు కొనుటకును, సంచారకార్యదర్శిని ఏర్పాటుచేయుటయునుకూడ నాసభయందే తీర్మానింపబడినది. అదిమొదలు ఏటేట రాజమహేంద్రవరము, నెల్లూరు, బారువ, విశాఖపట్టణము, చెన్నపురి, మహానంది గ్రామములలో గ్రంథాలయసభలు జరుగుచు వచ్చినవి. ఈసంఘకార్యదర్శులగు మా అయ్యంకి వేంకటరమణయ్యగారు వ్యయప్రయాసకలకోర్చి, తమ స్వంతపనులనుగూడ మాను కొని 1914, 1915 సంవత్సరములలో అనేకగ్రంథాలయముల దర్శించి తగుసలహాల నొసంగియుండిరి. వారు ప్రతిమండలసభ కరిగి గ్రంథాలయముల తీర్మానములు ఆమోదింపజేయుచుండిరి. అందువలన కొన్ని నూతనగ్రంథాలయములు స్థాపింపబడినవి. మండలసంఘములు వెలసినవి. ఆంధ్రగ్రంథాలయములచరిత్ర సమగ్రముగా ప్రకటింపబడినది.

1916 సం॥న గ్రంథాలయ సర్వస్వమను పత్రిక ప్రకటించుటకు ప్రారంభించిరి. ఈపత్రిక ఉద్యమనిర్వాహకులకు చాల సహాయమొనర్చుచున్నవిషయము నిర్వివాదాంశము. ఈ పత్రికవలన ప్రతివత్సరము నష్టము వచ్చినను భరించి సజీవముగానుంచిన కార్యదర్శిగారి పట్టుదల నెంతయు కొనియాడవచ్చును. ఈసంఘమువారు ఆంధ్రదేశముననేగాక ఇతర స్వదేశసంస్థానములందును తమయుద్యమము వ్యాపించుటకు తగుకృషి సలిపియుండిరి. కార్యదర్శిగారు 1917 సం బరోడానగరమున జరిగిన గ్రంథాలయప్రదర్శనము చూచివచ్చి ఆంధ్రదేశమునను అట్టి ప్రదర్శనమును సమకూర్చుచున్నారు. గ్రంథాలయమునకు వలయు సర్వోపకరణములును అందు ప్రదర్శింపబడును. ఆప్రదర్శనము ప్రతియాంధ్రుడును చూచి తీరవలసినది. 1918 సం॥న విశాఖపురియందు అయిదవ గ్రంథాలయమహాసభ సమకూడినది. ఆసభయందు బెజవాడ రామమోహన ధర్మగ్రంథాలయమును ఆంధ్రదేశమునకు కేంద్రగ్రంథాలయముగా పరిగణించుటకు తీర్మానింపబడినది. రామమోహన గ్రంథాలయమునకు విశాలమగుస్థలమును పన్రెండువేలరూప్యముల వెలగలయము స్వంతభవనమును కలవు.

1918 వ సం॥ రాంతమునకు గ్రంథాలయములసంఖ్య 475 వరకు పెరిగెను. 15 గ్రంథాలయములు స్వంత

భవనములనిర్మించుకొనినవి. కేంద్రగ్రంథాలయస్థాపనానంతరము మండల గ్రంథాలయముల స్థాపింపవలెనను నభిలాష యుద్యమనాయకులకు జనించినది. ఆసమయమున శ్రీయుత వావిళ్ల వేంకటేశ్వర్లుగారు తమ యుదారభావమును వెల్లడించిరి. ఆంధ్రదేశమున స్థాపింపబడు ప్రతిమండల గ్రంథాలయమునకును తమచే ప్రకటింపబడిన 600 రూప్యముల విలువగల గ్రంథములసెట్టు నుచితముగా నిచ్చుటకు వాగ్దానముచేసిరి. ముందు ప్రకటింపబోవు వానినిగూడ తా మొసగుటకు అభ్యంతరము లేదనిరి. కొందరు కవులును వారిమార్గము ననుసరించిరి.

1919 సం॥ తో మూడవభాగ మారంభమయినది. ఈవత్సరమున నూతనగ్రంథాలయములు, మండలసంఘములు స్థాపింపబడినవి. నవంబరు నెలలో చెన్ననగరమున ఆంధ్రగ్రంథాలయ మహాసభ జరిగినది. ఆసమయముననే అఖిలభారత గ్రంథాలయసభ సమావేశపరుపబడినది. ఈవత్సరమున ప్రత్యేకవ్యక్తులవలన గ్రంథాలయోద్యమమును తెల్పు రెండు చిన్నపొత్తములు ప్రకటింపబడినవి. వానిలో శ్రీ నూరి నృసింహశాస్త్రిగారు ఆంగ్లమున ప్రచురించినగ్రంథము ఉత్తమమయినది. ఆగ్రంథప్రచురణమువలన యితరరాష్ట్రములవారికి మన యుద్యమప్రాశస్త్యము గ్రహించుటకు వీలుకలిగినది. 1919 సం॥ రాంతమునకు గ్రంథాలయముల సంఖ్య 586 వఱకు వృద్ధినొందినది. 1920 సం॥ నీసంఘపక్షమున ప్రచారకులను తయారుచేయుటకు పాఠశాల యేర్పరుపబడెను. ప్రతి ధర్మగ్రంథాలయమునకును సద్గ్రంథములను తక్కువ వెలకు లభింపజేయుటకు ముద్రాశాల స్థాపించుట యవసరమని తోచి. కార్యదర్శిగారు చాల ప్రయత్నమొనరించిరిగాని దైవమనుకూలింపదయ్యెను. మహానందిలో సభ సమావేశమయినది. పిమ్మట దేశమంతయు రాజకీయోద్యమముతో నిండిపోయినది. ఇతరఉద్యమములు తల యెత్తుటకు వీలుకలిగినది గాదు. అందువలన, గ్రంథాలయోద్యమము మందగించినది. పలువురు గ్రంథాలయసేవకులు శ్రీకృష్ణజన్మస్థానము నలంకరించిరి. శ్రీయుత అయ్యంకి వేంకటరమణయ్యగారు తమయారోగ్యమును కోల్పోయియుండిరి. తిరిగి యిప్పుడు ఆరోగ్యవంతులై యున్నారు. రాజకీయరంగమున నిర్మాణభాగము సాగుచున్నది. గ్రంథాలయోద్యమము తిరిగిన తొల్లిటి యుత్కృష్టతను బొందవచ్చును. ఈ మూడుసంవత్సరములలోను కొన్ని గ్రంథాలయములు నశించినవి. ప్రస్తుతము రమారమి 600 గ్రంథాలయము లుండవచ్చును. కార్యదర్శిగారు గ్రంథాలయసర్వస్వమును మాసపత్రికగా ప్రకటించుటకు ప్రారంభించినారు. మ॥ వెలిదండ శ్రీనివాసరావుగారిచే ప్రారంభింపబడిన గ్రంథవిభజనము శ్రీయుత కాశీనాథుని నాగేశ్వరరావుగారు పూర్తిచేయించుచున్నారు. కావ్యనిధి చెలికాని లచ్చారావుగారు గ్రంథాలయవార్షికోత్సవసంచికలను ప్రకటించుచున్నారు. కృష్ణామండలమునకు మండలగ్రంథాలయము మొన్ననే స్థాపింపబడినది. గుంటూరుమండలమున గ్రంథాలయమహాసభ సమకూడనున్నది. ఆంధ్రదేశమునకూడ స్వార్థత్యాగులు బయలువెడలుచున్నారు. కాశీజీవంటి కోటీశ్వరులును, గైక్వారువంటి విద్యాభిమానులును లేరని నిరుత్సాహపడకుడు. ప్రతిపల్లెయందును ధర్మగ్రంథాలయస్థాపన గావింపుడు. విద్యవెదజల్లి జనసామాన్యము యొక్క యజ్ఞానమును పారద్రోలుడు. మన మేరూపమున నీశ్వరుని ధ్యానింతుమో ఆరూపముననే ఆయన మనకు దర్శన మిచ్చితీరును.

"శ్లో॥ యో యో యాం యాం తనుం భక్తః
శ్రద్ధ యార్చితు మిచ్ఛతి
తస్య తస్యా చలాం శ్రద్ధాం
తా మేవ విదధామ్యహమ్॥"

—యాతిగిరి లక్ష్మీవేంకటరమణ.

# కథ - కలాపము.

## గ్రంథాలయములకు భవననిర్మాణము.

ఆంధ్రదేశమున జాతీయప్రబోధము ముఖ్యముగా గ్రంథాలయముల మూలముననే జరిగినది. ఈ ప్రబోధము కేవలము పాలమీది పొంగువలె వెంటనే సమసిపోకుండ దినదినప్రవర్ధమానమై జాతికి పుష్టినిచ్చుటకు గ్రంథాలయములు చిరస్థాయిగానుండి తమవిధులను నిర్వర్తించుచుండవలెను. ఇందుకు ముఖ్యము గ్రంథాలయములకు భవననిర్మాణము. ఏయుద్యమమైన శాశ్వతముగా నుండవలెనన్న దానికి శాశ్వతమగు సాధనములు కొన్నియుండవలెను. గ్రంథాలయమునకు భవన మట్టి సాధనము. ఇందుకొరకై మనయాంధ్రదేశమున కొంతకాలముక్రిందట తీవ్రమగు ప్రయత్నములు జరిగినవి. కొన్నిసంఘములు స్వంతభవనములు నిర్మాణముచేసుకొనియున్నవి. కొన్నిచోట్ల చందాపట్టీలు ప్రారంభించి కొంతసొమ్ము వసూలై ఏగ్రామపెద్దలవద్దనో నిలవయుంటూ యున్నది. కొన్నిచోట్ల భవననిర్మాణము ప్రా

రంభమై కొంతవరకు పనిజరిగి కారణాంతరములచే పని నిల్చిపోయి అసంపూర్తియగు భవనము గ్రామమునకు దిష్టిబొమ్మలుగా నిల్చియున్నవి. ఈయసంపూర్తి ప్రయత్నములను తిరిగి చేపట్టి భవననిర్మాణము పూర్తిచేయుట ముఖ్యముగ చేయవలసినపని.

ఇందునుగూర్చి తగినఉత్సాహము ప్రజలలో కలుగవలసియున్నది. గ్రంథాలయములయొక్క అవసరావశ్యకతలనుగూర్చి మొదటినుండియు మేము చాటుచునే యున్నాము. ఆంధ్రలోకమునకు ఈయంశమునుగూర్చి తిరిగి నొక్కిచెప్పినచో ఆంధ్రులను అగౌరవము చేయుటయే కావున అట్టిపని ఇక్కడ పూనుకొనుటలేదు. అయితే ఒకయంశముమాత్రము మేమిచ్చట చెప్పవలసియున్నది. మనదేశమందిప్పుడు రాజకీయజీవనమున అనేకకక్షలు బయలుదేరి ప్రజలను చీకాకుపరచుచున్నవి. ఈకారణములచే ప్రజలయందు అంతఃకలహము లేర్పడియున్నవి. ఇందుచే చాలప్రదేశములయందు ప్రజలకు ఐక్యభావము కుదరక ప్రజాసామాన్యమునకు సంబంధించిన పనులేవియు జరుగుటలేదు. ఇందువలన దేశాభివృద్ధికి ప్రజలయందుండవలసిన సామరస్యమునకు గొప్పకీడు వాటిల్లుచున్నది. ఇట్టితరిణమున ముఖ్యముగా కొన్నిసంగతులను స్మృతికి తెచ్చుకొనుట యావశ్యకము. మనదేశపు దురదృష్టమదేమియోగాని ఇద్దరుపురుషులకు పదియంశములయందు ఏకప్రయోజనముండి ఒకయంశమున విరుద్ధప్రయోజనమున్నచో విరుద్ధప్రయోజనాంశమునే పట్టి పట్లార్చి తన్మూలమున ఉభయులమధ్యను శాశ్వతమగు వైషమ్యమును పెంపొందించుకొందురేగాని ఐక్యప్రయోజనముల నాధారము చేసుకొని స్నేహభావమును వృద్ధిపఱ్చుకొనరు. కేవలము ఇందుకు ప్రజలను నేరపెట్టనవసరములేదు. మనదేశమునం దేర్పడిన విషమపరిస్థితులే ఇందుకు కారణము. అట్లయ్యును, మనదేశము శాశ్వతముగా ఇట్టిదురవస్థయందుండవలసినదేనా? దీనినుండి విముక్తి ఎప్పుడైనను యున్నదా? దేశమున విద్య వ్యాపించినకొలది ప్రజలు తమ బాగోగులను గుర్తెరుగుదురు కదా! 'పోరునష్టము, పొందులాభము' అని చిన్ననాటనుండి యెరిగిన యార్యోక్తికదా! అట్టిచో విరోధముగల విషయమునకుమాత్రమే అట్టి భావమును కట్టిపెట్టి, ఏకాభిప్రాయముగల విషయము లన్నిటియందును మనవారందరును ఐకకంఠ్యముగా కృషిచేసి ఏల అభ్యుదయమును పొందకూడదు? పూర్వము మన దేవాలయములును గ్రామసంఘములును ప్రజలయందు ఐక్యభావమును వృద్ధిపరచుచుండెను. మొదటిదానియందు విద్యాగంధము కలవారని చెప్పుకొనువారిలో చాలమందికిపుడు నమ్మకములేదు. రెండవది రూపుమాసినది. ఇప్పుడు ప్రజలందరు ఏకత్ర సమావేశమగుట ఎక్కడ? తమకందరకు కావలసిన విషయములను, చర్చించి నిర్ణయించుకొనుటకు సావకాశమేది? ప్రజలయందు ఆత్మగౌరవము ఆత్మశక్తిని విజృంభింపచేసుకొను మార్గమెద్ది? ఇట్టిసద్గుణములు ప్రజలయందు సుస్థాపితములైనపుడుగదా! "జస్టిసు" పార్టీవారును లిబరల్ పార్టీవారును, చెప్పునట్లు తగిన ప్రతినిధులను ప్రజలు ఎన్నుకొనుట తమప్రతినిధులను తమకు స్వతంత్రవాదులుగా చేసుకొనుశక్తి ప్రజలయందుద్భవించుటయు జరుగునది. కాంగ్రెసుపార్టీవారు కోరునట్లు ప్రతిగ్రామమునందును కాంగ్రెసుసంఘము లేర్పడి వారి నిర్మాణకార్యక్రమమును, దేశమందు సాగించుట జరుగునదియు అప్పుడేగదా? ఈపైనచెప్పిన ఉభయపక్షములవారికిని గ్రామమందలి ప్రజలందరు ఏకత్ర సమావేశమై జ్ఞానమును సంపాదించుకొనుటకును, తమకు కావలసిన విషయములనుగూర్చి చర్చించుకొని తీర్మానములు చేసికొనుటకును గ్రామస్థులందరికిని హక్కుగల భవనమొకటి యుండవలెను. నాగరకతగల ప్రతిదేశమందును ఇట్టి కూడలిస్థలము (భవనము) గ్రామజీవనమందు ముఖ్యస్థానము నాక్రమించియున్నది. కావున ఓజస్టిసుపక్షపునాయకులారా! మీకున్నదని చెప్పబడు పలుకుబడిని మీరు వినియోగించి ప్రతిపల్లెయందును పట్టణమందును గ్రంథాలయ భవనములను నిర్మాణము చేయింపుడు. ఓ కాంగ్రెసునాయకులారా! ప్రజలు మీతోనున్నారనికదా మీరు చెప్పుచున్నారు. అట్టిచో ఈభవనముల నిర్మాణము చేసి తన్మూలమున మీయుద్యమము స్థిరపరుచుకొనుడు.

## అఖిలభారత గ్రంథాలయ ప్రతినిధి మహాసభ.

1920సంవత్సరములో చెన్నపట్టణములో ఈసభ మొదటగా జరిగెను. ఇందుకు ముఖ్యకారణభూతులు ఆంధ్రులే. అట్లయ్యును, మద్రాసుపట్టణమందలి ఇతర ప్రముఖులనుగూడ చేర్చుకొని సభ జయప్రదముగా నిర్వర్తింపబడెను. ఆసభకు అగ్రాసనాధిపతులగు, జె. ఎస్, కుడాల్కర్ గారు బరోడాసంస్థానపు గ్రంథాలయ శాఖాధ్యక్షుడు. రెండవసభను బరోడా కాహ్వానింపబడునను సూచనను వారు చేసియుండుటచే ఆసభయందు తిరిగి ఎక్కడ రెండవసభ జరగవలసినదియు ఎప్పుడుజరగవలసినదియు కూడ తీర్మానింపబడలేదు. దురదృష్టవశముచే కుడల్కారుగారు పిన్నవయస్సులోనే మరణించిరి. అఖిలభారత గ్రంథాలయప్రతినిధి మహాసభ సమావేశమునుగూర్చిన ప్రశంస తిరిగి చేయువారే లేరైరి.

మనయదృష్టవశమున రాబోవు డిశంబరులో మన యాంధ్రదేశమున కాకినాడపట్టణములో దేశీయమహాసభ సమావేశము కానున్నది. ఆసందర్భమున ఆంధ్రగ్రంథాలయోద్యమ ప్రచారకులందరును పూనుకొని రెండవ అఖిలభారతసభను సమావేశముచేయుట ముఖ్యకర్తవ్యము. ఇట్టిసూచనలు ఇదివరకే ఆంధ్రగ్రంథాలయసంఘమునకు వచ్చుచున్నవి. గ్రంథాలయోద్యమము యొక్క ప్రాముఖ్యత భారతదేశమందంతటను దశదశలను, అంగీకరించబడియే యున్నది. గడచినపంచికలో ఈయుద్యమము దేశమంతటను వ్యాపింపచేయుటకు దర్భాంగా సంస్థాన భాండాగారికులగు గుహఠాకూరుగారు చేసిన సూచనలు ముద్రించియుంటిమి. గయలో జరిగిన జాతీయమహాసభతోపాటు అఖిలభారత గ్రంథాలయసభ జరుపవలెనని ప్రయత్నములు జరిగినవి. కాని అట్టి సభసమావేశము కాలేదు. దేశమందంతటను నూతనగ్రంథాలయములు వెలువడుచున్నవి. ఇదివర కేర్పడియున్న సంస్థాపనలు చేయుచున్న కృషినిగూర్చియు, పత్రికాముఖమున తెలుసుకొనుచున్నాము. ఇట్లు పలుప్రదేశముల జరుగుచున్న పనిని ఏకముఖమునకు తెచ్చి భారతదేశమందలి గ్రంథభాండాగారులు ఏకత్రసమావేశమై తమ కర్తవ్యమును నిర్ణయించుకొనుట అవసరముగ చేయతగినపని. అఖిలభారతసభ మద్రాసుపట్టణమున జరిగినపుడు అఖిలభారతగ్రంథాలయసంఘ మొకటి నిర్మాణముచేయుటకు తీర్మానింపబడినది. అందుకొరకై చిత్తుచట్టములు వ్రాయబడి. అభిప్రాయముకొరకు పంపబడినవి. పిమ్మట అట్టిసంఘము నిర్మాణమైనట్లు ఊహించతగియున్నది. ఈ సంఘమునకు మద్రాసు నారాయణ మొదలివీధిలో వసంత గ్రంథాలయమునకు సంబంధముగల ఎన్, ఎన్, రాయనుగారు తాత్కాలిక కార్యదర్శి. వీరీసంఘమును పునరుద్ధారణచేయుటకు ప్రార్థితులు. ఆంధ్రగ్రంథాలయోద్యమాభిమానులందరును తమ విధులను గుర్తెరిగి కాకినాడయందు అఖిలభారతసభను సమావేశపరచి జయప్రదముగా నొనరించుటకు కోరుచున్నాము.

## హిందూయువజనగ్రంథాలయము-ఏలూరు.

ఈసంఘము ఇతరపట్టణములయందువలె ఇంగ్లీషు విద్యార్థులచే స్థాపింపబడి వారలచే నడిపింపబడుట లేకుండ వర్తకశిఖామణులచేతను భూస్వాములచేతను స్థాపింపబడి వారలచే నిర్వహింపబడుచున్నది. ఆంగ్లేయ విద్యార్థులు ఇందు సభ్యులుగా లేకపోలేదుగాని వారి యాజమాన్య మిందు చాలతక్కువ. ఇదియే ఆదర్శప్రాయమగు విషయము. పౌరగ్రంథాలయములు ప్రజాసామాన్యమునకొరకై యవతరించిన ప్రతిష్ఠాపనలు. వానివలన నిజమైన యుపయోగము కలుగుటకు వానియాజమాన్యము సామాన్యప్రజలయందే సంక్రమించియుండవలెను. ఈ సంఘమున కిదివరకు స్వంతభవనములేదు. లక్ష్మీపుత్రులును ప్రజాహితకార్యములకు ఉదారభావముతో ద్రవ్యసహాయము చేయువారును అగు మోతే గంగరాజుగారిని ఈసంఘమువారు ప్రార్థించి భవనమును నిర్మించుటకువారివలన వాగ్దానమును ఈసంఘమువారు తీసికొనిరి. స్థలమును సంఘమువారు మ్యునిసిపాలిటీవారినికోరి సంపాదించుకొనిరి. అందుపై గవర్నమెంటువారికికూడ హక్కు కలదు. ఆహక్కులు ఎంతవరకు వారు చెలాయించెదరో ముందు నిర్ణయించుకొనకుండ అవిచారితముగా తాము సంపాదించుకొన్న స్థలములో శ్రీ గంగరాజుగారిచే ఈసంఘమువారు భవననిర్మాణము ప్రారంభించిరి. భవనము అతివిశాలము. కడురమణీయము. పట్టణమునకు నడిబొడ్డున యున్నది. పురమునకు నాయకమణిగానుండి అత్యంత శోభ నొనగూర్చగలదు. ఇట్టి భవనముపై పదిపదునైదువేలవరకు ద్రవ్యము దాతలు వెచ్చించినపిదప భవనపుస్థలముమీద నాలుగువందలపైచిల్లర పన్నును గవర్నమెంటువారు విధించినట్లు ఉత్తర్వువచ్చినది. అంతటితో భవననిర్మాణ మాగిపోయినది. నిల్వయున్న కారురాయి వగైరాలనమ్మి ఈసంవత్సరపుపన్నును కట్టిరి.

ఇదియంతయు ఎక్కువ విషాదకరము. దొరతనమువారవలంబించిన దారుణకృత్యమునకు కారణమూహించగా సంఘమున యసహాయవాదులు సభ్యులుగానుండుటయే యని తెలియుచున్నది. ఇదియేనిజమైనచో ఇట్టిపనిదొరతనమువారి హ్రస్వదృష్టిని చూపుచున్నదిగాని వారికుండితీరవలసిన విశాలభావమును తెలుపుటలేదు. దొరతనమువారు చూడవలసినది గ్రంథాలయపక్షమున జరుగు కృషిఏది? అందు రాజద్రోహ పూరితమగునదేమైన యున్నదా? అంతియగాని సంఘమందలిసభ్యుల కులమేది? వారిస్థితిగతులేమి? వారిరాజకీయాభిప్రాయము లెట్టివి? యనువిషయములెన్నటికిని కాకూడదు. నేటిదినమున అసహాయవాదు లీసంఘమున సభ్యులుగానున్నారు. రేపు వీరందరును రాజభక్తిపూరితులు కావచ్చును; లేదా ఇప్పటివారందరును సభ్యత్వము మానుకొని రాజభక్తులే అందు సభ్యులు కావచ్చును. గ్రంథాలయసంఘము శాశ్వతమైనది. దానియాశయములు సర్వజన సమ్మతమైనవియు, అవశ్యమనుష్ఠింప తగినవియునై యున్నవి. దొరతనము నిజముగా ప్రజలహస్తగతమైయున్నప్పుడు పౌరగ్రంథాలయములు ముఖ్యముగా

గవర్నమెంటువారే పూనుకొందురు. అట్టిపనిని యిప్పుడు ప్రజలు పూనుకొని నిర్వహించుకొనుచున్నారు. అట్టిచో ప్రజలకు గవర్నమెంటువారు తగుసహాయము చేయుటకు మారుగా భవనముపూర్తియగుటకు నంతరాయములు కలుగ జేసిరి. ఇట్టి స్థితిగతులయందు కర్తవ్యమునుగూర్చి గ్రంథాలయసోదరులు చర్చించెదరని ప్రార్థన.

## నైజాము ఆంధ్రులు.

నైజాము రాష్ట్రమునందున్న ఆంధ్రుల స్థితి వలసబోయినవారివలెనే యున్నది. వారిమంచిచెడ్డలు పోయిన దేశము వారి కక్కరలేదు. పంపినదేశము వారేమియు చేయజాలరు. రాజకీయవిషయములందేమి, భాషావిషయమందేమి, మతవిషయమందేమి, వారు చాల వెనుకబడియున్నారని అందరికిని తెలిసిన విషయమే. ఈవిషయమై ఆంధ్రనాయకు లెల్లరు మూకీభావమును వహించియుండుట మిక్కిలి శోచనీయము. తుదకు ఆంధ్రసాహిత్య పరిషత్తువారికిగూడ ఈరాష్ట్రమునందున్న ఆంధ్రఅముద్రిత వాఙ్మయమునందైన దయగలుగకుండుట దేశముయొక్క దురదృష్టమనవలసినదేగాని వేరుగాదు. కొంతకాలము శ్రీ శేషాద్రి రమణకవులను నియోగించి నైజాము రాష్ట్రమునందున్న ఆంధ్రగ్రంథములను సేకరింప జేసిరి. ఆకాలమున వారు అమూల్య గ్రంథములను సేకరించియే యుండిరి. ఏకారణముచేతనో కొలదికాలముననే ఆ కార్యమును విరమించిరి. బహుశః ద్రవ్యాభావముచేనై యుండును. కడచినవత్సరము పిఠాపురమునందు జరిగిన ఆంధ్రసాహిత్యపరిషత్తు వార్షికోత్సవసమయమునందీవిషయము యోచింపవలసినదిగా కొందరు నైజాముఆంధ్రులు విన్నపమును బంపికొనియున్నను, ఈవిషయము యోచనకురాలేదు.

ఎవరికాళ్ళమీద వారు నిలవనిది మోక్షము లేదను సంగతి నైజాముఆంధ్రులు గ్రహించినవారై, "నైజాము రాష్ట్ర ఆంధ్రమహాజనసంఘము"ను స్థాపించి, అన్నివిధముల అభివృద్ధిని బొందుటకై కృషి సలుపుచున్నారు. ఈవిషయమై శ్రీ మాడపాటి హనుమంతరావుగారు, ఇంకను మరికొందరు యువకులును తదేకనిష్ఠతో కార్యసాఫల్యమునకై గడంగియున్నారు. రైలుస్టేషనునకు 50, 60 మైళ్ళదూరమునందున్న గ్రామములందు రెండు ఆంధ్ర వారపత్రికలు అప్పుడే బయలుదేరి పనిచేయుచున్నవి. అముద్రితగ్రంథసేకరణ విషయమునను, చారిత్రిక పరిశోధన విషయమునను పనిజేయుటకై ప్రయత్నించుచున్నారు. వీరి ప్రయత్నములు జయప్రదములగుగాకయని కోరుచున్నాము.

## శ్రీ గణపతి గ్రంథాలయము, కాకినాడ.

ఈగ్రంథాలయవార్షికోత్సవసమయమున శ్రీ బులుసు సాంబమూర్తిగారు తమ అధ్యక్షోపన్యాసమునందు ఆధునిక గ్రంథాలయోద్యమమును గురించి గత పదిసంవత్సరముల యభివృద్ధియు, ఆంధ్రదేశమున అచ్చటచ్చట గ్రంథాలయ మహాసభలు జరుపబడుటయు భారతవర్షములోని కెల్ల బరోడా తరువాత ఆంధ్రదేశము గ్రంథాలయాభివృద్ధియందు మిన్నగానుండి వన్నెకెక్కియున్నదనియు గ్రంథాలయముల స్థాపనము మనదేశమునకు నూతనవిషయము కాదనియు ప్రాచీనమునుండి స్థిరపరుపబడియున్నవనియు ఖండాంతరవాసులకు ఆదర్శములై జూపట్టెననియు విపులముగా జెప్పిరి. ఇటీవల గ్రంథాలయోద్యమము రెండుమూడు సంవత్సరములనుండి విజృంభణము తగ్గినట్లు కనిపించుటకు కారణముల విమర్శించిరి. ఇందు యుత్సాహపరులై పనిచేయుచుండిన యువకులు రాజకీయవ్యవహారములందు పనిచేయుటచేత గ్రంథాలయములందు పట్టుదల తగ్గిపోయినదనియు ఈయుద్యమనాయకులలో కొందరు పెద్దలు బాలభటోద్యమమునందును మరికొందరు రాజకీయ ఆందోళనమునందును దిగుటచేత గ్రంథాలయాభివృద్ధి తగ్గుటకు హేతువగుచున్నదనిరి. సామాన్యమగు ఆంధ్రగ్రంథములేగాక హిందీ పుస్తకములు సమకూర్చవలసినదనియు, సంచారపు కార్యాలయములు ముఖ్యముగ నుండవలసినవనియు కాంగ్రెసు యిక్కడ జరుపబడును గనుక యీలోపుననే సంచార గ్రంథాలయము ఒకటి ఇక్కడ నెలకొల్పబడవలసిన యవసరమున్నదనియు యిట్టిధనికుల సహాయముండినపుడు యిదియొక విశేషము కాదనియు హెచ్చరించిరి.

## ఆంధ్రదేశగ్రంథాలయ ప్రతినిధుల మహాసభ.

ఈసభ మే నెల 1,2,3 తేదీలయందు "పమిడిపాడు" గ్రామమున ఆంధ్రరత్న దుగ్గిరాలగోపాలకృష్ణయ్యగారి అధ్యక్షతక్రింద జరుపబడును. శ్రీగోపాలకృష్ణయ్యగారి ఆధిపత్యముక్రింద ఈసభ నూతనమార్గముల ద్రొక్కి ఆంధ్రదేశాభ్యుదయమునకు తోడ్పడుగాక!

కడచినసభ జరిగి మూడుసంవత్సరముల కాలమైనది. అందుచేత ఆలోచించి సిద్ధాంతీకరింపవలసిన విషయము లెన్నియో కలవు. గ్రంథాలయసోదరులు దీక్షాపరులై దేశకళ్యాణము నొడగూర్చెదరు గాక!

67

# ఆంధ్రకర్మాగారము, లిమిటెడ్,

## గుంటూరు

1913 సం॥ ఇండియన్ కంపెనీల ఆక్టుక్రింద రిజష్టరీచేయుబడినది.

మూలధనము రు 5,00,000.

వాటాలు 50,000 లు. వాటా 1కి రు 10 మాత్రిమే. దరఖాస్తుతో 1 రూపాయిన్ని, షేర్లు మంజూరు అయినవెంటనే రు 3 న్ను, పిమ్మట రెండేసిమాసములకు తక్కువకాని వ్యవధితో దఫాకు రు 2 లు చొప్పున మూడుదపాలుగాను వసూలు చేయుబడును.

## డైరక్టరు.

1 మోతే నారాయణరావుగారు,
జమీందారు; డైరెక్టరు ది డక్కన్ మిల్లుస్టోర్సు బెజవాడ; ఏలూరు.

2 మోతే నరసింహారావుగారు,
జమీందారు; డైరెక్టరు ది డక్కన్ మిల్లుస్టోర్సు బెజవాడ; ఏలూరు.

బాకురుపండా వెంకిటరమణమూర్తిగారు, జమీందారు, విశాఖపట్టణము.

టి యస్. మహమ్మదు హుస్సేన్‌సాహేబు బహద్దూరుగారు బి. ఏ.
రిటైర్డు అసిష్టాంటు ఇన్‌స్పెక్టరు ఆఫ్ స్కూల్సు; ఢిల్లి లెజిస్లేటివ్ అసెంబ్లి మెంబరు; ప్రిసయిడింగు మాజస్ట్రీటు ఫస్టుక్లాసు బెంచి; గుంటూరు.

5 శంకర వెంకటాద్రిపంతులుగారు, ఎల్. ఎం. అండు యస్. గుంటూరు.

6 రుద్రవరపు కాశీపతిరావుగారు, ప్రొప్రైటరు, గుంటూరు.

7 నూకా వెంకటరత్నంగారు,
మర్చంటు; బ్యాంకరు; డైరెక్టరు తెనాలి వెంకటేశ్వర రయిసుమిల్లు; గుంటూరు.

నేరెళ్ళ వెంకట సుబ్బారావుగారు, మర్చంటు; బ్యాంకరు; గుంటూరు.

పాతకమూరి వీరబ్రహ్మంగారు, ప్రొప్రైటరు పి. యం. పండిత అండుసన్; గుంటూరు.

బలిజేపల్లి లక్ష్మీకాంత కవిగారు; గుంటూరు.

నడింపల్లి వేంకట లక్ష్మీనరసింహారావు పంతులుగారు, ఎం. ఏ. ఎల్. ఎల్. బి;
బార్-ఆట్-లా; ఏజంటు కలకత్తా రాయుకట్ ఇండస్ట్రియల్ బ్యాంకి, గుంటూరు బ్రాంచి;
డైరెక్టరు ఆంధ్రగ్రంథాలయ ప్రెస్ లిమిటెడ్, బెజవాడ; ప్రొప్రైటరు; గుంటూరు.

దేశమునందలి ఐశ్వర్యమునకు పరిశ్రిమలే మూలాధారములు. ఈకంపెనీలో తీసికొనుటవలన దేశమునకు లాభము, మీకులాభము.

వరములకు ఇట్లువ్రాయుము:--

మేనేజింగు డైరెక్టరు, ఆంధ్రకర్మాగారము, లిమిటెడ్, గుంటూరు.

RSVMO1 A122


# ఎనిమిదవ ఆంధ్రదేశ గ్రంథాల
# ప్రతినిధుల సభ.

## మే **1, 2, 3,** తేదీలయందు జరుగును.

అయ్యా, ఎనిమిదవ ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల
మే నెల 1, 2, 3, తేదులయందు "పమిడిపాడు" గ్రామమున ఆంధ్రర
గోపాలకృష్ణయ్యగారి అధ్యక్షతక్రింద జరుపబడును. ఆంధ్రదేశాభ్యు
మూలకందమగు గ్రంథాలయోద్యమముయొక్క భావికార్యవిధానమును
పవలసియున్నది. కావున తాము వచ్చుటయేగాక తమ గ్రంథాలయము
నంతమంది ప్రతినిధులు విచ్చేయునటుల చేయుదురని ప్రార్థన. తాము
వచ్చునదియు తెలియజేయగోరెదము. ఇట్లు విన్నవించు విధేయులు,

పత్రి అనంతరావు. బెల్లంకొండ రాఘవరావు.

కుప్పా శ్రీరామశర్మ, 16-4-23. తాడేపల్లి సంపూర్ణ లక్ష్మినా

---

బెజవాడనుండి గుంతకల్లునకు పోవు రైలుమార్గమున, నర్సారా
నకు 3 మైళ్ళదూరమున "పమిడిపాడు" గ్రామమున్నది. ప్రతినిధులంద
30-వ తేదీ రాత్రి "నర్సారావుపేట" కు చేరు రైలుమీద వచ్చిన సౌ
నుండును. స్టేషనువద్ద వాలంటీయరులును, బండ్లును సిద్ధముగానుండును
రుసుము రు 0-8-0 లు. భోజనవసతి ఉచితము.

---


## ఫ్రెండ్సు కంపెని
బెజవాడ.

అన్నివస్తువులు సరసమైన ధరలకు కావలయుననిన ఫ్రెండ్సుకం
దయచేయుడు. ఫౌంటెన్ పెనాలకు, తలనూనెలకు, సెంటులకు, తెలు
లకు, సిగారు లైటరులకు, ఎలిక్ట్రిక్ దీపములకు, లేసులకు, పన్నీరు
సామానులకు ఫ్రెండ్సుకంపినీకే వెళ్ళుడు.

**మనసు ఫౌండేషన్**

**పుస్తకాల పరిశీలనాపట్టిక**

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01 A 122 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 7/6/2[illegible] |
| ముందు అట్ట | [illegible] |
| వెనుక అట్ట | [illegible] |
| మొత్తం పేజీలు | 51 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | NO |
| లేని పేజీలు | No |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | sandhya |
| స్కాన్ చేసినది | Sandhy |
| పరీక్ష చేసినది | pragathi |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | No |
| పరిస్థితి | Good |